ESTD: 1999 www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 23-09-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 298 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on







# దళిత, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు గ్రీన్ ఛానెల్ ద్వారా తక్షణ సహాయం**
**దశాబ్దం తర్వాత రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా కమిటీ సమీక్ష: సీఎం కీలక ఆదేశాలు**
**సంక్షేమ పథకాల్లో దళిత, గిరిజనులకు సింహభాగం: సచివాలయ సమావేశంలో సీఎం ఉద్ఘాటన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (వుదయం) :** దళితులు, గిరిజనులు మరియు ఆదివాసీల సమగ్ర వికాసం, శ్రేయస్సే ధ్యేయంగా తమ పాలన సాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిల ద్వారానే సమాజంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని, వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న అణచివేతను అడ్డుకునేందుకు అందరూ రాజకీయాలకు అతీతంగా సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి సమక్షంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలవుతున్న తీరుపై ఉన్నతస్థాయి నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో కేసుల విచారణ ప్రగతి, న్యాయస్థానాల్లో కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న ఆర్థిక తోడ్పాటు, పునరావాస చర్యలతో పాటు ప్రత్యేక కోర్టుల పనితీరును సీఎం క్షుణ్ణంగా పరిశీలించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా ఇటువంటి ఉన్నత స్థాయి పర్యవేక్షణ సమావేశం జరగడం గమనార్హం.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఇతర ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, డీజీపీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ, అధిక కేసులు నమోదవుతున్న 73 గ్రామాలపై పోలీసు వ్యవస్థ ప్రత్యేక నిఘా పెట్టాలని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ జిల్లా స్థాయి కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, బాధిత కుటుంబాలకు అందాల్సిన నష్టపరిహారాన్ని బడ్జెట్ పరిమితులతో సంబంధం లేకుండా గ్రీన్ ఛానెల్ మార్గం ద్వారా తక్షణమే విడుదల చేయాలని అధికారులను పురమాయించారు. షాబాద్ మరియు తుక్కుగూడ ఘటనలను ప్రస్తావిస్తూ బాధిత కుటుంబాలకు త్వరితగతిన పూర్తిస్థాయి న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాల బాటలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని, బడ్జెట్ కేటాయింపుల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా నిధులు మంజూరు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. దళిత, గిరిజన వర్గాలకు జనాభా పరిమితిని మించి గృహనిర్మాణ పథకాల్లో ప్రాధాన్యత కల్పించామని, పాఠశాల విద్యార్థులకు ఉపాహారం మరియు సన్నబియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు పౌష్టికాహారం అందుతోందని గుర్తుచేశారు. విద్య ద్వారానే అసమానతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నమ్ముతూ, పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు కూడా ప్రోత్సహించాలని, ఈ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# భారీ వర్షాలు

**గ్రేటర్ పరిధిలో యంత్రాంగం అప్రమత్తం**
**అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు**
**క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (వుదయం) :** రాజధాని నగరంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల రాష్ట్ర అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు నగర పాలక సంస్థల కమిషనర్లు, హైడ్రా సంస్థతో పాటు పోలీసు కమిషనర్లు పరస్పరం సమన్వయం పాటిస్తూ పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని స్పష్టం చేశారు. నగరంలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నీరు చేరిన ప్రాంతాలలో త్వరితగతిన యంత్రాలు, సిబ్బందిని రంగంలోకి దించి నీటిని తోడివేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడటంతో పాటు రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ముందస్తు రవాణా నియంత్రణ చర్యలు తీసుకోవాలని అధికారులను పురమాయించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న నివాస సముదాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాల్వలు, మురుగునీటి వ్యవస్థల్లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏ క్షణంలోనైనా సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచి, స్పందన కేంద్రాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలోనే ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా

# వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణాలు

**కాకతీయ కళాతోరణం, రామప్ప వైభవంతో కొత్త నిర్మాణాలు**
**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విమానాశ్రయ రహదారుల రూపకల్పన**




**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (వుదయం)** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు మన సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్మాణాల ఆకృతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తెలంగాణ ప్రాచీన చరిత్ర, సంస్కృతులకు అద్దం పట్టేలా ఉన్న కాకతీయ కళాతోరణం, రామప్ప దేవాలయం, పిల్లలమర్రి శిల్ప సంపద మరియు వాస్తు కళల రూపురేఖలను పరిగణనలోకి తీసుకుని, ఆ కళాత్మకత ప్రతిబింబించేలా నమూనాలను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ మార్గాలు, వాగుల ప్రవాహాలు, రహదారులు, సమాచార మరియు తాగునీటి వ్యవస్థల మళ్లింపుపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. దీనిపై స్పందించిన సీఎం, విమానాశ్రయాల సరిహద్దు గోడల వద్ద నిర్మించే రహదారులను సమీపంలోని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానించాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు విడివిడిగా పనులు చేపడితే నిర్మాణంలో అడ్డంకులు ఎదురవుతాయని, కాబట్టి రోడ్లుభవనాలు, నీటిపారుదల, తాగునీటి సరఫరా మరియు విద్యుత్ శాఖల అధికారులు సమావేశమై ఒకే సమయంలో సమన్వయంతో పనులు పూర్తయ్యేలా చూడాలని పురమాయించారు.

కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందడుగు వేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాగులు, ఇతర జల ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే ప్రాంగణ సమీపంలో చెరువులను నిర్మించి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలని తెలపడంతో పాటు రవాణా మార్గాలు విశాలంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రహదారులుభవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, ప్రభుత్వ విప్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్



**రూ. 80 కోట్లకు పైగా ఆస్తుల లభ్యం**
**నిమ్స్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ అరెస్ట్**
**ఏడు చోట్ల ఏకకాలంలో దాడులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (వుదయం)** స్థానిక నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసం మరియు ఆయనకు చెందిన ఇతర ప్రాంతాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు విరుచుకుపడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో అధికారి నివాసంతో పాటు ఏకకాలంలో మరో ఏడు చోట్ల విస్తృత సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో దాదాపు ఎనభై కోట్ల రూపాయలకు పైగా విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. నగరంలోని కూకట్ పల్లి, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో విలాసవంతమైన భవనాలు, ఫ్లాట్లతో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్ పేట ప్రాంతాల్లో ఖరీదైన ఖాళీ స్థలాలు, ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో 800 గజాల స్థలాన్ని అధికారులు గుర్తించారు. వీటితో పాటు వివిధ బ్యాంకు ఖాతాలు, అంచె కార్యాలయాల్లో నిల్వలు, ప్రైవేటు సంస్థల్లో పెట్టుబడులు, అరకిలోకు పైగా స్వర్ణాభరణాలు, ఆరు లక్షల రూపాయల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ. 80 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు వెల్లడించారు. సుదీర్ఘ సోదాల అనంతరం సదరు వైద్యుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. గత రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఈ అధికారిపై గతంలోనూ అనేక అవినీతి ఆరోపణలు రావడం గమనార్హం.

# పౌరుల వ్యక్తిగత ఇష్టం

**పూర్తి వందేమాతరం గేయం ఆలపించడం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (ఎఎంఎస్) :** జాతీయ గేయమైన వందేమాతరం పూర్తి రూపంలో ఆలపించడంపై సర్వోన్నత న్యాయస్థానం అత్యంత కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ గేయంలోని ఎన్ని చరణాలు పాడాలనేది పూర్తిగా పౌరుల వ్యక్తిగత నిర్ణయానికే వదిలివేయాలని అత్యున్నత న్యాయపీఠం స్పష్టం చేసింది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను సవాలు చేస్తూ ప్రముఖ సంగీత విద్వాంసుడు టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. గేయంలోని చివరి నాలుగు చరణాలు నిర్దిష్ట మతపరమైన అంశాలను కలిగి ఉన్నాయని, వాటిని అందరి చేత బలవంతంగా పాడించడం రాజ్యాంగం ప్రసాదించిన లౌకిక సూత్రాలకు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ, పూర్తి చరణాలు ఆలపించని పౌరులపై ఎలాంటి క్రమశిక్షణ లేదా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలులేదని తేల్చిచెప్పింది. అలాగే ఈ నూతన నిబంధనలను పాటించని వారిపై ప్రభుత్వం తీసుకోబోయే చర్యల సాధ్యాసాధ్యాలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు మరియు సవరణ చట్టంపై రెండు వారాల్లోగా వివరణ ఇస్తూ సమాధానం దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## ఎత్తివేస్తేనే జలసంధి తెరుస్తాం


**వాషింగ్టన్:** అమెరికా మరియు ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతలలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ దేశాధ్యక్షుడు పెజెష్కియాన్ అమెరికా పర్యటనకు విచ్చేస్తున్న తరుణంలో టెహ్రాన్ ప్రభుత్వం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. అగ్రరాజ్యమైన అమెరికా తన మిలిటరీ బలగాల ఉపసంహరణ వైపు సానుకూల అడుగులు వేస్తే, వారం రోజుల్లోగా ఎంతో వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి నౌకారవాణాకు పునఃప్రారంభిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ వారం న్యూయార్క్ నగరంలో జరగనున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల వేదికగా రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ముందుకు వస్తున్న ఇతర దేశాలతో చర్చలు జరిపేందుకు ఇరాన్ సమాయత్తమవుతోంది. ఈ సంచలన ప్రతిపాదనకు ఇరాన్ అత్యున్నత నాయకుడు మొజ్తబా ఖమేనీతో పాటు అత్యున్నత జాతీయ భద్రతా మండలి సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.




**స్టాక్ మార్కెట్ అప్‌డేట్**

నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్
నిఫ్టీ లాభాల పరంపరకు బ్రేక్
329 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

## ఇంతే కదా...!




# 'ప్రాజెక్ట్ రైనో' ప్రారంభం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (ఎఎంఎస్) :** ప్రపంచ ఖడ్గమృగాల దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఒక కీలకమైన ప్రకటన చేశారు. దేశంలో అరుదైన ఒంటికొమ్ము ఖడ్గమృగాల సంరక్షణ, వాటి నివాస ప్రాంతాల నిర్వహణ మరియు సంతతి పరిరక్షణను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ రైనో'ను అధికారికంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖడ్గమృగాలు నివసించే సంబంధిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి పూర్తిస్థాయి ఆర్థిక మరియు సాంకేతిక సహాయ సహకారాలు అందనున్నాయి.

**జీవవైవిధ్య పరిరక్షణలో సరికొత్త మైలురాయి**

సామాజిక మాధ్యమం వేదికగా ఈ నూతన సంరక్షణ పథకం వివరాలను పంచుకున్న ప్రధాని, దేశంలో జీవుల సంరక్షణను మరింత ముందుకు తీసుకెళ్లడంలో 'ప్రాజెక్ట్ రైనో' మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఖడ్గమృగాల రక్షణ, వాటి ఆవాసాల పర్యవేక్షణ, జన్యుపరమైన అభివృద్ధి మరియు జనాభా విస్తరణపై దృష్టి సారించేందుకు ఈ పథకం రాష్ట్రాలకు తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా, వన్యప్రాణుల రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న అటవీ శాఖ సిబ్బంది మరియు సంరక్షకుల నిస్వార్థ సేవలను ప్రధాని కొనియాడారు.

**ప్రపంచ ఖడ్గమృగాల రాజధానిగా అస్సాం**

ఖడ్గమృగాల పరిరక్షణలో అస్సాం రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రపంచంలోని మొత్తం ఖడ్గమృగాల జనాభాలో దాదాపు 80 శాతం ఒక్క అస్సాంలోనే నివసిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా కాజీరంగా జాతీయ పార్కులో వేటగాళ్ల బారి నుంచి ఖడ్గమృగాలను రక్షించేందుకు చేపట్టిన చర్యలు అంతర్జాతీయంగా విశేష ప్రశంసలు అందుకున్నాయని గుర్తుచేశారు.

**ఇతర రాష్ట్రాల్లో పునరావాస విజయాలు**

అస్సాంతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఖడ్గమృగాల సంరక్షణ చర్యలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని ప్రధాని స్పష్టం చేశారు. ఒకవైపు బీహార్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో ఖడ్గమృగాలు తిరిగి సురక్షితంగా నివాసాలు ఏర్పాటు చేసుకోగా, మరోవైపు ఉత్తర ప్రదేశ్‌లోని దుధ్వా జాతీయ పార్కులో వాటి పునరావాస ప్రక్రియ సరికొత్త చరిత్ర సృష్టిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ఎక్కడ ప్రతిష్ఠించారో అక్కడే నిమజ్జనం

- దుబ్బాక తిలక్ యూత్ వినూత్న ఆలోచన
- మట్టి గణపతికి జలాభిషేకంతో నిమజ్జనం
- కరిగిన మట్టిని పొలాల్లో ఎరువుగా వినియోగం
- పర్యావరణ పరిరక్షణకు ఆదర్శం

**దుబ్బాక, సెప్టెంబర్ 22, వుదయం:**



ఎక్కడ గణపతిని ప్రతిష్ఠించామో అక్కడే నిమజ్జనం చేయాలనే వినూత్న ఆలోచనతో సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో తిలక్ యూత్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వినాయక నిమజ్జనం మంగళవారం నిర్వహించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మట్టితో తయారు చేసిన వినాయకుడిని ప్రతిష్ఠించిన నిర్వాహకులు, గణపతికి బిందెలతో నీటిని పోస్తూ భక్తిపూర్వకంగా జలాభిషేకం చేసి పెట్టిన చోటనే నిమజ్జనం చేశారు. అనంతరం గణపతి విగ్రహం కరిగిన తర్వాత మిగిలిన పవిత్రమైన మట్టిని సేకరించి పొలాల్లో ఎరువుగా వినియోగించడం విశేషంగా నిలిచింది. రంగురంగుల రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా, ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణహిత పద్ధతుల్లో నిమజ్జనం నిర్వహించాలని నిర్వాహకులు సూచించారు. మట్టి గణపతిని కుండ లేదా తొట్టెలో ప్రతిష్ఠించి, భక్తితో నీటిని పోస్తూ అభిషేకం చేసి, అదే ప్రదేశంలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు, ఆ మట్టిని పొలాల్లో వినియోగించుకోవడం ఒక మంచి సంప్రదాయంగా నిలుస్తుందని తెలిపారు. భక్తి, సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణను మేళవిస్తూ దుబ్బాకలో నిర్వహించిన ఈ వినూత్న వినాయక నిమజ్జన కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

# మహిళలు పరస్పరం సహకరించుకుంటూ ఆర్థికంగా ఎదగాలి

- 'మహబూబ్‌నగర్ ఫస్ట్' స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్
- ఐదు విభాగాల్లో అందుతున్న ఉచిత శిక్షణ
- రెడ్డి మహిళా హాస్టల్ ప్రాంగణంలో గణనాథునికి ప్రత్యేక పూజలు

**మహబూబ్‌నగర్**



మహిళలు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఒకరికొకరు తోడ్పాటు నందించుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధించాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 'మహబూబ్‌నగర్ ఫస్ట్' స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆమె సందర్శించి, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు ఉచితంగా నియోజకవర్గంలో అమలు చేస్తున్న యెన్నం హెల్త్ కిట్, హెల్త్ కార్డు, క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్స్, డిజిటల్ లర్నింగ్ సెంటర్లు, మెడికల్ మరియు ఈఏపీసెట్ (EAPCET) ప్రవేశ పరీక్షల కోసం నిర్వహిస్తున్న పయనీర్ (PIONEER) ,NMMS(NATIONAL MEANS MARIT Scholarships) తో పాటు మహిళలకు మహబూబ్‌నగర్ ఫస్ట్' స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉచితంగా అందిస్తున్న నైపుణ్య శిక్షణ వంటి వినూత్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ విద్యార్థినులు రూపొందించిన పలు కళారూపాలను కలెక్టర్ తిలకించి అభినందించారు. అనంతరం వివిధ విభాగాలలో శిక్షణ పొందుతున్న మహిళలతో కలెక్టర్ ముచ్చటించారు. శిక్షణ తీరుతెన్నులు, శిక్షణ పూర్తయ్యాక లభించే ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మహిళల కోసం టైలరింగ్ (కుట్టుమిషన్), కంప్యూటర్ బేసిక్స్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ సహా మొత్తం ఐదు విభాగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. కోర్సు ముగిశాక స్వయం ఉపాధికి మాత్రమే కాకుండా, వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించేలా నాణ్యమైన తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్రంలో విద్యార్థినులు ఏర్పాటు చేసిన వివిధ కోర్సుల ప్రాజెక్టులు, ఉత్పత్తులను ప్రదర్శనను సైతం కలెక్టర్ పరిశీలించి వారి నైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం రెడ్డి మహిళల హాస్టల్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుని మండపాన్ని దర్శించుకుని కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మహిళలోనూ ఏదో ఒక విశిష్ట ప్రతిభ దాగి ఉంటుందన్నారు. "ఒకరికి కుట్టు పనిలో నైపుణ్యం ఉంటే, మరొకరికి మార్కెటింగ్ లేదా కంప్యూటర్ రంగంలో పట్టు ఉండవచ్చు. ఒకరితో ఒకరు అనవసర పోటీ పడటం కంటే, తమకున్న నైపుణ్యాలను పరస్పరం పంచుకుంటూ జట్టుగా ఏర్పడితే వ్యాపారాల్లో అద్భుత విజయాలు సాధించవచ్చు" అని దిశానిర్దేశం చేశారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, పొందిన శిక్షణను ఆర్థిక ఆదాయ మార్గాలుగా మలచుకోవాలని, మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇలాంటి శిక్షణా కేంద్రాలు చక్కటి వేదికలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎన్.పి. నేహా శ్రీ, 'మహబూబ్‌నగర్ ఫస్ట్' పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌ఛార్జ్ నిజలింగప్ప, అనిల్, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



# సదరం కోసం ఇక ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు!

- అర్హులైన దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ధ్రువపత్రాలు
- మానసిక వైకల్య కేసులకు నిపుణుల ప్రత్యేక పరీక్షలు
- ఒక్కచోటే వైద్య పరీక్షలు.. క్రమబద్ధంగా ధ్రువీకరణ
- ఈ నెల 23న మరోసారి ప్రత్యేక శిబిరం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల సెప్టెంబర్ 01 (వుదయం కరస్పాండెంట్)**

సదరం ధ్రువపత్రం కోసం దివ్యాంగులు ఇక ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు మంజూరు చేసే ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, ఒకే వేదికపై అవసర మైన వైద్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపట్టి నట్లు వెల్లడించారు. గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక మెగా సదరం శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. మానసిక వైకల్యానికి సంబంధించిన దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షల నిర్వహణ తీరును, లబ్ధిదారులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అర్హత ఉంటేనే ధ్రువ పత్రం మానసిక వైకల్యానికి సంబంధించిన కేసులను ప్రత్యేకంగా మానసిక వైద్య నిపుణులు పరీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అర్హత ఉన్న వారికి మాత్రమే సదరం ధ్రువపత్రాలు జారీ చేస్తా మని స్పష్టం చేశారు. మానసిక వైకల్యానికి సంబంధం లేని ఇతర అనారోగ్య సమస్య లతో శిబిరానికి వచ్చిన వారిని జనరల్ మెడిసిన్ విభాగానికి పంపించి, సంబంధిత వైద్యులు పరీక్షించిన అనంతరం నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. పక్షవాతం, ఇతర శారీరక అనారోగ్యాలకు మానసిక వైకల్య ధ్రువపత్రం జారీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆయా సమస్యలకు సంబంధిత వైద్య విభాగాలను సంప్రదించా లని సూచించారు. ప్రతి కేసును వైద్య నిపు ణులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ధ్రువీ కరణ పత్రం జారీ చేయాలని అధికారు లను ఆదేశించారు. టోకెన్.. సీరియల్.. వైద్య పరీక్ష శిబిరానికి వచ్చే దివ్యాంగులకు టోకెన్ నంబర్లు కేటాయించి, సీరియల్ నంబర్ ప్రకారం వైద్య పరీక్షలకు పంపాలని కలెక్టర్ సూచించారు. అందుబాటులో ఉన్న స్లాట్లకు అనుగుణంగా లబ్ధిదారులను క్రమబద్ధీక రించి, రద్దీ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మానసిక వైకల్యా నికి సంబంధించిన వారు మాత్రమే సంబం ధిత విభాగంలో నమోదు చేసుకు నేలా సిబ్బంది ముందస్తుగా అవగాహన కల్పిం చాలని సూచించారు. దీంతో అనవ సర రద్దీని నియంత్రించడంతో పాటు, అవసర మైన వారికి వేగంగా వైద్య సేవలు అందించవచ్చని తెలిపారు. 92 మందికి స్లాట్లు.. 58 మంది చిన్నారులు ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న 92 మంది దివ్యాంగుల్లో 58 మంది చిన్నారులు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం ధ్రువపత్రం పొందే ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సదరం ధ్రువీకరణ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఇలాంటి ప్రత్యేక శిబిరాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 23వ తేదీన మరోసారి ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ముషాహిదా బేగం, డీపీఎం అరుణ, ఏపీఎం భీమన్న, డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.



# శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డికి స్థానికుల వినతి

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 22)**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్ ఫేస్1, ఫేస్2లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు, లబ్ధిదారులు డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డిని కేసీఆర్ నగర్ ఫేస్1 వద్ద కలిశారు. కాలనీలో రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం, పారిశుద్ధ్య లోపాలపై స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. శానిటేషన్ నిర్వహణను మెరుగుపరచడంతో పాటు క్రమం తప్పకుండా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు తెలిపిన సమస్యలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

# షాదీఖానా అభివృద్ధికి మంత్రి అజారుద్దీన్ హామీ

- "ముస్లిం ఫంక్షన్ హాల్‌కు త్వరలో మరమ్మతులు
- అవసరమైన నిధుల మంజూరుకు సానుకూల స్పందన"
- "పేద కుటుంబాల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు"
- "ముజఫర్ హుస్సేన్ వినతిపై మంత్రి భరోసా"

**కోహీర్, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**



కోహీర్ పట్టణంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ముస్లిం ఫంక్షన్ హాల్ (షాదీఖానా) అభివృద్ధి అంశంపై కాంగ్రెస్ పార్టీ కోహీర్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కోహీర్‌లోని షాదీఖానా భవనం ప్రస్తుతం దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దెబ్బతిన్న భవనంతో ఇబ్బందులు

**పేద కుటుంబాలకు శుభకార్యాల నిర్వహణ భారంగా మారుతోంది**

మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తిఅవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరిన ముజఫర్ హుస్సేన్సమస్యను ప్రాధాన్యతగా పరిశీలిస్తామని మంత్రి హామీకోహీర్‌లోని షాదీఖానా భవనం దెబ్బతిన్న కారణంగా శుభకార్యాల సమయంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముజఫర్ హుస్సేన్ వివరించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల ఖర్చులు భారంగా మారుతున్నాయని తెలిపారు. అందువల్ల షాదీఖానాకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని మంత్రిని కోరారు.సమస్యపై మంత్రి సానుకూల స్పందనముజఫర్ హుస్సేన్ వివరించిన సమస్యలపై మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. షాదీఖానా మరమ్మతులు, అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. పేద ముస్లిం కుటుంబాలకు ప్రయోజనంషాదీఖానా అభివృద్ధి పూర్తయితే కోహీర్ పట్టణంలోని పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు వివాహాలు, ఇతర శుభకార్యాల నిర్వహణలో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ముజఫర్ హుస్సేన్ పేర్కొన్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని భవనం అభివృద్ధికి మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంత్రి హామీపై కృతజ్ఞతలుకోహీర్ షాదీఖానా అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసేందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌కు ముజఫర్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. షాదీఖానా అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమై ప్రజలకు అందుబాటులోకి రావాలని కోహీర్ టౌన్ ప్రెసిడెంట్ ఆకాంక్షించారు.

# గణేష్ గడ్డపై భక్తజన సంద్రం

- 9వ రోజు వైభవంగా 'శ్రీ లక్ష్మీ గణపతి' దర్శనం!
- 108 ప్రదక్షిణలు చేసి 11 రోజులు తిరిగితే కోరిన మొక్కులు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం

**సదాశివపేట సెప్టెంబర్ 22 (వు దయం):**



ఈవో లావణ్య గారి నిరంతర నిఘా, పర్యవేక్షణ.. భక్తులకు సకల సౌకర్యాలు! కమిటీ సభ్యుల అసాధారణ చాతుర్యం, చొరవ.. సజావుగా సాగుతున్న ఉత్సవాలు! ఈవో గారికి, ఆలయ కమిటీకి చేతులెత్తి కృతజ్ఞతలు తెలుపుతున్న భక్తజనం!

**ఆకలి తీర్చే అన్నప్రసాదం.. నిరంతరాయంగా నిత్యాన్నదానం!**

రుద్రారం (ఇస్నాపూర్ మున్సిపాలిటీ): రుద్రారం శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 9వ రోజైన నేడు ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంగా మారి కిటకిటలాడింది.

**శ్రీ లక్ష్మీ గణపతి రూపంలో దివ్య దర్శనం – 108 ప్రదక్షిణలు:**

కోరిన కోరికలు తీర్చే సిద్ధి గణపతి నేడు 'శ్రీ లక్ష్మీ గణపతి' దివ్య రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి చుట్టూ భక్తిశ్రద్ధలతో 108 ప్రదక్షిణలు చేసి, 11 రోజులు తిరిగితే సమస్త విఘ్నాలు తొలగి కోరిన మొక్కులు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం! తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలి వచ్చిన భక్తులు 108 ప్రదక్షిణలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈవో లావణ్య గారి నిరంతర నిఘా - పర్యవేక్షణ:భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారిణి (ఈవో) లావణ్య గారు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లు, పరిశుభ్రత, ఎండ తగలకుండా షామియానాలు, చల్లని తాగునీరు, నిరంతర అన్నదాన ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేస్తూ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు.

**కమిటీ సభ్యుల చాతుర్యం – భక్తుల కృతజ్ఞతలు:**

భారీ రద్దీని సమర్థవంతంగా నియంత్రిస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా సకల ఏర్పాట్లు చేయడంలో ఆలయ కమిటీ సభ్యులు అద్భుతమైన చాతుర్యం, విశేష చొరవ చూపించారు. భక్తులను కంటికి రెప్పలా చూసుకుంటూ సౌకర్యాలు కల్పించినందుకు ఈవో లావణ్య గారికి, ఆలయ కమిటీ సభ్యులకు భక్తులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

**పూజల్లో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో ఈవో లావణ్య గారితో పాటు కమిటీ ప్రతినిధులు, ప్రముఖులు పట్లోళ్ల లక్ష్మారెడ్డి, కె. సాయి గణేష్, ఎస్. సతీష్ కుమార్, ఎ. మురళి గౌడ్, ఎ. సంతోష్, ఎ. ప్రభు, టి. శివ రాములు, ఎ. రాజేష్‌గౌడ్, ఎ. ముకుంద రెడ్డి, సి. నారాయణ రెడ్డి, డి. మహేష్, ఎ. కృష్ణ, ఆర్. శ్రీనివాస్, ఎం. భరత్ తదితరులు పాల్గొన్నారు.

# 290 మంది పిల్లలు.. 5 మంది గురువులా?

- మన్నపురం బడికి అధికారుల శాపం.. చదువులపై నిర్లక్ష్యపు నీడ!
- తరగతులు 1 నుంచి 8 వరకు.. విద్యార్థులు 290 మంది
- ప్రధానోపాధ్యాయుడితో కలిపి బోధించేది ఐదుగురే!
- జిల్లాలో గుర్తింపు పొందిన బడికి ఇదేం దుస్థితి?
- పిల్లల చదువును పణంగా పెట్టి సర్దుబాట్లతో సరిపెడతారా?
- "కలెక్టర్ గారూ.. మా బడిని ఒక్కసారి పట్టించుకోండి" అంటున్న తల్లిదండ్రులు

**ధరూర్, సెప్టెంబరు 22 (వుదయం బ్యూరో)**



బడిలో పిల్లలకు కొదవలేదు.. చదువుకోవా లన్న తపనకు కొదవలేదు.. కానీ పాఠాలు చెప్పే గురువులే కరువయ్యారు! 290 మంది విద్యార్థులతో కళకళలాడాల్సిన మన్నపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతతో సతమతమవుతోందని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న 290 మంది విద్యార్థుల బాధ్యతను ప్రధానోపాధ్యాయుడితో కలిపి కేవలం ఐదుగురు ఉపాధ్యాయులే నిర్వహిస్తున్నారని వారు చెబుతున్నారు. ఇంతమంది పిల్లలకు ఇంతమంది గురువులేనా? అనే ప్రశ్న ఇప్పుడు మన్నపురం గ్రామంలో తీవ్రంగా వినిపిస్తోంది. బడి నిండా పిల్లలు.. బోధించే చేతులు మాత్రం తక్కువ! పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 150 మంది, 6 నుంచి 8వ తరగతి వరకు 140 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 290 మంది విద్యార్థులకు పరిమిత సంఖ్యలో ఉపాధ్యాయులే ఉండటంతో బోధన నిర్వహణపై ఒత్తిడి పెరుగుతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంతోపాటు రికార్డుల నిర్వహణ, పాఠశాల పరిపాలనా పనులు, వివిధ విద్యా కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ వంటి బాధ్యతలు కూడా నిర్వహించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

**ఒక గురువుపై ఎన్ని బాధ్యతలు? ఒక తరగతిపై ఎంత శ్రద్ధ?**

ఒక విద్యార్థికి ఎంత సమయం? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆదర్శ' బడికి ఈ అవస్థలేంటి? పునాది అక్షరాస్యత, గణిత నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో మన్నపురం పాఠశాల మెరుగైన ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందిందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రతిభ చూపిన బడిని అభినందిస్తారు.. మరి ఆ ప్రతిభను నిలబెట్టే గురువులను ఎందుకు ఇవ్వరు? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా ఉపాధ్యాయుల సంఖ్య అందుకు అనుగుణంగా లేకపోవడంతో పాఠశాల సాధించిన విద్యా ఫలితాలు భవిష్యత్తులో కొనసాగుతాయా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సర్దుబాట్లతో సరిపెడితే.. పిల్లల చదువే సర్దుబాటవుతుంది! ఉపాధ్యాయుల కొరతను తాత్కాలిక సర్దుబాట్లతో పరిష్కరించడం కాకుండా విద్యార్థుల సంఖ్య, తరగతుల అవసరాలు, సబ్జెక్టుల ఆధారంగా సిబ్బందిని కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పిల్లల భవిష్యత్తు కూడా 'సర్దుబాటు' చేయాల్సిన అంశమేనా?**

అని వారు నిలదీస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా తగినంత మంది ఉపాధ్యాయులు ఉండాల్సిందేనని గ్రామస్థులు అంటున్నారు. కలెక్టర్.. 290 మంది పిల్లల గొంతు వినండి! మన్నపురం పాఠశాల పరిస్థితిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్లు స్పష్టం:వెంటనే అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలి. 290 మంది విద్యార్థులకు అనుగుణంగా సిబ్బంది అవసరాన్ని పునఃసమీక్షించాలి. 6-8 తరగతులకు సబ్జెక్టుల వారీగా తగిన బోధనా సిబ్బందిని ఏర్పాటు చేయాలి. పాఠశాల విద్యా ప్రమాణాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి. పాఠశాలను అధికారులు స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలి. గురువుల కోసం మా పిల్లలు ఎదురుచూడాలా?" మా పిల్లలు చదువుకోవాలనుకుంటున్నారు. బడికి వస్తున్నారు. కానీ తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం మా బాధ. పిల్లల చదువు దెబ్బతినే పరిస్థితి రాకముందే అధికారులు స్పందించాలి. మా బడికి అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలి" అని తల్లిదండ్రులు కోరుతున్నారు. మన్నపురం పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బోధనా సిబ్బంది ఉన్నారా? ఖాళీ పోస్టులు ఎన్ని? మంజూరైన పోస్టులు ఎన్ని? ప్రస్తుతం పనిచేస్తున్న వారు ఎంతమంది? అన్న వివరాలను విద్యాశాఖ అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అంటున్నారు. పిల్లలు ఉన్నారు.. బడి ఉంది.. చదువుకోవాలనే తపన ఉంది.. ఇక కావాల్సింది ఒక్కటే——వారికి సరిపడా గురువులు! మన్నపురం పాఠశాల విషయంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి, విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్



**వుదయం మనూరుసెప్టెంబర్:22**

మానూర్ మండలం కమలాపూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడింగ్, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు .ఈ సందర్భంగా చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ.వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు,మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ప్రజలు కూడా అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్,మైతాబ్, కమలాపూర్ సర్పంచ్ రమేష్,తిమ్మాపూర్ సర్పంచ్ గిర్మాజ భరత్ పటేల్,దత్తు రెడ్డి,పోలీస్ అధికారులు,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ పదవి దక్కడంతో ఖేడ్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 22 (వుదయం)**

డిసిసి పదవిది అక్కడముతోఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి)అధ్యక్షుడిగా పటోళ్ల చంద్రశేఖర్ రెడ్డి నియమితులైన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్తగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడికి అభినందనలు తెలుపుతూ శాలువా పూలమాలతో సత్కరించారు.





# ఖేడ్ అభివృదే మా లక్ష్యం

- పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన, ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్

**నారాయణఖేడ్ సెప్టెంబర్ 22(వుదయం)**



బతుకమ్మ కుంట వద్ద మెట్ల నిర్మాణానికి భూమి పూజ,రింగ్ రోడ్డు విద్యుద్దీపాల ట్రాన్స్‌ఫార్మర్ అభివృధి పనులను ప్రారంభించిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేశ్ శెట్కర్.నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో బతుకమ్మ పండుగ కోసం బతుకమ్మ కుంట వద్ద మహిళల సౌకర్యార్థం ప్రత్యేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎస్డీఎఫ్ నిధులద్వార రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న బతుకమ్మ ఘాట్ (మెట్ల) నిర్మాణ పనులకు మంగళవారం శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు.

అనంతరం, మున్సిపల్ పట్టణంలోని 11 వ వార్డులో లో ఓల్టేజ్ సమస్య ప్రజలు వినతితో లింక్ రోడ్లను కలిపే రింగ్ రోడ్డుపై విద్యుత్ దీపాల (స్ట్రీట్ లైట్స్) వెలుగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 132 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం సంయుక్తంగా

**ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పండుగ వేళ బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి, ఆడుకోవడానికి వచ్చే ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ. 10 లక్షల నిధులతో పటిష్టమైన మెట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.పట్టణ ప్రయాణికులు, ప్రజల రాకపోకలకు కీలకమైన రింగ్ రోడ్డుపై రాత్రి వేళల్లో చీకటి సమస్య లేకుండా విద్యుత్ దీపాలు వెలిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి, సమన్వయం చేసుకుని వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాస్పరి ప్రశాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్,రాజు, రుక్మిణి గోపాల్ రెడ్డి,షారుఖాన్,మహేష్ చౌహాన్,సుబుర్,మైతాబ్,వివేకానంద, లక్ష్మణ్,కౌన్సిలర్లు, ముంతాజ్ సెట్, మొహీద్ మున్సిపల్ కొ ఆప్షన్ సభ్యులు,పండరి రెడ్డి ఖేడ్ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,తాహిర్ అలీ ,రామకృష్ణ మాజీ ఎంపీటీసీ,విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# ఈ నెల 30వరకు రైతు రిజిస్ట్రేషన్ ఫార్మర్ ఐడి చేయించుకోవాలి

- ఏఈఓ రవి


**పూడూరు సెప్టెంబర్ 23 (వుదయం ప్రతినిధి )**

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మంచన్పల్లి రైతు వేదికలో మంగళవారం రోజు రైతు రిజిస్ట్రేషన్( ఫార్మర్ ఐడి ) నమోదు చేసిన ఏఈఓ రవి, ఈనెల 22 నుండి 30 తారీఖు వరకు ప్రతి రైతు ఏఈఓ ల దగ్గర రైతు రిజిస్ట్రేషన్(ఫార్మర్ ఐడి) పంట నమోదు చేసుకోవాలని అన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పంటలు వేసినట్టు అయితే ఫార్మర్ సిస్టర్ చేసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని, రైతులకు సరిపడే విధంగా ఎరువులు అందుతాయి, అదే విధంగా బ్యాంకుల ద్వారా ఏ పంటకు ఎంత రుణం అనేది బ్యాంకు రుణాలు పొందవచ్చు అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సేవలు ఇతర ప్రయోజనాలు పొందడానికి ఉపయోగ పడుతుందని అన్నారు ప్రతి గ్రామంలో రైతు రిజిస్ట్రేషన్ క్యాంపస్లు నిర్వహించ బడుతున్నవి అందరు రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఈఓ రవితో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్





- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఈదుల నాగులపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం..

**రామచంద్రాపురం ,సెప్టెంబర్ 22(వుదయం)**

పటాన్ చెరువు నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం తన సొంత నిధుల నుంచి రూ.3 లక్షలు విరాళంగా అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత నిస్తూ పటాన్చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని జీఎంఆర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, డీఈ కృష్ణవేణి, ఏఈ ఫైజాన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్‌రెడ్డి, కొమరయ్య, శ్రీకాంత్, నాగరాజు, శ్రీశైలం, నాయకులు రమేష్, చెన్నారెడ్డి, సాయిచరణ్‌గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో సత్తా చాటండి...

## దేశం గర్వించేలా మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి.

- సంగారెడ్డి జిల్లా కబడ్డీ క్రీడాకారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచన

**పటాన్చెరు సెప్టెంబర్ 22, వుదయం**

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా క్రీడాకారులు ప్రతిభను చాటుకుని ప్రథమ స్థానాన్ని సాధించే దిశగా సమష్టి కృషి చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ప్రోత్సాహం అందించడం ద్వారా జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత మంది క్రీడాకారులు ఎదగడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ నెల 26, 27, 28 తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా.. వేములవాడ కేంద్రంగా జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్టు కోసం పటాన్చెరు డివిజన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఆడిటోరియంలో నిర్వహిస్తున్న పది రోజుల శిక్షణ శిబిరాన్ని



మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, వారి ఫిట్‌నెస్, ప్రాక్టీస్ విధానం, కోచ్‌ల మార్గదర్శకాలను ఆయన స్వయంగా పరిశీలించారు. క్రీడాకారులతో మాట్లాడి పోటీలకు వారి సన్నద్ధత, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రత్యర్థి జట్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు శారీరక దారుఢ్యంతో పాటు వ్యూహాత్మకంగా కూడా సిద్ధం కావాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కబడ్డీ మన దేశ సాంప్రదాయ క్రీడల్లో ఒకటని, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ క్రీడ ద్వారా వెలుగులోకి వస్తున్నారని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రమశిక్షణ, పట్టుదల, జట్టు సమన్వయంతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో సంగారెడ్డి జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలకు ముందు ప్రతి క్రీడాకారుడు తన సామర్థ్యంపై పూర్తి నమ్మకంతో ఉండాలని, జట్టు సభ్యుల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం పోటీ కోసం మాత్రమే కాకుండా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా కోచ్‌లు, నిర్వాహకులు, క్రీడాకారులు ఎమ్మెల్యేకు శిబిరం నిర్వహణ, శిక్షణా కార్యక్రమాల వివరాలను వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు క్రీడాకారులు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కబడ్డీ జాతీయ జట్టు మాజీ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కౌన్సిలర్ అంతిరెడ్డి, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, వెంకటేష్,

కబడ్డీ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి గౌతమ్, జూనియర్స్ కోచ్ పండు, క్రీడాకారులు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ కొత్త పైపులైన్ పనులు ప్రారంభించిన సర్పంచ్

**ఝరాసంగం సెప్టెంబర్-22 (వుదయం ప్రతినిధి)**

ఝరాసంగం పరిధి లోని గంగాపూర్ గ్రామ సర్పంచ్, షహజాద్ బీ.గారు,మరియు యువనాయకుడు ఇమ్రాన్ పటేల్,గ్రామంలో,ప్రజలు నీటి సమస్య తో బాధ పడుతున్నారని,నీటి,తీవ్రతను దృష్టిలో ఉంచుకొని,పాత పైపు లైన్ పాడవడం తో ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని, ప్రజల కొరకు, మిషన్ భగీరథ క్రొత్త పైపులైన్ పనులను పూజచేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్,& యువనాయకుడు ఇమ్రాన్ పటేల్, ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్ శివరాజ్ పాటిల్, సంజీవ్ పాటిల్, బాబురావు పాటిల్,నిరంజన్, బాబు, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు

## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి ఘనంగా నివాళులర్పించిన నాయకులు



**హైదరాబాద్ సెప్టెంబర్ 22, వుదయం**

ఈ రోజు 21 సెప్టెంబర్ 2026 అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం మరియు అమీన్పూర్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు శ్రీ ఆదెల్లి రవీందర్, శ్రీ మాకం మల్లేష్ గార్ల నేతృత్వంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజి శ్రీ భావనా ఋషి పద్మశాలి భవనం యందు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ గారి 14 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శ్రీ మాకం మల్లేష్‌గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ లో నిర్వహించబోతున్న ఎయిర్ పోర్ట్ కు శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ గారి పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి అమీన్పూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కుంట్ల యెల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, అమీన్పూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వనం యాదగిరి, ప్రధాన కార్యదర్శి చెన్న మోహన్, మసుర ఆగమయ్య, గోప దుర్గయ్య, పంచల జనార్ధన్, వేముల మల్లేశం, పొన్న ప్రభాకర్, విద్యాసాగర్, ఉడుత ఆనంద్, రామనాథం,

ఆలె వెంకటనారాయణ, నాగరాజు, రాజకుమార్, గోప శ్రీ విష్ణు, చెక్కు నర్సయ్య , పాండురంగం, పట్నం కృష్ణ, వెంకటేశ్వర్లు, సంగు ప్రభాకర్ మరియు పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ లో రూ.1.93 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు..



**రామచంద్రాపురం,సెప్టెంబర్ 22(వుదయం )**

తెల్లాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. కొల్లూరు 2బీహెచ్‌కే ఫేజ్-1 నుంచి ఉస్మాన్‌నగర్ వరకు ప్రధాన రహదారిపై సెంటర్ మీడియన్‌లో రూ.1.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెల్లాపూర్ డివిజన్‌లో జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో రాత్రివేళల్లో ప్రయాణికులకు మెరుగైన వెలుతురు అందడంతోపాటు రహదారి సురక్షితంగా, సుందరంగా మారుతుందన్నారు.

పటాన్చెరు నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు దశలవారీగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, డీఈ కృష్ణవేణి, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీరంగూడలో ఘనంగా మహా అన్నదానం





- భక్తులకు స్వయంగ ప్రసాదం వడ్డించిన కాట దంపతులు....

**అమీనాపూర్ సెప్టెంబర్ 22 వుదయం**

అమీనాపూర్ , బీరంగూడ గుట్ట కమాన్ వద్ద శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ పరిసరాల్లో భారీ ఎత్తున 'మహా అన్నదాన' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తరలివచ్చిన కాంగ్రెస్ నేతలు:ఈ మహా అన్నదాన కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్ (కాట దంపతులు) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించి తమ భక్తి చాటుకున్నారు.అనంతరం వారు వినాయక మండపంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ రామలింగాచౌడేశ్వరి ఆలయంలో శ్రావణమాసం ముగింపు వేడుకలు



- భజన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి వుదయం**

సదాశివపేట పట్టణంలోని హాట్కర్పేట్‌లో కొలువుదీరిన అతి పురాతనమైన శ్రీ రామలింగాచౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.శ్రావణమాసం ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయ ప్రాంగణం భక్తి గీతాలు, భజనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.99 వేలకు వినాయకుడి లడ్డూ దక్కించుకున్న ఆకుల మధుకర్

- వినాయకుడి లడ్డూ వేలంలో 99 వేల రూపాయలకు గెలుచుకున్న ఆకుల మధుకర్

**మేడిపల్లి వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 22.**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి లడ్డూ వేలం మంగళవారం ఉత్సాహంగా జరిగింది.ఈ లడ్డూ వేలంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల మధుకర్ 99వేల రూపాయలకు లడ్డూను గెలుచుకున్నారు.అనంతరం లడ్డూను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఆకుల మధుకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ....

.. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తి,



ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, కుర్ర శ్రీకాంత్ గౌడ్, బండి శ్రీరాములు గౌడ్, చెరుకు మహేష్ గౌడ్, అలవాల దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుట్టలుగా చెత్త, రోగాల బారిన పడుతున్న అవంతిక అపార్ట్మెంట్స్ వాసులు.


**అమీన్‌పూర్, సెప్టెంబర్ 22 వుదయం**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అవంతిక అపార్ట్‌మెంట్స్ (Avanthika Apartments) పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. అపార్ట్‌మెంట్‌కు సమీపంలోనే పెద్ద ఎత్తున వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఇష్టారాజ్యంగా పడేస్తుండటంతో స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

నివాస ప్రాంతాలకు ఇంత దగ్గరగా చెత్తను వేయడం మరియు అపార్ట్ మెంట్ ముందు చెరువు ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, ఇళ్లలో కనీసం ప్రశాంతంగా జీవించలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్న వృద్ధులు, పిల్లలు:**





సరిగ్గా అపార్ట్‌మెంట్ పక్కనే పేరుకుపోతున్న ఈ చెత్త కుప్పల వల్ల దోమలు,

ఈగలు మరియు దుర్వాసన విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల అమీన్‌పూర్ పరిసరాల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు (Respiratory issues) మరియు ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఈ కాలుష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇక్కడ పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించాలని కోరారు . భవిష్యత్తులో ఇక్కడ చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అమీన్‌పూర్ మరియు అపార్ట్మెంట్ వాసులయినా విజయ్ భాస్కర్ రెడ్డి, రఘుపతి రెడ్డి , నాగారం అంజి రెడ్డి, మిట్ట గోపాల్ రెడ్డి , గోరఖ్నాథ్ మరియు శివరాం ఇంకా తదితరులు కోరుతున్నారు.

## పెళ్లి పేరిట ఐటీ ఉద్యోగినులకు వల

**హైదరాబాద్:**

మ్యాట్రిమోని సైట్లలో రిజిస్టర్ చేసుకుని.. యువతులను రూ.కోట్లలో మోసం చేస్తున్న వెంకట కామేష్ అలియాస్ కార్తీక్‌రెడ్డిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన చెందిన మండ వెంకట కామేష్‌పై బీటెక్ చదివాడు. మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో తనను తాను బాగా డబ్బున్న ఎన్ఆర్ఐగా పరిచయం చేసుకునేవాడు. ఆ తర్వాత వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, నమ్మకం కుదిరిన తర్వాత అత్యవసరాల పేరుతో బాధితుల నుంచి భారీగా డబ్బులు గుంజేవాడు.


**IN THE COURT OF THE HON'BLEHON'BLE XIX JUNIOR CIVIL JUDGE, C.C.C. AT: HYDERABAD**
**O.S. No. 2818 of 2026**

**Between :**
V. Rajei & others ...Plaintiffs
**AND**
1. MRO/Tahsildar Saidabad Mandal
2. All concern. ...Defendants

Notice/summons to All Concern

Please take notice to all concern and to general public hear by notice that, the above plaintiffs are filed suit for declaration of Legal Heirs to declare them as Legal Heirs of Late Vedthya Mothilal died on: 20-06-2025, as such above named plaintiffs are legal heirs to him, and if any persons having any objections, therefore it is to inform to the general public that. If anybody having any objection related to said facts and persons, may be appear before this Hon'ble court on 07-10-2026 at 10.30 AM, either in person or through on Advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

**// By Order of the Hon'ble Court //**

**Sd/-**
**P.VITTAL**
**Advocate**
**# H-No.9-3-79, Champapet,**
**Hyderabad-500079**
**Ph.No.9246578782**



**IN THE COURT OF THE HONBLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD**
**O.S. NO. 605 OF 2026**

**Between :**
1.Smt Lalpet Kasturi w/o late Sri Lalpet Rajen Babu , age :- 78 yrs, occ:-household, r/o C124, AWHO Ved Vihar Colony , Near RTC Colony , Tirumalgiri Hyderabad , Telangana 500015 , Aadhar no 5617 0351 3843
2.Smt Sarojini Rajan alias Bellamkonda Sarojini d/o late Sri Lalpet Rajan Babu, w/o Bellamkonda Amar Kumar age :-54 yrs , occ:- working in USA, 4009 LYLEWOOD,CT, SAN JOSE, CALIFORNIA, USA 95121 permanent address in India r/o C124, AWHO Ved Vihar Colony , Near RTC Colony , Tirumalgiri Hyderabad , Telangana 500015 passport no 569393894 ( USA) Represented by GPA HOLDER ie plaintiff no 3
3. Smt Madhavi Chilukuri , d/o late Sri Lalpet Rajen Babu,w/o Vinod Venkata Chilukuri, age :-53 ys , occ:- self employed, permanent address r/o villa 195,BTR BY MAK PROJECTS , PO TUMMALUR, K.V RANGA REDDY DIST TELANGANA 501359 presently r/o C124, AWHO Ved Vihar Colony , Near RTC Colony , Tirumalgiri Hyderabad , Telangana 500015 Aadhar no 6103 1052 0082
4. Sri Kalyan Babu Rajen s/o late Sri Lalpet Rajen Babu,age :-52 yrs , occ: working in USA 823 CEZANNE DR SUNNYVALE CALIFORNIA, USA permanent address in India r/o C124, AWHO Ved Vihar Colony , Near RTC Colony , Tirumalgiri Hyderabad , Telangana 500015 Passport no Z5710279 Aadhar no 2112 5887 3774 Represented by GPA HOLDER ie plaintiff no 3
**...Plaintiffs 1 TO 4**
**AND**
1. Tahsildar /Mandal Revenue Officer, TIRUMALGIRI , Secunderabad /Telangana
2. All concerned
**...Defendants 1 to 2**

To, All concerned, Please take notice that the above SUIT FOR DECLARATION is filed by plaintiffs against all concerned and other FOR declaring Plaintiffs No 1 to 4 are the Legal heirs of LATE SRI LALPET RAJEN BABU for legal status. Plaint presented under Sec 26 Order 7 rules 1 & 2 CPC and the same is posted to 5-10-2026 for your appearance in the above said court at 10.30A.M .If you fail to attend the court on the day the matter will be heard and decided expartee. 5-10-2026 at 10.30A.M. at City Civil Court at Secunderabad

**BY ORDER OF THE HONBLE COURT**


**sd/-**
**Counsel for Plaintiffs**
**Anita Vanam /, E.Satya Chandrodayam**
**Advocates**
**9849227555 ,**
**Secunderabad**



“ఐక్యరాజ్య సమితిని సంస్కరించాలి. ప్రస్తుత అవసరాలు, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలిలో మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. భద్రతా మండలి అనుబంధ సంఘాలు పూర్తి పారదర్శకత పాటించడంలేదు. సంఘర్షణలు, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలు వంటి సమస్యలతో ప్రస్తుతం ప్రపంచ వ్యవస్థ ఒత్తిడిలో ఉంది. ఈ పరిస్థితులను నియంత్రించకుండా వదిలేస్తే అది అంతర్జాతీయ సహకార స్ఫూర్తిని ప్రశ్నార్థకం చేస్తుంది. శాంతి, అంతర్జాతీయ భద్రత, వాతావరణ చర్యలు, సాంకేతికత, ఉగ్రవాద నిరోధక చర్యలు, విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం, మహమ్మారులకు సిద్ధమవడం వంటిఅంశాలు కూడా ప్రమాదంలో ఉన్నాయి.”

**- ఎస్. జైశంకర్, కేంద్ర మంత్రి**

## వే‘మన’ పద్యం



**ఇహపరంబులకును నిది సాధనంబని**
**వ్రాసి చదివి విన్నవారికెల్ల**
**మంగళంబు లొనరు మహిలోన నిది నిజము**
**విశ్వదాభిరామ వినురవేమ.**

# సంపాదకీయం

## జిఎస్‌టి లక్ష్యాలు ఇంకా నెరవేరలేదు

**2004`05**లో సర్వీస్ టాక్స్ రూపంలో ప్రారంభమైన ఈ పన్ను, తరువాత జిఎస్‌టిగా కొనసాగింది. బీమా ప్రీమియంపై పన్ను విధించడం ప్రారంభం నుంచే సామాజిక భద్రతకు సంబంధించిన అంశంగా వివాదాస్పదమైంది. తక్కువ, మధ్యతరగతి ప్రజల ఆదాయంలో గణనీయమైన భాగం పరోక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతోందనే వాదనలు కూడా ఉన్నాయి. 2017 జులై 1న అమల్లోకి వచ్చిన జిఎస్‌టి అనేక కేంద్ర, రాష్ట్ర పరోక్ష పన్నులను ఏకీకృతం చేసింది. ప్రారంభంలో నెలకు సుమారు రూ.90 వేల కోట్లుగా ఉన్న జిఎస్‌టి వసూళ్లు తరువాత నెలకు రూ.2 లక్షల కోట్ల స్థాయికి చేరాయి. అయితే ధరలు తగ్గడం, పేద రాష్ట్రాలకు ప్రయోజనం కలగడం, పన్ను వ్యవస్థను సులభతరం చేయడం వంటి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదు. పేద, మధ్యతరగతి ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఇంకా ఉంది. అత్యవసర, నిత్యావసర వస్తుసేవలపై జిఎస్‌టి భారాన్ని తగ్గించాలనే డిమాండ్లు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు కేంద్ర`రాష్ట్రాల మధ్య ఆదాయ పంపిణీ విధానంలో మార్పులు కోరుతున్నాయి. మార్కెట్ శక్తుల ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న సమయంలో జిఎస్‌టి శ్లాబులను మరింత హేతుబద్ధీకరించి ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీమా ప్రీమియంపై జిఎస్‌టి రద్దు కోసం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలకు పైగా ఉద్యమం సాగింది. 2004లో సుమారు 30 లక్షల సంతకాలు సేకరించి ప్రభుత్వానికి సమర్పించారు. 2014, 2016లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి వినతులు అందించారు. పార్లమెంట్ సభ్యులను కలిసి బీమా పాలసీలపై పన్ను రద్దు చేయాలని కోరారు. 2017లో బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరించాలని కోరుతూ సుమారు 45 లక్షల సంతకాలను సేకరించి ఆర్థిక మంత్రికి సమర్పించారు. 2019లో వివిధ రాజకీయ పార్టీల ముఖ్యులను కలిసి మద్దతుకోరడంతోపాటు పార్లమెంట్ సభ్యులకు వినతులు అందించారు. 2019 నుంచి 2024 వరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు పలుమార్లు లిఖితపూర్వకంగా విజ్ఞప్తులు చేశారు. నీతి ఆయోగ్ సభ్యలను కూడా కలిసి ఈ సమస్యపై జోక్యం చేసుకోవాలని కోరారు. 2024లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల అభ్యర్థులను కలిసి ఈ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

అదే ఏడాది వందలాది మంది పార్లమెంట్ సభ్యులను కలిసి సమస్యను వివరించారు. అనేక మంది ప్రజాప్రతినిధులు, సీనియర్ మంత్రులు ఈ డిమాండ్‌కు మద్దతు ప్రకటించడంతో ఉద్యమం మరింత విస్తృతమైంది.చివరకు జిఎస్‌టి రద్దు నిర్ణయం పాలసీదారులకు ప్రీమియం భారాన్ని తగ్గించడంతో పాటు బీమా పరిశ్రమ విస్తరణకు అవకాశాలను పెంచింది. కొత్త పాలసీలు తీసుకోవడం, ల్యాప్స్ అయిన పాలసీలను పునరుద్ధరించడం, పాలసీల రద్దును తగ్గించడం వంటి పరిణామాలకు అవకాశం ఏర్పడింది. యువత, స్వయం ఉపాధి వర్గాలు, అల్ప`మధ్యతరగతి ప్రజలు తక్కువ ప్రీమియంతో టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకునేందుకు, సీనియర్ సిటిజన్లు ఆరోగ్య బీమా పొందేందుకు ఇది అనుకూల పరిస్థితిని కల్పించింది. 2025`26 ఆర్థిక సంవత్సరంలో లైఫ్ ఇన్సూరెన్స్ రంగం సుమారు రూ.10.25 లక్షల కోట్ల మొదటి ప్రీమియం ఆదాయాన్ని, ఆరోగ్య బీమా రంగం సుమారు రూ.1.37 లక్షల కోట్ల ప్రీమియం ఆదాయాన్ని సవి కరించింది. బీమా వ్యాప్తి, సాంద్రత పెరగడానికి, జాతీయ ఆర్థిక వ్యవస్థలో బీమా ప్రీమియం వాటా మెరుగుపడటానికి కూడా ఇది కొంతవరకు అనుకూల పరిస్థితులను కల్పించింది.

అయితే 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యం సాధించాలంటే ఇంకా పలు చర్యలు అవసరం ఉంది. గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలపైనా జిఎస్‌టి రద్దు చేయడం, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై ప్రత్యేక ఆదాయపన్ను రాయితీలు కల్పించడం, బీమా ప్రీమియం చెల్లింపులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలి. బీమాను కేవలం ఆర్థిక ఉత్పత్తిగా కాకుండా ప్రజల సామాజిక భద్రతలో కీలక సాధనంగా పరిగణించినప్పుడే దేశంలో సమగ్ర బీమా రక్షణ సాధ్యమవుతుంది.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ ‘ఉష’ కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## రోగికీ వైద్యుడికీ మధ్య వారధి ఫార్మసిస్టే

**మా**నవ మనుగడలో ప్రాణ రక్షణ కంటే ప్రాధాన్యమైనది మరొకటి లేదు. ఈ భూమ్మీద జన్మించిన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆశిస్తారు. ఆ దిశగానే ఆధునిక మానవుడు వైద్య విజ్ఞానంపైన, వైద్యులు అందించే మందులపైన విశేషంగా ఆధారపడుతున్నాడు. నిత్య జీవితంలో ఏ చిన్న శారీరక రుగ్మత ఎదురైనా వెంటనే ఏదో ఒక ఔషధాన్ని ఉపయోగించడం పరిపాటిగా మారింది. దీనిబట్టి మానవ జీవితంలో మందుల ప్రమేయం ఎంతటి కీలక స్థానాన్ని ఆక్రమించిందో గ్రహించవచ్చు. అయితే, రోగాన్ని గుర్తించడం ఒక ఎత్తయితే, దానికి తగిన సమర్థవంతమైన ఔషధాలను సృష్టించడం, వాటి నాణ్యతను కాపాడడం, సురక్షితమైన రీతిలో ప్రతి రోగికి అందేలా చూడడం మరొక ఎత్తు. నిజానికి ఔషధం లేని చికిత్సను ఊహించలేము. అందుకే, సమాజంలో వ్యాధుల నివారణకు నిజమైన శోధకులుగా, రోగ నివారణకు వెన్నుముకగా నిలిచే అసలు కర్మచారులు ఫార్మసిస్టులే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

అపారమైన ప్రజా సంక్షేమ ధ్యేయంతో శ్రమిస్తున్న ఈ నిపుణుల సేవలను ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) నిరంతరం కృషి చేస్తోంది. ఫార్మా రంగ ప్రతిష్టను, ఫార్మసిస్టుల బాధ్యతాయుతమైన పాత్రను ప్రతిబింబిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని, 2026 నాటి ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం కోసం 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' (Empowering Pharmacists for Healthier Futures) అనే ప్రతిష్ఠాత్మక ఇతివృత్తాన్ని అంతర్జాతీయ సమాజం ఎంచుకుంది. ఈ నేపథ్యం ప్రపంచ ఆరోగ్య రక్షణలో ఫార్మసిస్ట్ స్థానాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్తోంది.

**వైద్య వృత్తిలో కీలక వారధి**

వైద్య రంగాన్ని పరిశీలిస్తే రోగాన్ని నిరోధించే క్రమంలో ప్రాథమిక బాధ్యత వైద్యుడిదైతే, ఆ రోగాన్ని అణచివేసే సరైన ఔషధాన్ని అందించే బాధ్యత ఫార్మసిస్టుది. ఔషధం ఏ మోతాదులో తీసుకోవాలి, రోజులో ఎన్నిసార్లు వాడాలి, ఏ ఆహారంతో కలిపి తీసుకోకూడదు, దాని వల్ల సంభవించే దుష్ప్రభావాలు (Side Effects) ఏముంటాయి అనే విజ్ఞానాన్ని




అందించడంలో ఫార్మసిస్టు పాత్ర అపారమైనది. రోగికి, వైద్యునికి మధ్య వీరు ఒక ప్రత్యక్ష వంతెనగా పనిచేస్తారు. క్లినికల్ ట్రయల్స్ నుంచి మందుల నిల్వ వరకు, పరిశోధనా రహిత విజ్ఞానం నుంచి సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆ మందు చేరే వరకు ప్రతి దశలోనూ ఫార్మసిస్ట్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా అందించే ఏ వైద్యమైనా సంపూర్ణమైన ఫలితాన్ని ఇవ్వడం అసాధ్యం.

అత్యవసర పరిస్థితుల్లో, సుదూర ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో లేని తరుణంలో, ప్రాథమిక వైద్య సలహాలు అందిస్తూ రోగులను కాపాడడంలో ఫార్మసిస్టులు ముందంజలో ఉంటారు. ఈ అవసరాన్ని భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే గుర్తించింది. అందుకే 1948లోనే భారత ఫార్మసీ చట్టాన్ని రూపకల్పన చేసి ఆమోదించారు.

అయితే, సరైన అమలుకు నోచుకోకపోవడం వల్ల దశాబ్దాలుగా మన దేశంలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతకు తగినంత అధికారిక గుర్తింపు దక్కలేదు. అనేక దేశాల్లో వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్లను సమీక్షించి మార్పులు సూచించే అధికారం కూడా ఫార్మసిస్టులకు ఉంటుంది. కానీ మనవద్ద ఫార్మసిస్టు వైద్యుల మధ్య ఉండాల్సిన సమన్వయ వ్యవస్థ ఇంకా పూర్తి స్థాయిలో బలోపేతం కాలేదు.

దీనిఫలితంగా అవసరానికి మించి మందుల వినియోగం పెరిగిపోవడం, తద్వారా తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదురుకావడం జరుగుతోంది.

**యాంటీమైక్రోబియల్ నిరోధకత, ఆధునిక సవాళ్లు**

ప్రస్తుత ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతున్న సంక్షోభాల్లో 'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్' (AMR) అత్యంత ప్రమాదకరమైనది. చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా డాక్టర్ సలహా లేకుండా క్రమరహితంగా యాంటిబయోటిక్స్ వాడటం వల్ల, వ్యాధి క్రిములు ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఈ తీవ్ర ముప్పును అరికట్టడంలో ఫార్మసిస్టులు ప్రజా రక్షణ కవచంలా పనిచేస్తున్నారు. వైద్యుడి ఆమోదం లేనిదే యాంటిబయోటిక్స్ అందించకూడదనే నిబంధనలను పాటించడంతో పాటు, రోగులు మందుల కోర్సును మధ్యలోనే ఆపకుండా వాడేలా అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు క్రియాశీలక భూమిక పోషిస్తున్నారు.

దీనికితోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ యుగంలో భవిష్యత్ ఫార్మా రంగం సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతోంది. జన్యు ఆధారిత చికిత్సలు (Personalized Medicine), ఈ-ప్రిస్క్రిప్షన్లు, రోబోటిక్ డ్రగ్ డిస్పెన్సింగ్ వంటి సాంకేతిక మార్పులను స్వీకరిస్తూ, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా దూరప్రాంత రోగులకు టెలి ఫార్మసీ సేవలు అందించడంలో ఫార్మసిస్టులు కీలక భాగస్వాములుగా మారనున్నారు.

**నిర్మాణాత్మక మార్పులు, ప్రభుత్వాల బాధ్యత**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCలు), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (CHCలు), ఏరియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. అలాగే, నేడు గ్రామీణ ఉపకేంద్రాల్లో కూడా మందుల పంపిణీ పరిధి విస్తరిస్తున్నందున, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అక్కడ కూడా నూతనంగా ఫార్మసిస్ట్ పోస్టులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగ ఫార్మా గ్రాడ్యుయేట్లకు సొంతంగా ఫార్మసీ కేంద్రాలను స్థాపించుకోవడానికి వడ్డీ రహిత రుణాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించడమే కాకుండా, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

కమ్యూనిటీ హెల్త్ నెట్‌వర్క్‌లలో ఫార్మసిస్టులకు తగిన స్థానం కల్పించడం ద్వారానే నూతన ఔషధ పరిశోధనల్లో, నాణ్యతా నియంత్రణలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగగలదు. 2026 నాటి 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' అనే ప్రధాన నినాదం నెరవేరాలంటే ఫార్మసిస్టులకు తగిన గౌరవం, చట్టబద్ధమైన సాధికారత, వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించడం అత్యావశ్యకం.


**సమగ్ర ఆరోగ్య వ్యవస్థకు దిశానిర్దేశం**

ఏ సమాజమైనా ఆరోగ్యవంతంగా నిలబడాలంటే వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు సమాన సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ఔషధ పరిజ్ఞానం కలిగిన ఫార్మసిస్ట్ శ్రమను గుర్తించడం అంటే ప్రజా ఆరోగ్యాన్ని సురక్షితం చేయడమే. మందుల సృష్టికర్తలుగా, రోగ ఉపశమన మిత్రులుగా రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న ఫార్మసిస్టుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జరుపుకునే ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా వారి ప్రాముఖ్యతను గుర్తించడం, గౌరవించడం, వారికీ తగిన సాధికారతను అందించడం సమాజంలోని ప్రతి పౌరుడి, ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645

## సైకో పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్



**ఆ**ధునిక విజ్ఞానమనే మహా భవనానికి మూల స్తంభాలలో ఒకరు సిగ్మండ్ ఫ్రాయిడ్. వైద్య శాస్త్రానికి, వైద్య శాస్త్రజ్ఞులకు, మానసిక శాస్త్రజ్ఞులకు, మానసిక శాస్త్రాధ్యాపకులకు, తాత్వికులకు విజ్ఞాన ప్రదాత. జగమంతా సెక్స్ మయంగా చూసిన ఫ్రాయిడ్ ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ఎన్నో రంగాల్ని ప్రభావితం చేశాడు. ఐన్ స్టీన్, మార్క్స్, డార్విన్ కోవలో ఫ్రాయిడ్ ను చేర్చిన సందర్భాలు లేకపోలేదు. తన సుదీర్ఘ జీవితంలో అనేక వ్యతిరేక పరిస్థితుల్ని, కష్టాల్ని, దారిద్ర్యాన్ని, వాటివల్ల కలిగే నైరాశ్యాన్నీ ఎదుర్కొన్నా, తన అన్వేషణను మాత్రం దీక్షగా కొనసాగించి, మనకు మానసిక విశ్లేషణా పద్ధతి (Psycho Analysis) స్వప్నాల అర్థాల ఆవిష్కరణ లాంటి విషయాలను అందించిన మహా మనీషి ఫ్రాయిడ్. ఎన్నో విజ్ఞాన గ్రంథాల, ఇతర వ్యాసాల, పరిశోధనల ఆధారంగా రచించలే కాక, విశేషంగా పర్యటిస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ, చర్చా సదస్సులలో పాల్గొంటూ మానవ జాతికి జాగృతం చేసే చైతన్య వంతమైన జీవితం గడిపాడు. వైద్య శాస్త్రానికి, ప్రత్యేకించి మానసిక విశ్లేషణా పద్ధతికి ఆద్యుడయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం మానసిక వైద్యులకు మార్గ దర్శకం. మనిషి మనస్సు లో 'అ చేతనం' (అన్ కాన్షియస్ నెస్) అనేది ఉంటుంది. అది మన ప్రవర్తనను మనకు తెలియ కుండానే ప్రభావితం చేస్తుంది' అన్న ఫ్రాయిడ్ విశ్లేషణ.. మనస్తత్వ విశ్లేషణలో తారక మంత్రమైంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ 1856, మే 6న జెకోస్లోవేకియాలోని ఫ్రీబెర్గ్‌లో జన్మించాడు.1860లో వారి కుటుంబ మంతా వియన్నాకు తరలి పోయింది. పేదరికం లోనూ కష్టపడి చదివి గ్రీస్, లాటిన్, గణితం, ప్రకృతి శాస్త్రాలు, చరిత్రలను ఒంట పట్టించు కున్న ఫ్రాయిడ్.. 1873లో వియన్నా విశ్వ విద్యాలయంలో వైద్య శాస్త్రంలో చేరాడు. నాటికి అదే వైద్య శాస్త్రంలో ప్రపంచ రాజధాని. వియన్నా యూనివర్సిటీలో 1881లో ఫ్రాయిడ్ మెడిసిన్ డిగ్రీ పుచ్చు కున్నాడు. వియన్నా జనరల్ ఆస్పత్రిలోనే పనిచేశాడు. తరువాత 1883 నుంచీ నరాలపై దృష్టి పెట్టి అధ్యయ నం చేస్తూ నిపుణుడుగా తేలాడు. పారిస్ లో అప్పటికే జీమార్టిన్ చార్కాట్ సుప్రసిద్ధు డుగా వున్నాడు. ఫ్రాయిడ్ 1885లో చార్కాట్ వద్ద అధ్యయనం చేశాడు. (18851886) తరువాత మెదడుపై ప్రత్యేక పరిశీలన మొదలు పెట్టి, రచనకు పూను కున్నాడు. ఫ్రాయిడ్ యిష్టపడిందీ, అసలు చికిత్సగా నమ్మిందీ మనో విశ్లేషణ (సైకో ఎనాలసిస్). దీనివల్ల ఆయన పేరు, ప్రపంచ ఖ్యాతి వచ్చా యి. కొత్తపేర్లు ప్రచారంలోకి తేవడంలో, ఉపమానాలు వాడడంలో, గ్రీక్ రోమన్ గాథల నుండి ఉదాహరణల స్వీకరించ డంలో ఫ్రాయిడ్ దిట్ట. 30వ యేట నరాల జబ్బులను కుదిర్చే డాక్టర్ గా జీవితాన్ని ఆరంభించిన ఫ్రాయిడ్ అనువా దాలు, పుస్తక సమీక్షలు చేసేవాడు. విద్యుత్ చికిత్స, హిప్నాసిస్ (మోహనిద్ర) చికిత్సలు క్రమంగా విరమించి, కొత్త సిద్ధాంతంతో, సరికొత్త పదజాలంతో ఫ్రాయిడ్ తన ప్రాక్టీసు అవతారాన్నే మార్చేశాడు. ఆయనను ప్రపంచం గుర్తించింది. నరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఫ్రాయిడ్ తన తొలి రచన 1891లో వెలువరించాడు. నరాల విషయంలో అది గొప్ప గ్రంథంగా పేరొందింది. 1883లో నరాల పరిశీలన ఆరంభించిన ఫ్రాయిడ్ 1897 వరకూ అందులో నిమగ్నుడయ్యాడు. ఫ్రాయిడ్ కొత్తగా వైద్యం ప్రాక్టీసు చేస్తున్న రోజులలో ఎలక్ట్రో థెరపీ వుండేది. "స్టడీస్ ఇన్ హిస్టీరియా" అనే రచనలో ఫ్రాయిడ్ "ఎలక్ట్రో థెరపీ" గురించి ప్రస్తావించాడు. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతాలు ప్రపంచాన్ని బాగా ఆకర్షిం చాయి. గనేరియా, సిఫిలిస్ వంటి లక్షణాలు దృష్టిలో పెట్టుకొని ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతంలో వివరణ యిచ్చా డు. క్రమేణా "సైకో ఎనాలసిస్", అనే ఫ్రాయిడ్ సిద్ధాంతం పుంజుకున్నది. హిస్టీరియా, కలలు, కోర్కెల్ని అణచు కోవడం, చిన్న తనంలో సెక్స్, అచేతనం అనేవాటిని ఫ్రాయిడ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇరవ య్యో శతాబ్దం ఆరంభంలోనే ఫ్రాయిడ్ తన సిద్ధాంత రచనలు లోకానికి చాటాడు. దీని ఆచరణకు ఉపక్రమించిన వారు సైకో ఎనాలసిస్ ను ఒక ఉద్యమంగా స్వీకరించారు. ఎదురు చెప్పడానికి భయ పడ్డారు. ఫ్రాయిడ్ పలుకుబడి అలా వుండేది. మానసిక రుగ్మతులకు సరైన చికిత్స చేయడానికి దోహద పడే క్లినికల్ న్యూరాలజీకి సంబంధించి చాలా రకాల అధ్యయనం చేసిన ఫ్రాయిడ్.. న్యూరాలజీ, మెదడు పని చేసే విధానం గురించి అనేక పరిశోధక పత్రాలు ప్రచురిం చారు. ''సైకో అనాలసిస్'' అన్న పదం వాడిందీ, ఆ అంశం ఒక సబ్జెక్టుగా అభివృద్ధి చేసిందీ ఫ్రాయిడ్. సైకో అనాలసిస్‌ను ఫ్రాయిడ్ ఒక థెరపీగా ప్రతిపా దిస్తూ వ్యాసాలు రాశాడు. నరాల జబ్బుకు లైంగిక సంబంధమైన మూలం వున్నద ని, సెక్స్ కారణాలుగా జబ్బులు వస్తాయని అనేక ఉపమా నాలు, కథలు, గ్రీకు గాథలు ఉదహరించి, విస్తారంగా వివరించాడు. "సైకో ఎనాలసిస్". అంటే "మనో విశ్లేషణ" ప్రపంచ ఉద్యమంగా వ్యాపించి, సంఘాలు వెలిశాయి. రోగిని మాట్లాడనిచ్చి, అతని పదాల లో అర్థాన్ని గూఢార్థాన్ని సంకేతాలను విప్పి చెప్పడం "సైకో ఎనాలసిస్ చికిత్స". ఈ విద్యలో ఫ్రాయిడ్ ఆరితేరిన వాడు. హిస్టీరియా అంటే ఏమిటి, అణచివేతకు అర్థం ఎలా చెప్పాలి, కలలు వాటి స్వభావం, చిన్నప్పటి సెక్స్ ప్రవృత్తి, అచేతనం బలం గురించి ఫ్రాయిడ్ చెప్పినవి ఆకర్షణీయంగా అంటుకు పోయాయి. సైకో ఎనాలసిస్ రంగంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టాడానికి యూంగ్ యాడ్లర్ కు తోడు, కార్ల్ అబ్రహం, విల్ హెల్మ్ స్టెకల్ వంటివారు బాగా కృషిచేశారు. ఫ్రాయిడ్ అనంతరం కారన్ హార్నే, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్ ఫ్రాంలు యీ రంగంలో నిలిచి పనిచేశారు. ఫ్రాయిడ్ మూలా ధారం అవ్యక్త మనస్సు. అదే వ్యక్తుల్ని కదిలించి, నడిపించి, మాట్లాడిస్తుంది. అంటే మానవుడిని అవ్యక్త మనస్సు నిర్దేశిస్తుంది. మానవుడి ప్రవర్తన గురించి ''ది సైకో పాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్'' లో ఫ్రాయిడ్ వివరించాడు. మెదడు పనితీరుపై అనేక పరిశోధనలు చేసి, ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్ లలో జీవించిన ఫ్రాయిడ్, తన చివరి రోజులలో హిట్లర్ నాజీ నియంతృత్వ ధోరణుల వల్ల ఇంగ్లాండ్ వెళ్ళి అక్కడే గడిపి కేన్సర్ తో 1939, సెప్టెంబరు 23న కన్ను మూశారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఇల్యూజన్" లో ఫ్రాయిడ్ మత విమర్శ చేశాడు. మతాన్ని ఆద్యంతాలు వ్యతిరే కించి, మతం అనేది ఒక భ్రమ అనీ, అయితే ఓదార్పు యిచ్చే విషయంగా అది పరిణ మించిందనీ ఫ్రాయిడ్ అన్నాడు. మతం నుండి బయట పడిన వారు, స్వేచ్ఛగా సంపూర్ణ జీవనం సాగించగలరని కూడా ఫ్రాయిడ్ చెప్పాడు. దీనితో మతస్తులు ఆయనపై విరుచుకు పడ్డారు. సనాతన మత నమ్మకాలు గల కుటుం బంలో పుట్టిన ఫ్రాయిడ్ తనకు నాస్తికుడుగా పేర్కొన్నాడు. కాని జీవితమంతా యూదుగానే వున్నాడు. ఇరవయ్యో శతాబ్దంలో మానసిక ప్రపంచం లోని అంశాల గురించి శోధించడానికి ఫ్రాయిడ్ చేసిన పరిశోధనలే మూలంగా ప్రచార మొందాయి. ఫ్రాయిడ్ పరిశోధనలు విభిన్న రంగాలపై, ప్రాంతాలపై ప్రసరించాయి. సాహిత్య కళా రంగాలపై సైతం ఫ్రాయిడ్ ఆలోచనల ప్రభావం ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## తెలంగాణ తెలుగు తేజం

బడుగు గుండె
గుడిసె చిల్లులు
శ్రమజీవుల బతుకు
వెతల కథలు
కూలోడి జల్లెడలో
జొన్న రొట్టె పిండి
ప్రేమను పండించే
కవన తోడు నీడలు
ఆనందల్ని పంచే
అపురూప పదాలు
వినోదాన్ని వడ్డించే
నేర్పరితన కళలు
ఆవేశంతో
ఊగిపోయే పదునైన
పాళీ
విప్లవ మంటల్ని
అక్షర కొరకాసుతో..

అంటించే తెగువ నీ
కలానిది !

నీ కలం తేజోమయ
అగ్నిగుండం
అవినీతి పై
ఎక్కు పెట్టిన అక్షర
బాణం
నీవు మా తెలంగాణ
అభినవ శ్రీశ్రీ
నాడు అశోకుడు
చెట్లు నాటించెను
నేడు ఈ అశోకు
శ్వేతపత్రం పై..

పరకాయ,
స్వరకాయప్రవేశం
చేస్తూ..

కవన దినుసులతో
పాత్రావరణంలోకి
దూరి..
కవన మొక్కలు నాటి
పంట తీస్తున్నాడు !

ఈ మెట్ పల్లి
పల్లెటూరు పిల్లగాడు
సాహిత్య సాగుతో
చేస్తున్న రాతగాడు
అయ్య హనుమంతు

నేర్పిన సుద్దులతో..
సుద్దాల పేరుకు
సార్థకత చేకూర్చి..
ఆలి నిర్మలమ్మ నీకు
దండమే అంటూ..
జానకమ్మ ఒడిని
బడిగా
మలుచుకొని..
గీతాల్లో తళతళ
మెరిసే మేరునగ ధీర
!
తెలగాణ ఆవేశ
మంటలో ఎగిసిన...
భావాక్షర అగ్ని రవ్వ
మన అశోకు
నీ పాటకు కట్టాలి
పట్టాభిషేకం

నీ కలానికి చేయాలి
కవనాభిషేకం
నీ గళాలని ఇదే మా
అక్షరాభిషేకం
ఓ తెలంగాణ నేలమ్మ
మెరుపు తీగ
నీకు ఇదే మా
అభిమాన అరవం
దొడ్డ మనసున్న
సుద్దాల అశోక్
తేజుడా..



మధుసూదన్ రెడ్డి
9949700037

## స్మార్ట్‌ఫోన్ లేని కాలం... స్మార్ట్‌గా బతికిన తరం!

ఒకప్పుడు మనిషికి అన్నింటికీ వెంటనే సమాధానం అవసరం ఉండేది కాదు. సందేహం వస్తే పెద్దలను అడిగేవాడు. సమాచారం కావాలంటే పుస్తకం తెరిచేవాడు. వార్త తెలుసుకోవాలంటే పత్రిక చదివేవాడు. స్నేహితుడితో మాట్లాడాలంటే అతని ఇంటి ముందు నిలబడేవాడు. దూరంలో ఉన్నవారిని పలకరించాలంటే ఉత్తరం రాసేవాడు. సమాధానం కోసం రోజులు ఎదురుచూసేవాడు. అయినా జీవితం నెమ్మదిగా, హాయిగా సాగేది. అదే ఎనభైల కాలం. కృత్రిమ మేధస్సు మాటే కాదు, వ్యక్తిగత కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్, సామాజిక మాధ్యమాలు వంటి నేటి సాంకేతిక ప్రపంచం కూడా అందుబాటులో లేని కాలం. వెనక్కి తిరిగి చూస్తే ఆ రోజుల్లో సౌకర్యాలు తక్కువైనా, మానవ సంబంధాలకు మాత్రం కొరత లేదనిపిస్తుంది.నేడు ప్రపంచం మన చేతిలోకి వచ్చేసింది. ఒక చిన్న పరికరంతో ప్రపంచంలోని ఏ మూలన ఉన్న వ్యక్తినైనా క్షణాల్లో సంప్రదించవచ్చు. ఏ విషయం గురించి అయినా సమాచారం పొందవచ్చు. కృత్రిమ మేధస్సును అడిగితే క్షణాల్లో సమాధానం లభిస్తుంది. మనం రాసే విషయాలను సరిచేయగలదు. అనువదించగలదు. చిత్రాలు సృష్టించగలదు. సమాచారాన్ని విశ్లేషించగలదు. విద్య, వైద్యం, పరిశోధన, పరిశ్రమ వంటి అనేక రంగాల్లో కొత్త అవకాశాలను తెరుస్తోంది. సాంకేతిక ప్రగతి మానవ జీవితాన్ని అనేక విధాలుగా సులభతరం చేసిందనేది వాస్తవం. కానీ ఈ వేగవంతమైన ప్రయాణంలో మనిషి కోల్పోతున్న కొన్ని విలువలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది.ఎనభైలలో బాల్యం అంటే బయట ప్రపంచమే. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత పుస్తకాలు, ఆటలు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపే సమయం. క్రికెట్, కబడ్డీ, కోకో, గిల్లీదండా, దాగుడుమూతలు వంటి ఆటలతో సాయంత్రాలు గడిచేవి. ఆటలో ఓడితే గొడవపడేవారు. గెలిస్తే సంబరపడేవారు. కానీ మరుసటి రోజు మళ్లీ అదే స్నేహితులతో కలిసి ఆడుకునేవారు. స్నేహం తెరపై కనిపించేది కాదు; పక్కనే కనిపించేది. పిల్లల నవ్వులు మొబైల్ రింగ్‌టోన్లను మించిపోయేవి ఉత్తరం రావడానికి కొన్ని రోజులు పట్టినా, పోస్టుమ్యాన్ కోసం ఎదురు చూసే ఆత్రుతలో ఒక మాధుర్యం ఉండేది. ఇప్పుడు సందేశం పంపిన వెంటనే “చూశారా?”, “ఎందుకు సమాధానం ఇవ్వలేదు?” అనే ప్రశ్నలు వస్తున్నాయి. సమాచార వేగం పెరిగింది. కానీ ఎదురు చూసే ఓపిక తగ్గిపోయింది. సంభాషణలు పెరిగాయి. కానీ సంభాషణల్లోని ఆత్మీయత తగ్గిపోతోందనే భావన చాలామందిలో ఉంది. అందుకే ఎనభైల జ్ఞాపకం సాంకేతికతను తిరస్కరించమని చెప్పదు. సాంకేతికతను ఎలా ఉపయోగించాలో నేర్పుతుంది. కృత్రిమ మేధస్సు మనిషికి సహాయకారి కావాలి తప్ప, మనిషి ఆలోచనా శక్తికి ప్రత్యామ్నాయం కాకూడదు. యంత్రం సమాచారం ఇవ్వగలదు. కానీ దాన్ని ఎలా ఉపయోగించాలో మనిషే నిర్ణయించాలి. యంత్రం వాక్యాన్ని రాయగలదు. కానీ ఆ వాక్యానికి మానవ అనుభూతి, బాధ్యత, విలువలను జోడించాల్సింది మనిషే.అయితే ఎనభైల కాలాన్ని పూర్తిగా ఆదర్శంగా చిత్రించడం కూడా సరికాదు. అప్పట్లో వైద్య, సమాచార, రవాణా, విద్యా సౌకర్యాలు నేటితో పోలిస్తే పరిమితంగానే ఉండేవి. ప్రపంచంలోని సమాచారాన్ని క్షణాల్లో పొందే అవకాశం లేదు. అనేక సమస్యలకు పరిష్కారం కోసం ఎక్కువ సమయం పట్టేది. కాబట్టి గతాన్ని పూర్తిగా గొప్పదిగా, వర్తమానాన్ని పూర్తిగా చెడ్డదిగా చూడటం సరైన దృక్పథం కాదు. గతంలోని మానవీయ విలువలను, వర్తమానంలోని సాంకేతిక అవకాశాలను కలిపే మార్గమే అవసరం.ఇప్పుడు అసలు ప్రశ్న ఇదే—కృత్రిమ మేధస్సు ఎంత అభివృద్ధి చెందినా మనిషి స్థానాన్ని అది భర్తీ చేయగలదా? తల్లి ప్రేమను అది అనుభవించగలదా? స్నేహితుడి బాధను మనసారా పంచుకోగలదా? తాతయ్య చెప్పిన కథలోని ఆప్యాయతను పునరావృతం చేయగలదా? ఓటమి తర్వాత స్నేహితుడి భుజంపై చేయి వేసి. పిల్లలకు ప్రతి ప్రశ్నకు వెంటనే యంత్ర సమాధానం ఇవ్వడం కంటే, కొన్నిసార్లు వారే ఆలోచించే అవకాశం ఇవ్వడం అవసరం.ఎనభైలలో యంత్రాలు తక్కువగా ఉండేవి. అందుకే మనుషులు ఒకరిపై ఒకరు ఎక్కువగా ఆధారపడేవారు. ఇప్పుడు యంత్రాలు మన జీవితంలో అంతర్భాగమయ్యాయి. అందుకే మనిషి మనిషితో ఉన్న బంధాన్ని మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలి. సాంకేతికత మనకు వేగాన్ని ఇవ్వాలి; దిశను కాదు. నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడాలి; మన నిర్ణయ స్వాతంత్ర్యాన్ని తీసుకోకూడదు. కృత్రిమ మేధస్సు మన పనిని సులభం చేయాలి; మనిషితనాన్ని మాత్రం భర్తీ చేయకూడదు.

ఎనభైల కాలం తిరిగి రాదు. ఆ రోజుల్లోని వీధులు మారిపోయాయి. జీవనశైలి మారిపోయింది. సమాచార ప్రపంచం పూర్తిగా మారిపోయింది. కానీ ఆ కాలం మనకు ఇచ్చిన కొన్ని విలువలు మాత్రం ఎప్పటికీ పాతబడవు——మాట్లాడటం, వినడం, ఎదురు చూడటం, పంచుకోవడం, కలిసి నవ్వడం, కలిసి బాధపడడం, ఒకరికి ఒకరు అండగా నిలవడం.అందుకే “ఏఐ లేని ఎనభైలు” కేవలం గతాన్ని తలచుకునే జ్ఞాపకాల గీతం కాదు. అది వర్తమానాన్ని ప్రశ్నించే అద్దం. సాంకేతికత ఎంత పెరిగినా మనిషి తనలోని మనిషిని కోల్పోకూడదనే హెచ్చరిక. భవిష్యత్తు కృత్రిమ మేధస్సుతో నిండిపోవచ్చు. కానీ ఆ భవిష్యత్తులో మానవ హృదయానికి మాత్రం స్థానం ఉండాలి.యంత్రాలు తెలివిగా మారుతున్న కొద్దీ మనిషి మరింత మానవీయంగా మారాలి. అదే ఎనభైల నుంచి నేటి తరానికి అందాల్సిన అసలైన సందేశం.

# జాతీయం-అంతర్జాతీయం

## భారత్ న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

## అక్టోబర్ 20 నుంచి ప్రారంభం!

**మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడి**

**న్యూఢిల్లీ :**

భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వచ్చే అక్టోబర్ 20వ తేది నుంచి అధికారికంగా అమల్లోకి రానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ సోమవారం ప్రకటించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఒప్పందం అమల్లోకి రానుండటం విశేషమన్నారు. ఇరు దేశాల మధ్య వస్తు, సేవల వాణిజ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు పెట్టుబడులను మరింత విస్తృతపరచడమే లక్ష్యంగా ఈ ఒప్పందాన్ని రూపొందించారన్నారు. గతంలోనే అంటే ఏప్రిల్ 27న ఇరు దేశాలు ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ తాజా ఒప్పందం ద్వారా భారత్ నుంచి ఎగుమతి అయ్యే వస్తువులన్నింటికీ ఎలాంటి సుంకాలు లేకుండా న్యూజిలాండ్ మార్కెట్లోకి ప్రవేశం లభించనుంది. ఇప్పటివరకు సిరామిక్స్, కార్పెట్లు, ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలు వంటి కీలక భారతీయ వస్తువులపై న్యూజిలాండ్ ప్రభుత్వం 10 శాతం వరకు గరిష్ట సుంకాలు విధిస్తూ వస్తోంది. తాజా ఒప్పందంతో ఈ అడ్డంకులు తొలగిపోనున్నాయి. అంతేకాకుండా రాబోయే 15 ఏళ్లలో భారత్‌లో ఏకంగా 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ అంగీకరించింది.



## బీజేపీకి షాక్..



రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా ముండ్వా మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 25 వార్డుల్లో 10 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ.. ఛైర్‌పర్సన్ పదవిని మాత్రం దక్కించుకోలేకపోయింది. పార్టీ అధికారిక అభ్యర్థి గీతాదేవికి ఒక్క ఓటు కూడా రాలేదు. ఆర్ఎల్‌పీ అభ్యర్థి అల్కాదేవి కండోయ్ 13 ఓట్లు సాధించి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆమెకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఘన్‌శ్యామ్ సదావత్‌కు 12 ఓట్లు వచ్చాయి. తెలంగాణ వార్తలు

దీంతో అల్కాదేవి కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. ముండ్వా మున్సిపాలిటీలో బీజేపీ 10, ఆర్ఎల్‌పీ 7, కాంగ్రెస్ 3, స్వతంత్రులు 5 స్థానాలు గెలుచుకున్నారు. బీజేపీకి ఛైర్‌పర్సన్ టికెట్ దక్కకపోవడంతో ఘన్‌శ్యామ్ సదావత్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల్లో ఆయనకు 12 ఓట్లు రావడంతో బీజేపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు పార్టీ అధికారిక అభ్యర్థికి కాకుండా ఆయనకు మద్దతిచ్చినట్లు ఫలితాలు వెల్లడించాయి. కాంగ్రెస్, ఆర్ఎల్‌పీకి కలిపి 10 మంది కౌన్సిలర్లు ఉండగా.. అల్కాదేవికి 13 ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచినా ఛైర్‌పర్సన్ పదవి దక్కకపోవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది.

## 8వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం!





**చెన్నై**

తమిళనాడులోని ప్రభుత్వ స్కూళ్లలో ఇకపై 68 తరగ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనుంది ప్రభుత్వం. ఈ పథకాన్ని తమిళనాడు సీఎం విజయ్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఇప్పటికే పెరుతలైవార్ కామరాజార్ అల్పాహారం పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో ఈ పథకం అమలవుతోంది.ఇప్పటిదాకా ఒకటి నుంచి ఐదో తరతి పిల్లలకు మాత్రమే ప్రభుత్వ స్కూళ్లలో అల్పాహారం అందిస్తుండగా.. ఇకపై ఎనిమిదో తరగతి వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దీంతో విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. మంగళవారం సీఎం విజయ్.. చెన్నై, తిరువన్మియుర్, గాంధీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్కూల్‌లో పథకాన్ని విస్తరించారు. ఈ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉదయం అల్పాహారం చేశారు. గవర్నమెంట్ స్కూళ్లతోపాటు, గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూళ్లలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తారు.ఈ పథకం ఇప్పుడు రాష్ట్రంలోని 15,454 స్కూళ్లలో, 15.30 లక్షల మంది విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి కలుగుతుంది. ఈ పథకాన్ని విస్తరించేందుకు అదనంగా ఏడాదికి రూ.217.63 కోట్లు ఖర్చవుతుంది. మొత్తం పథకానికి అయ్యే ఖర్చు ఏడాదికి రూ.724 కోట్లకు చేరింది. గతంలో ఈ పథకానికి సీఎం బ్రేక్‌ఫాస్ట్ అనే పేరుండేది. అయితే, తమిళనాడు మాజీ సీఎం, కాంగ్రెస్ నేత దివంగత కే కామరాజ్ పేరు మీద ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించారు.

# ట్రంప్ వైఖరిపై విమర్శల పర్వం

## : భారత్‌పై ఆంక్షల బెదిరింపులు.. బెలారస్‌తో భారీ ఒప్పందం

**వాషింగ్టన్**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై 100 శాతం సుంకం విధిస్తామని హెచ్చరిస్తున్న అమెరికా.. రష్యా మిత్రదేశమైన బెలారస్ నుంచి పొటాష్ కొనుగోలు ఒప్పందానికి ప్రయత్నిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ మాజీ అధికారి ఇవాన్ ఫైగెన్‌బామ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రష్యాతో సన్నిహిత సంబంధాలు కలిగిన బెలారస్‌తో భారీ పొటాష్ డీల్‌కు ప్రయత్నిస్తున్న యూఎస్.. ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై సుంకం విధిస్తామని బెదిరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్‌ను బాధ్యులుగా చిత్రీకరించడం సరికాదు. రష్యా చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని అమెరికా ఒత్తిడి చేయడం భారత విదేశాంగ విధానంలో జోక్యం చేసుకోవడమే. మాస్కోను యుద్ధం ఆపేలా చేయడంలో పాశ్చాత్య దేశాలు, ట్రంప్ విఫలమైనందుకు భారత్‌ను నిందించడం సరికాదు. ఇరు దేశాల సంబంధాలపై ఇలాంటి వైఖరి ప్రతికూల ప్రభావం చూపుతుంది. భారత్‌ను చైనాతో కలిపి చూడటం యూఎస్‌కు మేలు చేయదు" అని పేర్కొన్నారు.

బెలారస్ నుంచి భారీగా పొటాష్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకోనున్నట్లు ట్రంప్ (ప్రస్తుతం కెనడా ) నుంచి కొనుగోలు చేస్తున్న దానికంటే తక్కువ ధరకు లభిస్తుందని తెలిపారు. అమెరికా పొటాష్ దిగుమతుల్లో కెనడా వాటా 2024లో 79 శాతంగా ఉంది. రష్యా నుంచి 11 శాతం, బెలారస్ నుంచి 4 శాతం దిగుమతులు జరిగాయని అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. మరోవైపు రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తుండటంతో భారత్‌పై అమెరికా కొత్త చట్టం ప్రభావం పడే అవకాశం ఉంది.



## న్యూయార్క్ మేయర్ మమ్దానీతో ట్రంప్ చర్చలు

**న్యూయార్క్ :**

న్యూయార్క్ మేయర్ మమ్దానీతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశమయ్యారు. గత ఏడాది జరిగిన మేయర్ ఎన్నికల్లో మామ్దానీ ఘనవిజయం సాధించిన తర్వాత, ఇరువురు నేతలు బహిరంగంగా సమావేశం కావడం ఇది మూడవసారి. వలసల నియంత్రణ అమలు, బిలియన్ డాలర్ల విలువైన గృహనిర్మాణ ప్రాజెక్టు గురించి ఇరువురు నేతలు చర్చలు చేపట్టారు. మన్‌హట్టన్‌లో సుమారు గంట పాటు వీరిరువురూ రహస్యంగా చర్చలు జరిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ముందు ట్రంప్ ఈ పర్యటన చేపట్టడం గమనార్హం. చర్చల అనంతరం మీడియా సమావేశంలో .. మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. మీరు గొప్ప మేయర్ అవుతారని ఆశిస్తున్నానని, గొప్పమేయర్ కాగలరని చెప్పగలనని, ఇప్పటికే ఆ చర్యలు ప్రారంభించారని ట్రంప్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మమ్దానీ మాట్లాడుతూ.. న్యూయార్క్ పట్ల అధ్యక్షుడి నిబద్ధతను అభినందిస్తున్నామని అన్నారు. వేలాది మంది వలసదారుల తాత్కాలిక రక్షణ హోదాను ట్రంప్ తొలగించడం మీడియా ప్రశ్నకు స్పందిస్తూ.. న్యూయార్క్ వాసుల భద్రతపై తన అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించానని అన్నారు.న్యూయార్క్‌లో 12,000 ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదన గురించి కూడా తాము చర్చించామని మమ్దానీ అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణానికి సుమారు 21 బిలియన్ డాలర్ల ఫెడరల్ ప్రభుత్వ నిధులు అవసరమవుతాయని గత ఫిబ్రవరిలో అంచనా వేసిన సంగతి తెలిసిందే. తమ మధ్య అనేక విభేదాలు ఉన్నప్పటికీ, ట్రంప్‌తో సహకారాన్ని కొనసాగించాలని యోచిస్తున్నట్లు మమ్దానీ చెప్పారు. తాము విభిన్నమైన అంశాల గురించి చర్చించామని, తాను అధ్యక్షుడితోనే కాకుండా, న్యూయార్క్ ప్రజల కోసం ఎవరితోనైనా చర్చలు చేపడతానని అన్నారు.సిఎన్ఎన్, ఎంఎస్ఎన్‌బిసి, పొలిటికో అనే మూడు వార్తా సంస్థలను వైట్ హౌస్ నుండి నిషేధించినందుకు నిరసనగా, అగ్రశ్రేణి అమెరికన్ టెలివిజన్ నెట్‌వర్క్‌లు ఆ దేశాధ్యక్షుడి కార్యక్రమాల ప్రసారాన్ని దాదాపుగా బహిష్కరించిన తరుణంలోనే ట్రంప్ ఈ పర్యటన చేపట్టారు. ఇరాన్ యుద్ధంపై వస్తున్న విమర్శల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ట్రంప్ మీడియాపై ఆంక్షలు విధించారని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు.

## ఒప్పందానికి రాకుంటే తుడిచిపెడతా

- **ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**
- **ప్రతీకారం తప్పదు : టెహ్రాన్**

**టెహ్రాన్/వాషింగ్టన్ :**

ఇరాన్, అమెరికా దేశాల మధ్య మరోసారి బెదిరింపుల పర్వం మొదలైంది. తనతో ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్ ఆర్థికంగా దెబ్బతింటుందని లేదా నాయకత్వం తుడిచిపెట్టుకొనిపోతుందని అమెరికా బెదిరించగా తనపై దాడి జరిగితే ప్రతీకారం తప్పదని టెహ్రాన్ హెచ్చరించింది. ఫాక్స్ న్యూస్ ప్రతినిధితో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుతూ ఇరాన్ నేతలు తనతో ఒప్పందం చేసుకోని పక్షంలో ఆర్థికంగా నాశనం అవుతారని, నామరూపాలు లేకుండా పోతారని శాపనార్థాలు పెట్టారు. ఐరాస సర్వసభ్య సమావేశం కోసం ఈ వారంలో న్యూయార్క్ వస్తున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌ను కలవడానికి తాను సిద్ధమేనని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పారు. కాగా ఇరాన్‌పై దాడులు జరిగితే అమెరికా స్థావరాలు, ప్రయోజనాలపై ప్రతీకార చర్యలకు దిగుతామని, ప్రాంతీయ మిత్రదేశాలను కూడా కలుపుకుంటామని సైనిక కేంద్ర కమాండ్ తెలియజేసింది.

ఇదిలా ఉండగా హౌతీల తాజా దాడులపై అమెరికా విదేశాంగ శాఖ స్పందిస్తూ వీటి కారణంగా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని, అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని, విమానాల రద్దు, గగనతలాల మూసివేత వంటి చర్యలకు అవకాశం ఉన్నదని తెలిపింది.

## అయోధ్య విరాళాల కుంభకోణం

**లక్నో :**

అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించి విరాళాల సేకరణలో చోటుచేసుకున్న భారీ అక్రమాల కేసులో అరెస్టయిన నిందితులను బయటకు తీసుకువచ్చేందుకు కుట్ర జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసై మూడు నెలలు గడుస్తున్నా పోలీసులు ఇంతవరకు కోర్టులో ఛార్జిషీట్ సమర్పించలేదు. సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేయకపోతే నిందితులకు సహజ సిద్ధంగానే 'డిఫాల్ట్ బెయిల్ లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



ప్రజా ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ తర్వాత కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ దృశ్యాలను ఫోరెన్సిక్ పరిశీలనకు పంపగా, దాదాపు 105 విరాళాల నిధుల మళ్లింపు సంఘటనలు వెలుగులోకి వచ్చాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గతంలోనే ధ్రువీకరించారు.

**అధికారంలోనే పాత ట్రస్ట్ నిర్వాహకులు :**

ఈ కుంభకోణం వెనుక ఉన్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు ఇప్పటికీ తమ పదవుల్లో కొనసాగుతుండటం గమనార్హం. కేవలం సీఈఓ పదాన్ని సృష్టించి మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నియమించడం తప్ప, పారదర్శకతకు ఇతర చర్యలేవీ తీసుకోలేదు. వివాదం ముదరడంతో ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు తమ పదవులకు రాజీనామా చేసినప్పటికీ, వారిని దర్యాప్తు పరిధిలోకి తీసుకురాలేదు.

ఈ కేసుపై సీబీఐ విచారణతో పాటు ఫండ్స్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**13 మంది అని చెప్పి... ఎనిమిది మందికే పరిమితం :**

యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణ ప్రారంభంలో ఈ కుంభకోణంలో 13 మంది ప్రమేయం ఉందని వెల్లడించింది. కానీ, ఇప్పటివరకు ఎనిమిది మందిని మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకుంది. అరెస్టయిన వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ (టిన్ను)లు ఉన్నారు. మరో రెండు రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే వీరికి బెయిల్ లభించనుంది. కోట్లాది రూపాయల విరాళాల అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తుండగా, పోలీసులు ఇప్పటివరకు నిందితుల నుంచి కేవలం ₹ 80 లక్షలు మాత్రమే రికవరీ చేయగలిగారు.

**ముందే తెలిసినా చర్యలు నిల్ :**

చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల రాజీనామాతో వారి పాత్రను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేసు నమోదుకాకముందే ఈ విరాళాల మళ్లింపు వ్యవహారం ట్రస్ట్ ముఖ్యులకు తెలుసని, పోలీసుల సహకారంతో ఒక నిందితుడి ఇంట ఉన్న నగదును ముందుగానే తరలించినట్లు వీడియో సాక్ష్యాధారాలు బయటపడ్డాయి. జూన్ మొదటివారంలోనే ఈ అక్రమాలు బయటపడటంతో యోగి ప్రభుత్వం హడావుడిగా సిట్‌ను ప్రకటించింది. కానీ దర్యాప్తు వేగవంతం కాకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



## కావేరీ జలాల వివాదం

### థర్డ్ పార్టీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు!

**చెన్నై:**

తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అదనంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టం చేసింది.

అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇలాంటి పిటిషన్లను విచారిస్తూ పోతే.. వివాదాలు ఇంకెప్పటికి ముగుస్తాయని ప్రశ్నించింది. ఇప్పటికే కావేరీ జలాలపై తమిళనాడు కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయని పేర్కొంది. ఈ వివాదంలో ప్రైవేటు సొసైటీలకు స్థానం లేదని.. రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.తమిళనాడుకు 15 రోజుల పాటు రోజూ 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీజలాల నిర్వహణ అథారిటీ జులై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ... లభ్యత, వర్షపాత పరిస్థితులను సమీక్షించిన తర్వాత ఈ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకొనడంతో.. తమిళనాడుకు కావేరీ జలాల విడుదలను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు, కన్నడ సంఘాలు నిరసనలు చేశాయి. ఆ నేపథ్యంలో తమిళనాడులోని విజయ్ సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

**అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇలాంటి పిటిషన్లను విచారిస్తూ పోతే.. వివాదాలు ఇంకెప్పటికి ముగుస్తాయని ప్రశ్నించింది. ఇప్పటికే కావేరీ జలాలపై తమిళనాడు కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయని పేర్కొంది. ఈ వివాదంలో ప్రైవేటు సొసైటీలకు స్థానం లేదని.. రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. తమిళనాడుకు 15 రోజుల పాటు రోజూ 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీజలాల నిర్వహణ అథారిటీ జులై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని**

## జపాన్‌లో దుజ్వాన్ తుఫాను

### : ఇద్దరు మృతి, సురక్షిత ప్రాంతాలకు 20 లక్షల మంది తరలింపు


**టోక్యో :**

జపాన్‌ను 'దుజ్వాన్' తుఫాను తీవ్రంగా అతలాకుతలం చేస్తోంది. హోరెత్తే గాలులు, కుండపోత వర్షాల ధాటికి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 లక్షల మంది ప్రజలను ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. కనగావా ప్రిఫెక్చర్ నుండి నలుగురు వ్యక్తులు గల్లంతైనట్లు జాతీయ వార్తా సంస్థ NHK వెల్లడించింది.గంటకు 143 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా సుమారు 50,000 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముందస్తు జాగ్రత్త చర్యగా వందలాది విమాన సర్వీసులను, రైలు రవాణాను అధికారులు పూర్తిగా రద్దు చేశారు. ఈ ఏడాది జపాన్‌ను తాకిన 25వ తుఫాను ఇది. సముద్ర ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం వల్ల బలపడిన 'సూపర్ ఎల్ నినో' ప్రభావమే ఈ తుఫానుకు ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు తెలిపారు.



ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జపాన్ ప్రధాని సనే టకాయిచి తీవ్ర సంతాపం తెలిపారు. అయితే, న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు నిర్ణయించిన తన పర్యటన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ప్రజలు ఖచ్చితంగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అమెరికాలో పర్యటించనున్న జిన్‌పింగ్



**బీజింగ్ :**

చైనాఅధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా పర్యటన ఖరారైంది. సెప్టెంబర్ 2325 తేదీల మధ్య జిన్‌పింగ్ అమెరికాలో పర్యటించనున్నారని చైనా విదేశాంగ శాఖ సోమవారం స్పష్టం చేసింది. ఇరువురు నేతలు ప్రధాన అంశాలైన ప్రపంచశాంతి, అభివృద్ధితో పాటు చైనాఅమెరికాల మధ్య సంబంధాలపై సుదీర్ఘ చర్చలు జరపనున్నారని విదేశాంగ శాఖ ప్రతినిధి గుయో జియాకున్ తెలిపారు. చైనా, అమెరికాల మధ్య నిర్మాణాత్మక, వ్యూహాత్మక స్థిరత్వ సంబంధాలను సుసంపన్నం చేయడానికి, చర్చలు, సహకారాన్ని బలోపేతం చేయడానికి, విభేదాలను సమర్థవంతంగా పరిష్కరించుకోవడానికి చైనా అమెరికాతో కలిసి పనిచేస్తుందని అన్నారు.

ఈవారంలో జిన్‌పింగ్ అమెరికాలో పర్యటించనున్నారని అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ట్రంప్, జిన్‌పింగ్‌కు వ్యక్తిగతంగా స్వాగతం పలుకుతారని అమెరికా అధికారి ఒకరు ధృవీకరించారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యార్థులకు స్వయంగా ఇంగ్లీష్ గ్రామర్ బోధించిన జిల్లా కలెక్టర్



**జనగామ, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి) :**
విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం లింగాల ఘనపురం మండలంలోని మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ తరగతులతో పాటు 9, 10 తరగతుల అభ్యసన స్థాయిలను కలెక్టర్ పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు స్వయంగా ఉపాధ్యాయుడిగా మారి ఇంగ్లీష్ గ్రామర్ (Noun, Verb, వాక్య నిర్మాణం) లోని ప్రాథమిక అంశాలను సులభ రీతిలో బోధించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం 10వ తరగతిలో ఫిజిక్స్ బోధనా తీరును పర్యవేక్షించారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్ఎమ్‌ను ఆదేశించారు. వంటశాల పరిశీలనలో కట్టెల పొయ్యి వాడకంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్, గ్యాస్ మాత్రమే ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పురస్కార సన్మానం



**సింగనబోయిన పదారి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ పాముగుండ్ల పాఠశాల కట్టంగూరు మండలం**
**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 22**
నల్గొండ పట్టణ కేంద్రంలో లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను మార్చేది గురువులేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రముఖులు హాజరైన వారు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బడుగుల చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ,పట్టణ మేయర్ బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మహమ్మద్ అష్రఫ్ అలీ,డీఈవో సుసిందర్ రావు ,ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో హాజరై ఉపాధ్యాయుల గురించి కొన్నియాడుతూ ..భాషిపాక జైపాల్ మాట్లాడుతూ తను ఉద్యోగంలో జైనింగ్ అయిన గురించి ప్రస్తావిస్తూ తన ఉద్యోగం మొదటగా ఎక్కడ ప్రారంభమైందో తను మొదటి సారిగా పాఠశాలలో ప్రవేశించిన డేటు 1996 వలిగొండ మండలం గోకారం యుపిఎస్ పాఠశాలలో ప్రవేశం పొందడం ద్వారా నేడు ప్రస్తుతం పనిచేస్తున్నాం ప్రదేశం కట్టంగూరు మండలం పాముగుండ్ల పాఠశాలలో పనిచేస్తున్నారని వారు తెలిపారు వారి మాట్లాడుతూ...ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది మంచి భవిష్యత్తులో ఉన్నారని ఇప్పుడు కూడా ప్రతి ఒక్క విద్యార్థికి చక్కని పాటలు బోధిస్తూ సమాజంలో విద్యార్థులు చదువుకొని గొప్పవాళ్ళు కావాలని తన కోరికని వారి మాటల్లో చెప్పారు తను పొందిన వివిధ అవార్డుల గురించి చెబుతూ టిపియుఎస్ జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ జిల్లా అవార్డు రావడం రావడంతో నేడు కూడా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడంతో తన సతీమణి సింగన బోయిన విజయలక్ష్మి కుమారుడు చిన్మయి చాలా సంతోషం వ్యక్తం చేశారు అదేవిధంగా తన బంధు మిత్రులు, రక్త ,సంబంధులు చిన్ననాటి మిత్రులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు ప్రతి ఒక్కరు నన్ను అభినందించినందుకు వారందరికీ పేరుపేరునా నా హృదయ పూర్వక ధన్యవాదాలు చెల్లించారు

## తెలంగాణకు కాంగ్రెస్ దయ్యం పట్టింది మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్



**అసెంబ్లీ వర్షా కాల సమావేశాల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం - కాంగ్రెస్ టూర్ సర్కస్ ను తలపిస్తోంది**
**హైదరాబాద్ (తెలంగాణ భవన్):**
అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం అయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ వివిస్ లను, ఎమ్మెల్యేలను పంపించారు. మేము ఎప్పుడో అఫిడవిట్ లో పెట్టిన అంశాలను మాట్లాడి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తున్నారు. కేసీఆర్ వాళ్ళ కొలుకున్నారు. ఇందిరమ్మ ఎమర్జెన్సీ కంటే దారుణంగా ప్రస్తుత ప్రభుత్వ వ్యవహారం ఉంది. నేరస్థుల మాదిరిగా పక్కా వ్యూహంతో ఫామ్ హౌస్ లపై దాడి చేస్తామని ప్రజా భవన్ వద్ద కాంగ్రెస్ వాళ్ళు జమ అవుతున్నారు. అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలోకి వెళ్లవచ్చని మీకు తెలియదా? కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి రేవంత్ రెడ్డి అనుచరుడిగా హద్దులు మిక్కిలి చేస్తున్నారు. ఐదు రోజులు తిరిగి మీరు సాధించింది ఏంటి? రాష్ట్రంలో అసలు సమస్యలు వేరే ఉన్నాయి. జనరేటర్లతో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కృష్ణా, గోదావరి కింద రైతులకు సాగునీరు ఇవ్వడం లేదు.
కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటనలను కాంగ్రెస్ వాళ్లే వ్యతిరేకిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులకు కూడా ఇష్టం లేదు. కాంగ్రెస్ వాళ్ళ టూర్ సర్కస్ ను తలపిస్తోంది. సీసీ కెమెరాలను చూసి నేరస్తులు భయపడుతారు. సీసీ కెమెరాలను చూసి కాంగ్రెస్ నేతలకు ఎందుకు అంత భయం? సీసీ టీవీలు వ్యవసాయ క్షేత్రంలో పెట్టుకుంటే తప్పా? అవును, కోళ్లు అక్కడ ఉంటాయ్.. అవి దొంగతనం కాకుండా సీసీ టీవీలు పెట్టుకోవద్దా? నాకు షాబాద్ మండలం మద్దూరు అనే గ్రామంలో భూమి ఉందని అఫిడవిట్ లో పెట్టాను. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాకు ఎయిర్ పోర్టు పక్కన విలువైన భూములున్నాయని చేసిన ఆరోపణలు వట్టివే అని తేలిపోయింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పిన విషయాలను ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఎలా రాశారు? రాధాకృష్ణ వాళ్లకు స్క్రిప్టు పంపారా? నా కాళ్ళు పట్టుకునే ఇక్కడి ముఖ్యమంత్రి మెప్పు కోసం మా మీద నెగెటివ్ వార్తలు రాస్తున్నావా? కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది ప్రైవేటు ఆస్తుల దగ్గరకు కాదు.. ప్రజల సమస్యల దగ్గరకు వెళితే బాగుంటుందని హితవు పలికారు.

## పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**– జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**
**ములుగు, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**
పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో జిల్లాలో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ, డీటీడీఓలకు సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నేపథ్యంలో ఈ నెల 25 న తేదీన వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం గొల్లల గుడి వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. 26వ తేదీన ఉదయం 8 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులను జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి కిషన్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఇంచార్జి జిల్లా పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్ డీఈవో సిద్ధార్థ్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ నివాస గృహాలలో ఘనంగా అన్నదానం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్




**భద్రాచలం,సెప్టెంబర్22 (వుదయం ప్రతినిధి):**
హిందువులు ఏ శుభకార్యం తలపెట్టినా మొట్టమొదటిగా పూజలు అందుకునే దేవుడు విఘ్నేశ్వరుడని, విఘ్నాలను తొలగించి చేపట్టిన ప్రతి కార్యం విజయవంతం కావాలని ఆశీర్వదించే దేవుడిగా వినాయకుడిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలోని ఉద్యోగులు నివాసం ఉంటున్న సముదాయంలో వరసిద్ధి వినాయక గణపతి నవ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వరసిద్ధి వినాయక గణపతి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా వరసిద్ధి వినాయక స్వామివారికి తన కుమారుడు అదృత్ హావన్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజలు చేసి అనంతరం భక్తులకు అన్నదానాన్ని స్వయంగా ప్రారంభించి భోజనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదర భావం, పరస్పర సహకారం పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భక్తి భావంతో కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు ఐటీడీఏ నివాస గృహాల సముదాయంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలు, చిన్నారులు ఉత్సవాల్లో చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో చూపిన ఉత్సాహం, సహకారం ప్రత్యేకంగా అభినందనీయమని పీవో బి. రాహుల్ అన్నారు. పండుగ సందర్భంగా ప్రతి రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో ఉద్యోగుల కుటుంబ సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక ఐక్యతను చాటడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా ఐటీడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందరూ ఒక కుటుంబంలా ఐకమత్యంతో కలిసి పనిచేయడం వల్లే ఇటువంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఐటీడీఏ నివాస గృహాల సముదాయం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులంతా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అందరూ కలిసి భోజనం చేయడంతో ఉత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి.
ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి శ్రీమతి చందన, ఆర్‌సీఓ గురుకులం అరుణకుమారి, ఏటీడీవోలు చంద్రమోహన్, రాధమ్మతో పాటు ఐటీడీఏలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వరసిద్ధి వినాయక గణపతి భక్తమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేషెంట్ల సహాయకుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్




**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పేషంట్ల సహాయకుల వెయిటింగ్ హాలును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అధికారుల సమక్షంలో ప్రారంభించిన ఎమ్మెల్యే**
**హనుమకొండ, సెప్టెంబర్ 22 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వెయిటింగ్ హాల్‌ను అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.మంగళవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో పేషంట్ల సహాయకుల వెయిటింగ్ హాలును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మెప్మా, జీడబ్ల్యూఎంసి ఆధ్వర్యంలో వెయిటింగ్ హాల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేషంట్లు, వారి సహాయకులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా వెయిటింగ్ హాలు ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆసుపత్రితో తనకు ఎంతో అనుబంధం ఉందని, తాను కూడా ఇక్కడే జన్మించానని తెలిపారు.ఈ ఆసుపత్రికి చారిత్రక ప్రాధాన్యం ఉందని, ఎంతోమంది ప్రముఖులు, మేధావులు ఇక్కడే జన్మించారని గుర్తుచేశారు. అందువల్ల ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ ఎం ఓ లు, పిపిపి యూనిట్ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్, మదర్ మిల్క్ బ్యాంకు సిబ్బంది, పేషంట్ల అటెండెంట్లు,ప్రజలు పాల్గొన్నారు.

## విజిలెన్స్ దాడులతో రైస్ మిల్లర్ల బెంబేలు - కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష



**13 డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం - కొండమీది గోవిందరావు హెచ్చరిక**
**సూర్యాపేట సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**
రైస్ మిల్లర్లపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ ఆకస్మిక దాడులను వెంటనే నిలిపివేసి, ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండమీది గోవిందరావు, కార్యదర్శి నరసింహారావు డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎంఆర్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా రూపొందించాలని, టెస్ట్ మిల్లింగ్ ద్వారా అవుట్ టర్న్ రేషియోను ఖరీఫ్, రబీలకు వేరువేరుగా నిర్ధారించాలని, క్వింటాల్ ధాన్యానికి బిల్లింగ్ చార్జీని రూ.150కి పెంచాలని కోరారు. 2014 నుంచి రావాల్సిన సివిల్ సప్లై మిల్లింగ్, ట్రాన్స్పోర్ట్, డ్రైయేజ్ చార్జీలను వెంటనే చెల్లించి, 25% పెనాల్టీ, 12% వడ్డీని మాఫీ చేయాలని, 202223 రబీ టెండర్ ధాన్యం ధరను న్యాయబద్ధంగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లులను వ్యవసాయ అనుబంధ సంస్థలుగా గుర్తించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం సరఫరా చేసి, ధాన్యం నాణ్యతకు అనుగుణంగా బియ్యం రేషియో నిర్ధారించాలని, ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోయి డిఫాల్ట్ అయిన మిల్లర్ల లెక్కలు తేల్చి బకాయిలను నాలుగు విడతలుగా చెల్లించేలా అవకాశం కల్పించాలన్నారు. ఖరీఫ్ ధాన్యాన్ని పూర్తిగా రా రైస్ గా, రబీ ధాన్యాన్ని పూర్తిగా బాయిల్డ్ రైస్ గా స్వీకరించి, ఎఫ్ సీఐ కఠిన నిబంధనలు సడలించి 13 డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వంగవీటి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బచ్చు ఉపేందర్, చౌగాని బిక్షపతి, గౌరవ సలహాదారులు కాసాని వెంకటేశ్వర్లు, వజ్ర రైస్ మిల్ నిర్వాహకులు వట్టే జానయ్య యాదవ్, మల్లారెడ్డి, మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి




**ఏప్రిల్ నాటికి గోదావరి పుష్కరాల పనులు పూర్తి చేయాలి**
**అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి**
**రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**
**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 22(వుదయం ప్రతినిధి)**
కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి, వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలోని దేవస్థానం ఈవో కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ, పోలీస్, అటవీ,దేవాదాయ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్తు, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్టీసీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. దేవుడి నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పుష్కరాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.
అధికారులు,ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి కాళేశ్వరం క్షేత్ర ప్రాశస్త్యాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఈఓ కార్యాలయంలో వివిధ శాఖల ద్వారా చేపట్టనున్న పనులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరి, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి,ఉపాధిహామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ దండు రమేష్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, దేవాలయ శిల్పి స్థపతి బాలసుబ్రహ్మణ్యం,దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, దేవస్థానం డైరెక్టర్లు, మంచినీళ్ల దుర్గయ్య, గంధసిరి సత్యనారాయణ, అశోక్,ఇరిగేషన్, పంచాయతి రాజ్, విద్యుత్, ఆర్ అండ్ బి, ప్రణాళిక, ఆర్కి టెక్చర్ సూర్య నారాయణ మూర్తి, సర్పంచ్ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రూ. 1.43 కోట్లతో 'అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్'కు శంకుస్థాపన



**మెరుగైన వైద్యంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**హనుమకొండ, సెప్టెంబర్ 22 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పెద్దమ్మగడ్డ కాలనీలో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్'కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో నిర్లక్ష్యానికి గురైన పెద్దమ్మగడ్డ ప్రాంత ప్రజలకు స్థానికంగానే శాశ్వత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ హెల్త్ సెంటర్ ను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.
wఆరోగ్య కేంద్రంతో పాటు డ్రైనేజీ, రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని.. స్థానికుల విజ్ఞప్తి మేరకు నిధులు కేటాయించి 'అంబేద్కర్ భవన్' ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దశలవారీగా పెద్దమ్మగడ్డ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**
**పరకాల, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి) :**
పరకాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన ఆసుపత్రి భవనాన్ని సందర్శించిన కలెక్టర్, వివిధ విభాగాల్లో కల్పించిన మౌలిక వసతులు మరియు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మూడో అంతస్తు వరకు ఉన్న రేడియాలజీ, లేబర్ రూములు, బ్లడ్ బ్యాంక్, ఎమర్జెన్సీ, ఓపీ బ్లాక్, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, వివిధ వార్డుల వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాత ఆసుపత్రి నుంచి అన్ని విభాగాలను నూతన భవనంలోకి సత్వరమే తరలించాలని సూచించారు. భవనంలో విద్యుత్ పనులు నాణ్యతతో ఉండాలని, ఆక్సిజన్ పైప్‌లైన్ల ఏర్పాటు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, TGMIDC ఈఈ నందు పటేల్, పరకాల ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## దివ్యాంగుల సహాయ పరికరాల దరఖాస్తుల పరిశీలనకు జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశం



**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్22(వుదయం):**
యాదాద్రి భువనగిరి జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయ పరికరాల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన నిమిత్తం జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశం ఈరోజు నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (DRDO), జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (DM&HO), జిల్లా రవాణా అధికారి (DTO) మరియు జిల్లా సంక్షేమ అధికారి, WCD&SC పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించారు.సమావేశంలో జిల్లాలోని దివ్యాంగుల నుండి అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి, అర్హతలు, దివ్యాంగత్వ శాతం, అవసరమైన సహాయ పరికరాలు మరియు సంబంధిత ధృవపత్రాలను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు నిర్దేశిత అర్హత ప్రమాణాల ప్రకారం దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.
దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి దివ్యాంగుడు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిటీ సూచించింది. జిల్లా సంక్షేమ అధికారి WCD&SC శాఖయాదాద్రి భువనగిరి జిల్లా ధృవపత్రాలను పరిశీలించారు

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద**
**వరంగల్ జిల్లాసెప్టెంబర్ 22 ( వుదయం ప్రతినిధి ) :**
బుధవారం వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటన లో పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే నిమజ్జన ఏర్పాట్లకు అధికారులను షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించడం జరిగిందని చిన్న వడ్డేపల్లి, కట్ట మల్లన్న చెరువు-గోవ్రెకుంట, అగర్తల చెరువు, ఉర్సుగుట్ట, బెస్తం చెరువు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అలాగే మదన్నపేట నర్సంపేట, దుగ్గొండి చెరువు, పాకాల చెరువు, కొల్లకుల చెరువు చెన్నరావుపేట, గురిజాల పెద్ద చెరువు, నల్లబెల్లి పెద్ద చెరువు, రంగాయి చెరువు, నెక్కొండ చెరువు, చంద్రుగొండ కుంట, కోనారెడ్డి ట్యాంక్ తదితర ప్రాంతాల్లోనూ అధికారులు విధులు నిర్వహించనున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, పడవలు, 108 అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో క్రేన్లు, ఆపరేటర్లు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, సివిల్ డిఫెన్స్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని నిమజ్జన కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, డీజిల్, నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు తమకు కేటాయించిన సమయాల్లో తప్పనిసరిగా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు మొత్తం నిమజ్జన ఏర్పాట్లకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఖరీఫ్ పంటల కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా 22 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**




ఖరీఫ్ (వానాకాలం) పంటల కొనుగోలు ప్రక్రియను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో ఖరీఫ్ పంటల కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జిల్లాలో పంటల కొనుగోలు ప్రక్రియను అధికారులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేశారని, అదే స్ఫూర్తితో ఈసారి కూడా కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గత కొనుగోలు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలు, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు, జాప్యం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా పంటల సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి తదితర వివరాలను సేకరించి, అవసరానికి అనుగుణంగా తగిన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, ఇతర సౌకర్యాలను ముందుగానే సమకూర్చుకోవాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని గోదాముల్లో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరలించి, రానున్న ఖరీఫ్ ధాన్యం నిల్వకు గోదాములను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో వ్యవసాయ, పౌర సరఫరాలు, మార్క్‌ఫెడ్, డీఆర్‌డీఏ, బ్యాంకింగ్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి,రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎల్‌డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా గణేశుడి నిమజ్జనం చేపట్టాలి

- ప్రజలకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలి
- అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ నిరంతరం పర్యవేక్షించాలి
- పొరపాట్లు జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**



గణేషుడి నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.
మంగళవారం జిల్లాలోని కొత్తపల్లి చెరువు, చింతకుంట కాల్వ వద్ద నిమజ్జనం ఏర్పాట్లను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, నగర పాలిక కమిషనర్ ప్రపుల్ దేశాయ్ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు విధిగా నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశం వద్ద లైటింగ్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకొని భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కొత్తపల్లి చెరువు రెండు పాయింట్లు వద్ద నిమజ్జనం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు రెండో పాయింటును వినియోగించాలని సూచించారు. నిమజ్జనం పాయింట్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు.
భారీ విగ్రహాల తరలింపు లో గందరగోళం తలెత్తకుండా ప్రణాళికతో వ్యవహరించాలన్నారు.
ఈ సందర్భంగా పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయిన తీరును పరిశీలించిన కలెక్టర్, ఇంటి లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా అందిన సహాయం, ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ సమయంలో ఎదురైన ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి అందిన ప్రోత్సాహం తదితర అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హిమబిందు, ఎంపీడీవో హెప్సిబా రాణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనకు సమన్వయంతో కృషి చేయాలి



- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**జగిత్యాల సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లాను క్షయ వ్యాధి (టీబీ) రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు టీబీ బాధితుల గుర్తింపు నిర్ధారణ చికిత్స పోషకాహార సహాయం అవగాహన కార్యక్రమాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు జిల్లాలో టీబీ లక్షణాలు ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అందిస్తున్న చికిత్సను సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు టీబీ బాధితులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం కొనసాగించేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు నివారణ చర్యలు ఉచిత పరీక్షలు చికిత్సపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో చురుకుగా పని చేసి అనుమానిత కేసులను గుర్తించాలని సూచించారు టీబీ నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమం విద్య మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు టీబీ బాధితులకు పోషకాహార సహాయం అందించడం వారి కుటుంబాలకు అవసరమైన సహకారం కల్పించడం ప్రజల్లో వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం ద్వారా “టీబీ ముక్త్ భారత్” లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత జిల్లా టిబి ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ డిఆర్డిఓ రఘువరన్ డిఈవో రాము లేబర్ ఆఫీసర్ సురేందర్ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

### రామగిరి మండలంలో

## క్షేత్రస్థాయి భూ సమస్యల పరిశీలన

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఉప్పట్ల కేసారం ప్రభుత్వ భూమి రికార్డులను పరిశీలించిన తర్వాతే తగు నిర్ణయం తీసుకుంటాం
- రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సింగరేణి భూ సేకరణ పై నిర్ణయం

**పెద్దపల్లి, సెప్టెంబర్, 22 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించి క్షేత్రస్థాయి భూ సమస్యలను పరిశీలించారు.
మంగళవారం రామగిరి మండలంలోని ఉప్పట్ల కేసరం గ్రామంలోని భూములను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని రాజాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి భూ నిర్వాసితులతో సమావేశమై వారితో మాట్లాడారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఉప్పట్ల కేసారం సర్వే నంబర్ 35 లోని ప్రభుత్వ భూమి సింగరేణి సంస్థ భూసేకరణలో భాగంగా ప్రాజెక్ట్ రిపోర్టు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల అభ్యంతరాలు, వారి అభిప్రాయాలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే భూ సేకరణ పై తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.



స్థలాన్ని పరిశీలించామని, ప్రభుత్వ భూమికి సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బుధవారం పేటకు సంబంధించి ఈ పర్యటనలో డిసిపి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బొక్కలగుట్ట గ్రామస్తులకు భద్రతా భరోసా



- హైవేపై ప్రమాదాల నివారణకు డీసీపీ భాస్కర్ ప్రత్యేక చొరవ...

**మంచిర్యాల/రామకృష్ణాపూర్/ సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

జాతీయ రహదారిపై తరచూ ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రమాదాల నేపథ్యంలో బొక్కలగుట్ట గ్రామస్థుల భద్రతకు మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు.గాంధారీ మైసమ్మ ఆలయం సమీపంలోని జాతీయ రహదారిపై అధికారులతో డీసీపీ సమావేశమై బొక్కలగుట్ట గ్రామం నుంచి హైవేకు రాకపోకలు సాగించే వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. గ్రామం నుంచి హైవేకు చేరుకునే మార్గంలో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉన్నందున సర్వీస్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిధంగా గ్రామస్థులు హైవేను సురక్షితంగా దాటేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామస్థుల మరో ప్రధాన సమస్య అయిన బస్టాండ్ ఏర్పాటుపై కూడా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని డీసీపీ భాస్కర్ హామీ ఇచ్చారు.గ్రామస్థుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేకంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న డీసీపీ భాస్కర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్, ఎస్సై శ్రీధర్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోలిశెట్టి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక సేవలో చల్మెడ



**వేములవాడ, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి) :**



వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు వినాయక మండపాలను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని తెలంగాణ చౌక్ (చెక్కపల్లి బస్ స్టాప్) ఆవరణలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథుడికి పూజలు చేసి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు ,ఈ ఉత్సవాలు ప్రజల్లో భక్తి, ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని చల్మెడ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను కాళేశ్వరం జోన్ 1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్, జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పరిశీలించారు.ఈ సందర్భంగా వినాయక నిమజ్జన రూట్ మ్యాప్స్,నిమజ్జన పాయింట్లు,ఆయా ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలించే వినాయక విగ్రహాల సంఖ్య తదితర వివరాలను పోలీస్ అధికారులు,సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
అలాగే నిమజ్జన పాయింట్ల వద్ద ఏర్పాటు చేయాల్సిన బారికేడింగ్,లైటింగ్,ట్రాఫిక్ నియంత్రణ,పోలీస్ బందోబస్తు,క్రేన్లు,అత్యవసర సేవలు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు.నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, అవసరాలు ,ఎదురయ్యే సమస్యలు,నిర్వాహకుల సూచనలను తెలుసుకున్నారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని, వాహనాల రాకపోకలను సమర్థవంతంగా నియంత్రిస్తూ భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి, అధికారులకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ,ప్రజలు,ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని కాళేశ్వరం జోన్ 1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్ తెలిపారు.

### ధర్మపురిలో ప్రశాంత వాతావ రణంలో

## వినాయక నిమజ్జనం



- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ బి.సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్
- అధికారులతో సమన్వయం, భక్తుల సహకారం కోరిన యంత్రాంగం

**ధర్మపురి,సెప్టెంబర్ 22 (వు దయం ప్రతినిధి):**

ధర్మపురి,రాయపట్నం గోదావరి నది తీర ప్రాంతాల్లో వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలు, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు.మంగళవారం ఆయన ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి నిమ జ్జన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు,భక్తులు అధికారులకు పూర్తి సహకారం అందించి శోభాయాత్రలను విజయవంతం చేయాలని కోరారు.ననిమర్జన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు,ప్రత్యేక వేదికలు,వైద్య సేవలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
అలాగే గోదావరి వద్ద గజ ఈత గాళ్ళు ,భారీ,చిన్న క్రేన్లను అందు బాటులో ఉంచాలని సూచించా రు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూ దన్,మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి రాజే ష్,డీఎస్పీ పురుషోత్తం రెడ్డి,సీఐ రాం నరసింహా రెడ్డి,ఎస్సై లు సధాకర్, సతీష్,మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు.రామన్న,మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్,తహశీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు,సానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్,సర్పంచ్ రాందేని.మొగిలి తదితరులు పాల్గొన్నారు.


### మార్కెట్ చూసి.

## పంట వేయండి!



- కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం: కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 22 (వుదయం ప్రతినిధి) :**



మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేస్తే రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దబోనాలలో రైతు కాశెట్టి మల్లయ్య నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటను మంగళవారం ఆమె పరిశీలించారు.ఎల్‌నినో ప్రభావంతో వరి సాగును విరమించి వంకాయ, మిరప, కాకరకాయ తదితర కూరగాయలను సాగు చేస్తున్న మల్లయ్యను కలెక్టర్ అభినందించారు.వంకాయ సాగులో మొక్కలు నాటిన 45 రోజుల నుంచే దిగుబడి ప్రారంభమై సుమారు ఆరు నెలలపాటు ప్రతి వారం పంట చేతికి వస్తుందని తెలిపారు. కూరగాయలు, ఆకుకూరల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- రిమ్స్‌లో పర్యవేక్షణ కరువైంది.. సమగ్ర విచారణ జరపాలి
- మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**

ఆదిలాబాద్ రిమ్స్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. రిమ్స్‌తో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరిశీలించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఇచ్చోడకు చెందిన శిశువు మృతి చెందడంపై అనిల్ జాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. రిమ్స్‌లో చిన్నారుల వార్డులో అగ్నిప్రమాదం జరగడం తీవ్రంగా బాధాకరమన్నారు. రోగులకు మెరుగైన వైద్యం, భద్రత కల్పించాల్సిన ఆసుపత్రిలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆసుపత్రిలో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.
అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎంతో నమ్మకంతో రిమ్స్‌కు వస్తుంటే, ప్రాణాలు కాపాడాల్సిన ఆసుపత్రిలోనే అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఆసుపత్రిలో పర్యవేక్షణ లోపించిందని ఆరోపించారు. మూడేళ్లు గడిచినా రిమ్స్ అభివృద్ధికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని, గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించే



పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిమ్స్‌లో అగ్నిమాపక, భద్రతా చర్యలను పటిష్టం చేసి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అనిల్ జాదవ్ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 22 (వుదయం న్యూస్):**

వ్యాన్ లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్సై గోపతి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ ముందు రాష్ట్ర రహదారిపై పోలీస్ సిబ్బంది వాహనాల తనికి చేస్తున్న సమయంలో మంచిర్యాల వైపు నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ ని తనిఖీ చేయగా అందులో 34 క్వింటాళ్ల రేషన్ బియ్యం కలిగి ఉండడంతో వ్యాన్ తో పాటు రేషన్ బియ్యాన్ని పోలీస్




స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా తీసుకువచ్చిన కోట సత్తయ్య, మధుకర్ ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న రేషన్ బియ్యం విలువ సుమారు రూ. 68 వేల విలువ ఉంటుందని తెలిపారు.

## గణేష్ మండపాల వద్ద కుంకుమ పూజలు

**దండేపల్లి: సెప్టెంబర్ 22 (వుదయం విలేకరి)**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలంలోని తాళ్ళపేట గ్రామంలో మాల మహానాడు గణేష్ మండలి,దండేపల్లి మండల కేంద్రంలోని ఎస్ హాస్టల్ రోడ్డులోని శ్రీ బాల గణేష్ మండలిల ఆధ్వర్యంలో గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ బద్ధంగా కుంకుమార్చనలు చేసి గణపయ్యను కొలిచారు. వినాయకుడి విగ్రహాలను పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక



పూజలు,అభిషేకాలు, హారతులు నిర్వహించారు. మహిళల కుంకుమ పూజ లు,భక్తుల గణనాథుని నామస్మరణతో పూజా ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకు న్నాయి.ఈ సందర్భంగా విఘ్నాలు తొలగించి కుటుంబాల్లో సుఖశాం తులు,సిరి సంపదలు ప్రసాదించాలని గణనాథుడిని ప్రార్థించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు,మహిళలు, భక్తులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఆదివాసి కాంగ్రెస్ ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం

**నారాయణపేట సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

ఆదివాసీ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ సమాజంలో కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం లో జిల్లా అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ వి.లింగం నాయక్,రాష్ట్ర పరిశీలకులు శ్రీను నాయక్, పాల్గొన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ కమిటీల నియామకానికి నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా పరిశీలకులు శ్రీను నాయక్ మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్ ఉద్దేశం కేవలం కమిటీల ఏర్పాటు మాత్రమే కాదని, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తామన్నారు.గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఆదివాసీ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, రాజ్యాంగం,ఆదివాసీ హక్కులు,పీసా, అటవీ హక్కుల చట్టాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించాలని సూచించారు.పదవి పొందడం కంటే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడమే ముఖ్యమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ వంటి ప్రతిపక్షాల విమర్శలకు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి వారికి గట్టిగా సమాధానం ఇవ్వాలని సూచించారు.రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ వి. లింగం నాయక్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి సంస్థాగతంగా తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఆదివాసీ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మించడమే లక్ష్యమన్నారు. ప్రతి గ్రామంలోని ఆదివాసీ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని మండల, జిల్లా స్థాయికి తీసుకెళ్లే వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.పదవులు పొందిన ప్రతి నాయకుడు బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆదివాసీలు, ఎస్సీలు,అట్టడుగు వర్గాల అభివృద్ధి, హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. సలీం, ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు శరణ్ నాయక్, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గాజుల శివకుమార్,జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గొల్ల. కృష్ణయ్య, విజయ్ నాయక్, శ్రీధర్ నాయక్,సర్పంచ్ లు శ్రీధర్ నాయక్, సురేష్ నాయక్, కృష్ణ నాయక్, తిరుపతి నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా లో యూత్ కాంగ్రెస్ ను బలోపేతం చేయాలి



- పరశురామ్ గౌడ్
- త్వరలో యూత్ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు

**మెదక్,సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**

మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో మంగళవారం జిల్లా యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురాం గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నూతన ఇన్‌చార్జిలు రవికాంత్ గౌడ్, సాత్విక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. నూతన ఇన్‌చార్జిలు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో అన్ని స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమ్మరి రమేష్‌చారి, మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు భరత్ గౌడ్, హవేలీ ఘనపూర్ మండల అధ్యక్షుడు రిజ్వాన్, మెదక్ మండల అధ్యక్షుడు పవన్,గోపాల్ నాయక్,రాము,రాజు,అహ్మద్,హాజీ, నవీన్, రవి,అశోక్,ప్రసాద్,ఆంజనేయులు, విష్ణు,శ్రావణ్,భాను,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తిని చాటిన జర్నలిస్టుల రక్తదాన శిబిరం

- బండారు యాదగిరి జన్మదినం సందర్భంగా భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు
- అభినందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు



**సంగారెడ్డి :వుదయం**

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJIJU) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సంగారెడ్డి ఐబీలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ తదితరులు రక్తదాన శిబిరం నిర్వహణను అభినందించారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఫైసల్ మాట్లాడుతూ సంగారెడ్డితో పాటు పటాన్‌చెరు, జహీరాబాద్, సదాశివపేట, ఆందోల్, హత్నూర, నారాయణఖేడ్ ప్రాంతాల నుంచి జర్నలిస్టులు తరలివచ్చారని పేర్కొన్నారు.సదాశివపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు హాజీ, పటాన్‌చెరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి యాదగిరి, పుల్కల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్, ఇర్షన్, జరా సంఘం మహేష్‌తో పాటు కొంపల్లి విద్యాసాగర్, మ్యాడమ్ రాధాకిషన్, పుల్లూరి ప్రకాష్, కుందారం రాజయ్య, మనోహర్, ఆమెటి మహేందర్, దాచేపల్లి రవీందర్, పుర్ర రాములు, జోగన్నగారి యాదగిరి, సాహితీ స్కూల్ రవికుమార్సృస్వా శ్రీనివాస్, రాచర్ల ప్రసాద్, కె.చంద్రశేఖర్, మాణిక్ ప్రభు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆమెటి కృష్ణ, సదాశివపేట జయరాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం మారుతి సాగర్ గళం!

- అక్రిడిటేషన్ నుంచి సంక్షేమం వరకు... జర్నలిస్టు సమస్యలపై టీయూడబ్ల్యూజే పోరాటం
- వ్యక్తి కాదు... వ్యవస్థ ముఖ్యం!
- హక్కుల కోసం ప్రశ్నించే సంఘాలే ప్రజాస్వామ్యానికి బలం



**వికారాబాద్ 23 (వుదయం బ్యూరో)**

జర్నలిజం అనేది కేవలం వార్తలను సేకరించి ప్రచురించే వృత్తి కాదు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికార వ్యవస్థను ప్రశ్నించడం, ప్రభుత్వ విధానాలను ప్రజల ముందుంచడం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను నమోదు చేయడం జర్నలిస్టు బాధ్యత. అలాంటి బాధ్యతను నిర్వహించే జర్నలిస్టుల వృత్తి భద్రత, గుర్తింపు, ఆరోగ్యం, సంక్షేమం వంటి అంశాలు కూడా అంతే ప్రాధాన్యమైనవి. ఈ నేపథ్యంలో తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం మాట్లాడుతున్న సంఘాల్లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్—TUWJ—ఒకటి. ఈ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆస్కాని మారుతి సాగర్ పేరు ఇటీవలి సంవత్సరాల్లో జర్నలిస్టు వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది.

**మారుతి సాగర్ ఎవరు?**

**జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్రస్థాయిలో గళం వినిపిస్తున్న నాయకుడు**

ఆస్కాని మారుతి సాగర్ జర్నలిస్టు సంఘాల కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకుడిగా పలు సంవత్సరాలుగా వార్తల్లో కనిపిస్తున్నారు. ఆయన TUWJ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత కూడా అక్రిడిటేషన్, జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, సభ్యత్వం, జర్నలిస్టుల సమస్యలు వంటి అంశాలపై ప్రస్తావించారు.

2020 నుంచే సమస్యలపై చర్చ

కేబుల్ టీవీ జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశం నుంచి విస్తరించిన ఉద్యమం

కేబుల్ టీవీ జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి గుర్తింపు, అక్రిడిటేషన్, సంక్షేమ పథకాలు అందాల్సిన అవసరాలను అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్య ఆయన ప్రజా కార్యకలాపాల్లో కొత్త అంశం కాదు.

**TUWJ... ఒక పేరు కాదు, ఒక సంఘటిత వేదిక**

H143 గుర్తింపుతో జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్రస్థాయి ప్రాతినిధ్యం

తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రలో TUWJకు ప్రత్యేక స్థానం ఉంది. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించే వ్యవస్థలో TUWJ ముందుంది. సభ్యులు, జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీ, నాయకత్వం కలిసి నడిపించే సంస్థాగత వ్యవస్థ. మారుతి సాగర్ ప్రస్తుతం ఆ వ్యవస్థలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలో ఉన్నారు.

**జర్నలిస్టుల అక్రిడిటేషన్... ఎందుకింత కీలకం?**

గుర్తింపు కార్డు మాత్రమే కాదు... వృత్తి భద్రతకు సంబంధించిన అంశం

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ అనేది కేవలం ఒక గుర్తింపు కార్డు కాదు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రాప్యత, అధికారిక సమాచారం సేకరణ, మీడియా వ్యవస్థలో గుర్తింపు, కొన్ని సంక్షేమ పథకాల అర్హత వంటి అంశాలతో అది ముడిపడి ఉంటుంది. అందుకే అర్హత ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వాలనే డిమాండ్ జర్నలిస్టు సంఘాల నుంచి తరచూ వినిపిస్తోంది.

కొత్త అక్రిడిటేషన్ నిబంధనలు వచ్చిన ప్రతిసారీ వాటిపై జర్నలిస్టు సంఘాలు తమ అభిప్రాయాలను వెల్లడించడం, లోపాలుంటే సవరణలు కోరడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన ప్రక్రియ. TUWJ తరఫున కూడా ఇలాంటి డిమాండ్లు పలు సందర్భాల్లో ముందుకు వచ్చాయి.

**సంక్షేమం ఎక్కడ?**

ఆరోగ్య భద్రత... ఇళ్ల స్థలాలు... ఆర్థిక సహాయం... ఇవన్నీ ఇంకా ప్రధాన ప్రశ్నలే

జర్నలిస్టు ఉదయం నుంచి రాత్రి వరకు వార్త కోసం పరుగులు తీస్తాడు. ఎండ, వర్షం, ప్రమాదం, ఒత్తిడి—ఏ పరిస్థితిలోనైనా ప్రజలకు సమాచారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తాడు. కానీ అదే జర్నలిస్టుకు అనారోగ్యం వస్తే? ప్రమాదం జరిగితే? ఉద్యోగం కోల్పోతే? కుటుంబానికి ఆర్థిక ఇబ్బంది వస్తే? ఈ ప్రశ్నలకు సమర్థవంతమైన సంక్షేమ వ్యవస్థ అవసరం.

హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ వైద్యం, జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్, కుటుంబ సంక్షేమం—ఇవన్నీ సంవత్సరాలుగా జర్నలిస్టు సంఘాలు ప్రభుత్వాల ముందు ఉంచుతున్న అంశాలు.

**వెయ్యి రోజులు... హామీలు ఎన్ని? అమలు ఎంత?**

ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మాత్రమే కాదు... లెక్కలు చెప్పించాల్సిన సమయం

జర్నలిస్టుల సంక్షేమంపై ఏ ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఆ హామీ ఎప్పుడు అమలవుతుంది? ఎంతమందికి ప్రయోజనం అందింది? ఎంత నిధి విడుదలైంది? ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని సమస్యలు పరిష్కరించబడ్డాయి? అనే ప్రశ్నలకు అధికారిక లెక్కలు బయటకు రావాలి.

ఇదే సమయంలో జర్నలిస్టు సంఘాలపైనా ఒక బాధ్యత ఉంది. ప్రభుత్వం మీద డిమాండ్లు చేయడం ఎంత ముఖ్యమో, తమ సభ్యుల వాస్తవ పరిస్థితులపై పూర్తి గణాంకాలు సేకరించడం కూడా అంతే ముఖ్యం. జిల్లాల వారీగా ఎంతమంది జర్నలిస్టులు ఉన్నారు? ఎంతమందికి అక్రిడిటేషన్ ఉంది? ఎంతమంది అర్హులైనా కార్డులు పొందలేదు? ఎంతమంది సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు? అనే వివరాలు ప్రజల ముందుంచితే ఉద్యమానికి మరింత బలం వస్తుంది.

**మారుతి సాగర్ ముందున్న అసలు పరీక్ష**

పదవి కాదు... సమస్యల పరిష్కారమే నాయకత్వానికి కొలమానం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనే పదవి ఒక బాధ్యత. ఆ బాధ్యతకు అసలు పరీక్ష సభలు నిర్వహించడంలో కాదు; జర్నలిస్టుల సమస్యలను ఎంత బలంగా, ఆధారాలతో ప్రభుత్వ ముందుంచగలిగారు? ఎంతమంది జర్నలిస్టులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకురాగలిగారు? ఎంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లగలిగారు? అన్నదే.

మారుతి సాగర్ సహా TUWJ నాయకత్వం ముందు ఉన్న ప్రధాన సవాలు ఇదే. అక్రిడిటేషన్ కోసం పోరాటం కొనసాగాలి. ఆరోగ్య భద్రతపై స్పష్టత రావాలి. సంక్షేమ నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాలి. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు కార్యాచరణ రావాలి. ఫీల్డ్‌లో పనిచేసే ప్రతి వర్గం జర్నలిస్టుకు న్యాయం జరిగేలా విధానం ఉండాలి.

**వ్యక్తుల చుట్టూ కాదు... జర్నలిస్టుల చుట్టూ ఉద్యమం**

సంఘం బలంగా ఉంటేనే సభ్యుడి గొంతు బలంగా వినిపిస్తుంది

ఏ జర్నలిస్టు సంఘమైనా వ్యక్తి ఆధారంగా కాకుండా సంస్థాగతంగా బలపడాలి. నాయకుడు మారినా సమస్యలు కొనసాగుతాయి. పదవులు మారినా జర్నలిస్టుల అవసరాలు మారవు. అందుకే వ్యక్తుల కీర్తి కంటే సమస్యల పరిష్కారమే ముఖ్యంగా మారాలి.

మారుతి సాగర్ పేరు చుట్టూ చర్చ జరగడం ఒక అంశం అయితే, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జర్నలిస్టుల సమస్యలపై చర్చ జరగడం మరో ముఖ్యమైన అంశం. రెండింటినీ కలిపి చూడకూడదు. వ్యక్తిగత చరిత్రకు ఆధారాలు అవసరం; జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారాలు అవసరం.

**జర్నలిస్టు ప్రశ్నిస్తే... సమాజం మేల్కొంటుంది**

జర్నలిస్టు అధికారాన్ని ప్రశ్నిస్తాడు. ప్రజల తరఫున ప్రశ్నిస్తాడు. తప్పును చూపిస్తాడు. అవినీతిని బయటపెడతాడు. అభివృద్ధి లోపాలను ఎత్తిచూపుతాడు. అందుకే జర్నలిస్టు స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, జర్నలిస్టు సంక్షేమం కూడా అంతే ముఖ్యమైనది.

తెలంగాణ జర్నలిస్టు ఉద్యమం ఎన్నో దశలను దాటింది. ఉద్యమ కాలం నుంచి సంక్షేమ సమస్యల వరకు, అక్రిడిటేషన్ నుంచి ఆరోగ్య భద్రత వరకు అనేక అంశాలు జర్నలిస్టు సంఘాల ఎజెండాలో కొనసాగుతున్నాయి. ఆ ప్రయాణంలో TUWJH143లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారుతి సాగర్ నిర్వహిస్తున్న పాత్ర కూడా ఒక భాగం. కానీ చివరికి చరిత్ర వ్యక్తుల పేర్లతో మాత్రమే రాయబడదు. ఎన్ని సమస్యలు పరిష్కరించబడ్డాయి? ఎన్ని కుటుంబాలకు భరోసా లభించింది? ఎన్ని అర్హులైన జర్నలిస్టులకు గుర్తింపు వచ్చింది? ఎన్ని హామీలు కార్యరూపం దాల్చాయి? అన్న లెక్కలతో రాయబడుతుంది.

జర్నలిస్టుల హక్కుల కోసం గొంతెత్తడం అవసరం. ఆ గొంతు ఆధారాలతో ఉండాలి. ఉద్యమం నిరంతరం ఉండాలి. ప్రభుత్వం సమాధానం చెప్పాలి. సంఘాలు కూడా తమ పనికి లెక్క చెప్పాలి. అప్పుడు మాత్రమే జర్నలిస్టు సంక్షేమం నినాదం నుంచి వాస్తవంగా మారుతుంది.

"పదవులు తాత్కాలికం... జర్నలిస్టుల సమస్యలు శాశ్వతం. నాయకత్వానికి అసలు గుర్తింపు—సమస్య పరిష్కారంలోనే!"

**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

## రైతుల సూచనలను పరిశీలించి పరిష్కారం చూపాలి

- మేడిపూర్ చెరువుకు కేఎల్ఐ నీటి తరలింపుపై క్షేత్రస్థాయి పరిశీలన - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 22 (వుదయం బ్యూరో):**

మేడిపూర్ చెరువుకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) నీటి తరలింపునకు అవసరమైన భూసేకరణపై రైతుల సూచనలను పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.తాడూరు మండలం మేడిపూర్ గ్రామ శివారులో మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా 28వ ప్యాకేజీ డిస్ట్రిబ్యూషన్ కెనాల్ నుంచి మేడిపూర్ చెరువుకు సాగునీటిని కాలువ ద్వారా తరలించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సుమారు కిలోమీటర్ మేర కాలువ ద్వారా నీటిని తరలించేందుకు అవసరమైన భూసేకరణ, సర్వే మ్యాప్, ప్రతిపాదిత మార్గం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మేడిపూర్ రైతులు కలెక్టర్‌ను కలిసి కాలువ నిర్మాణం వల్ల వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లుతుందని, కాలువకు బదులు పైపులైన్ ద్వారా నీటిని తరలించాలని కోరారు. రైతుల ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మేడిపూర్ గ్రామ తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువును నీటితో నింపాలని, అక్కడి నుంచి దుందుభి వాగులోకి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.చెరువు సమీపంలో అనుమతులు లేకుండా మట్టిని చదును చేసిన ప్రాంతాన్ని గుర్తించిన కలెక్టర్ వెంటనే తొలగించాలని, చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట కేఎల్ఐ భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అరుణ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, తహసీల్దార్, సర్పంచ్ మల్లేష్, రైతులు, అధికారులు ఉన్నారు.

## నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు


- సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం
- 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం..
- జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి..
- ప్రభుత్వ విద్య వ్యవస్థ బలోపేతానికి ప్రథమ ప్రాధాన్యత..
- ఎడ్యుకేషనల్ హబ్ గా పటాన్చెరు..
- భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులది
- మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్చెరు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు
- 100 మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**పటాన్చెరు (వుదయం):**

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఒక విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు ఉత్తమ భవిష్యత్తును అందిస్తారని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను.. ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల ఎమ్మెల్యే జిఎంఆర్ ను ప్రశంసించారు. పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్ర అభినందనీయమని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి మాట్లాడుతూ..ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ.. ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తూ.. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎటువంటి సమస్యలు ఉన్న స్వయంగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముందుంటారని కితాబుని ఇచ్చారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైతం ప్రోత్సాహకాలు అందించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో ప్రతి సంవత్సరం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. గురువులకు పాదాభివందనం పేరుతో తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమానికి మంత్రముగ్ధులైన ఎమ్మెల్యే జిఎంఆర్.. స్వయంగా 26వేల రూపాయల నగదు బహుమతి అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా తాగునీటి సరఫరా సమీక్ష



**మహబూబ్‌నగర్**

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వెబెక్స్ ద్వారా మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా విభాగాల ఈఈలు, డీఈలు, ఏఈలతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తాగునీటి సరఫరా, పైపులైన్ల నిర్వహణ, లీకేజీల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు.పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన అన్ని పైపులైన్లను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా పైపులైన్లలో లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి, నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు.ప్రజలకు నిరంతరాయంగా, సక్రమంగా తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తిన ప్రాంతాలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో గద్వాల చిన్నారుల ప్రతిభ



- రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు
- స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 22 (వుదయం కరస్పాండెంట్)**

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో గద్వాల జిల్లాకు చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలోని క్రీడాకారుల ప్రతిభను మరింతగా ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని కలెక్టర్ ఛాంబర్‌లో హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సోల్ స్పోర్ట్జ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన గద్వాల చిన్నారులను కలెక్టర్ అభినందించారు.క్రీడాకారులు తమ తల్లిదండ్రులు, కోచ్ రాజుతో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాలను వివరించారు. అండర్-6, అండర్-8, అండర్-10 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో షేక్ అతిక సామీన్ కాంస్య పతకం సాధించగా, హన్విక, సాంధిత్య, అయ్యోరు అభిమన్యు వెండి పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చారు.

**చిన్న వయస్సులోనే ప్రతిభ అభినందనీయం**

చిన్న వయస్సులోనే స్కేటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను ఆకాంక్షించారు.స్కేటింగ్ క్రీడాకారుల ప్రతిభను మరింతగా ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో స్కేటింగ్ క్రీడకు అవసరమైన రింక్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ప్రోత్సహించాలిక్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్ రాజుతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కలెక్టర్ అభినందించారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించి, వారి ప్రతిభను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.కార్యక్రమంలో కోచ్ రాజు, తల్లిదండ్రులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

వనపర్తిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభివనపర్తి పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ నల్లచెరువు ట్యాంక్‌బండ్‌ను సందర్శించి, వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. మంగళ, బుధ, గురువారాల్లో నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులు నిమజ్జన ప్రాంతానికి సురక్షితంగా చేరుకుని తిరిగి వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.నల్లచెరువు ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో ప్రజలు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడానికి భారీ క్రేన్లను వినియోగించుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా సంబంధిత సిబ్బంది, అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచాలని, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయిన వెంటనే ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు అధికారులకు సహకరిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# మోటార్లు కాలుతున్నాయి.. పంటలు ఎండుతున్నాయి.. సర్కార్ నిద్రపోతోందా?

- కరెంటు కోతలతో రైతుల మోటార్లు కాలుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు
- రైతులను నట్టేట ముంచుతున్న రేవంత్ సర్కార్
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్





**మునగాల, సెప్టెంబర్ 22 (వుదయం):-**

మునగాల మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. రైతుల ఆందోళనకు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై సంఘీభావం తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులకు సమాధానం చెప్పాలని, వ్యవసాయానికి అవసరమైన స్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ గత నెల రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని ఆరోపించారు. రోజుకు ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని, విడతల వారీగా సరఫరా చేస్తూ తరచూ విద్యుత్ వస్తూపోవడంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. మోటార్లు కాలి పోవడంతో మరమ్మతులు, కొత్త మోటార్లు కొనుగోలు భారం రైతులపైనే పడుతోందని పేర్కొన్నారు.

**సకాలంలో సాగునీరు అందక**

విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ ప్రాంతంలో నీరు, విద్యుత్ సమస్యలతో రైతులు అప్పులపాలవుతున్నారని మల్లయ్య యాదవ్ విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతు లేకపోతే రాజ్యమే లేదని, రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదని అన్నారు. విద్యుత్ కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. రైతులకు విద్యుత్, సాగునీరు, ఎరువులు, యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలను గాలికి వదిలి పాలన సాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వ్యవసాయానికి నిర్ణీత సమయంలో నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా కాలిపోయిన మోటార్లకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని రైతులు నినాదాలు చేస్తూ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్, మునగాల, తాడువాయి సహకార సంఘ సంఘ అధ్యక్షులు కందిబండ సత్యనారాయణ తొగరు సీతారాములు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సుంకర అజయ్ కుమార్ మాజీ జెడ్పిటిసి సభ్యులు కోల ఉపేందర్ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు మహిళ అధ్యక్షురాలు సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్మగ్లర్ల గుప్పిట్లో అటవీశాఖ?





- కంచే చేను మేస్తుంటే కాపాడే నాథుడెవరు?
- రెవెన్యూను మించిపోయిన ఫారెస్ట్ అధికారుల అవినీతి దందా.!

**కల్లూరు,సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

పర్యావరణాన్ని, అటవీ సంపదను కంటికి రెప్పలా కాపాడాల్సిన అటవీశాఖ... ఇప్పుడు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే వారి ముందు సాగిలపడుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వేలాది హెక్టార్ల అటవీ సంపద కళ్లెదుటే మాయమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అవినీతిలో ఎప్పుడూ ముందుండే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను సైతం ఇప్పుడు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ మించిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**"టిప్పుకు ఎంత..?" - ఇదీ శాఖలో కొత్త ట్రెండ్!**

అటవీశాఖలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులంతా ఒకే తాటిపై నడుస్తూ అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారు. బీట్ ఆఫీసర్ మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ "టిప్పుకు ఎంత?" అన్న లెక్కలతో మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. డిపార్ట్‌మెంట్‌కు ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని అక్రమాలను కప్పిపుచ్చుకోవడంలో అధికారులు చూపిస్తున్న 'ఐకమత్యం'.. అడవిని కాపాడటంలో ఏమాత్రం కనిపించడం లేదన్నది సుస్పష్టం.

**స్మగ్లర్లతో దోస్తీ... వన్యప్రాణుల ప్రాణాలకు బలి!**

అడవిలో మూగజీవాల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. వన్యప్రాణులను యథేచ్ఛగా వేటాడి, వాటి మాంసాన్ని బహిరంగంగా అమ్ముకుంటున్నా కనీసం పట్టించుకునే పాపాన పోవడం లేదు. విలువైన అటవీ సంపదను, కలపను పగటిపూటే ఇటుక బట్టీలకు తరలిస్తున్నా... ఎవరి అండతో ఈ దందా సాగుతుందో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. స్మగ్లర్లతో అధికారులు అంటకాగుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**అరకొర స్పైస్లు... అక్రమాలకు లైసెన్స్**

అంతా కళ్లెదుటే జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? స్మగ్లర్లతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని, పైకి మాత్రం వ్యవహారం బెడిసికొట్టకుండా 'అరకొర స్పైస్' వేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులపై చర్యలు తీసుకునే వారే లేకపోవడం గమనార్హం.

అటవీ సంపద కళ్లెదుటే ఆవిరైపోతుంటే చూస్తూ ఊరుకోవడం అంటే, మన భవిష్యత్తును మనమే నాశనం చేసుకోవడమే. వ్యవస్థలో వేళ్లూనుకున్న ఈ అవినీతి క్యాన్సర్‌పై ప్రభుత్వం తక్షణమే ఉక్కుపాదం మోపాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే... భవిష్యత్తు తరాలకు అడవులు కేవలం కాగితాల మీద, కథల్లో మాత్రమే మిగిలిపోవడం ఖాయం!

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమం



**మధిర, సెప్టెంబర్,22, వుదయం, ప్రతినిధి:**

మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జి. శంకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఖమ్మం వారి ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని రెండో రోజు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనమా సూరి, సూరం శెట్టి కిషోర్, మిరియాల రమణ గుప్తా పాల్గొని కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. శంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం,భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి బి. తౌరియా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

## 12వ జాతీయ గోండి (కోయ) భాషా ప్రామాణీకరణ వర్క్ షాప్ కరపత్రం ఆవిష్కరణ

**ఎమ్మెల్యే జారె**

**దమ్మపేట సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి )**



తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో 12వ జాతీయ గోండి (కోయ) భాషా ప్రామాణీకరణ వర్క్ షాప్ కరపత్రాన్ని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పినపాక ఎమ్మెల్యే కోరం కనకయ్య వర్క్ షాప్ నిర్వాహకులతో కలసి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి విశిష్టమైన చరిత్ర కలిగిన గోండి (కోయ) భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోండి (కోయ) భాషను చేర్చడమే లక్ష్యంగా భాష ప్రామాణీకరణ కోసం భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో అక్టోబర్ 2 నుండి 6 వరకు 5 రోజుల పాటు జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు కోయ భాష పురోగతికి డిక్షనరీ రూపకల్పనకు భాషా సాంస్కృతిక విశిష్టతను భావితరాలకు అందించడానికి ఇటువంటి జాతీయ వర్క్ షాప్‌లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు భాషాపరిరక్షణకు ప్రజాప్రతినిధులుగా తమ వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు గిరిజన ప్రాంతాల ప్రతినిధులు భాషాభిమానులు మేధావులు ఈ 5 రోజుల వర్క్ షాప్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## కందుకూరులో పోషణ మాసం కార్యక్రమం

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ( వుదయం ప్రతినిధి)**



వేంసూరు మండల పరిధిలోని కందుకూరులో పోషణ మాసం సందర్భంగా తల్లులతో సర్పంచ్ మందపాటి వెంకట రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా పిల్లలు ఎదుగుతారని తెలిపారు. సెక్రటరీ సునీత , అంగన్వాడీ టీచర్లు సుశీల, ఎలిజబెత్, అనాధ కుమారి, మారేషు, పద్మ, చమంతి , జయమ్మ ఆశ వర్కర్స్, ఏఎన్ఎం జ్యోతి తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## భజరంగ్ వ్యాయామశాల గణపతి మండపం వద్ద ఘనంగా అన్నదానం

**యాదాద్రి భువనగిరి, 22-09-2026**



భువనగిరి పట్టణంలోని భజరంగ్ వ్యాయామశాల గణపతి మండపం వద్ద నవ భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తంగళ్లపల్లి రవికుమార్, ఉత్సవ సమితి అధ్యక్షుడు పసుపునూడి నాగభూషణం, 34వ వార్డు కౌన్సిలర్ సరగడ రాజ్యలక్ష్మి అమర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్పీ మట్ట సబిత, బీఆర్ఎస్ నాయకురాలు సిద్ధుల పద్మ, చంద్రకళా రెడ్డి, రాంబాయి రెడ్డి, గొర్రింకల సబిత, స్వప్న, సరగడ విమల తదితర మహిళలు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యువత సభ్యులు సరగడ అమర్, సరగడ కరుణ్, బుగ్గ సిద్దులు, ముత్యాల సాయి కిరణ్ యాదవ్,గొర్రింకల అక్షిత్, వెంకటేష్, వి. సాయికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించడం పట్ల నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం

**చర్ల, సెప్టెంబర్ 22: (వుదయం ప్రతినిధి)**



ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా అసెంబ్లీ సమావేశాలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, అవి ప్రజలకు ఉపయోగపడే విధంగా సాగడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, ప్రతిపక్ష పార్టీలపై వ్యక్తిగత విమర్శలతో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తున్నారని తాతారావు విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని అన్నారు. రైతులు సాగునీరు, విద్యుత్, వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు యాప్‌ల ద్వారా ఎరువుల పంపిణీతో అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి విషయంలో ఇచ్చిన హామీలు అమలు కాక యువత నిరాశకు గురవుతోందని అన్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులు, బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, పోడు భూముల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ప్రయోజనాల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హరితహారం వంటి కార్యక్రమాలను విస్మరించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు నష్టం జరుగుతోందన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు జీఓ 97 వల్ల నష్టం జరుగుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సహాయం, రైతు బీమా, కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాల విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి హామీలను అమలు చేయాలని దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు.

## నల్లగొండ పట్టణంలో 37, 48 కార్పొరేటర్ సహకారంతో ఉత్సవ వేడుకలు

**అన్నదాతలు తుల్జా భవాని యూత్ సభ్యులు**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 22**



నల్గొండ పట్టణ కేంద్రంలో 37, 48 వార్డు ప్రజలు గత తొమ్మిది సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో గణేష్ ని నియమించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం తో ప్రతిరోజు ఘనంగా పూజలు చేస్తూ సాయంత్రం వేళలో ఆటపాటలతో కోలాటాలతో సంగీత గానంతో వినాయకుని మండపం వద్ద పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ భగవంతున్ని వేడుకుంటారని కమిటీ పెద్దవారు దోస పట్ల శీనువాస్ గాదరి లింగయ్య కోమటి అవినాష్ నాగేశ్వరరావు బిక్షం రమేష్ దామోదర్ కిరణ్ మీరు మాట్లాడుతూ ఈరోజు దాదాపుగా వెయ్యి మందికి పైగా అన్నదాన కార్యక్రమం చేపట్టి ప్రతి ఒక్కరు వచ్చి అన్నదానాన్ని స్వీకరించి గణేశుని ఆశీర్వాదాలు ఆశీర్వాదాలతో సంతోషంగా ఇక్కడ గడిపారని కమిటి నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు సంతోష్ సాయిరాం మణి శివమణి సాయి శివరాం గణేష్ రవి శ్రీరామ్ అనిల్ అజయ్ సురేష్ వరమని బన్నీ కార్తీక్ పట్టణ ప్రజలు కాలనీవాసులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్**

**దమ్మపేట సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):**



మధ్యాహ్న భోజనం కార్మికుల పెండింగ్ వేతనాలు వంట బిల్లులు గుడ్డు బిల్లులు నెలలు తరబడి వంట కార్మికులకు విడుదల చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సి ఐ టి యు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిఆర్పి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులు,ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం ఉండటం లేదని అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే సందర్భంలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ ధర్నాకు వెళ్తుంటే కార్మికుల నాయకుల ఇండ్లపై పడి అరెస్టులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వ స్వభావాన్ని చాటుకుంటుందని అన్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్లుగా పాఠశాలల వంట మెనూ అమలు చేయాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని కానీ సకాలంలో వండిన బిల్లులు రాక అనేక యాతనలు అనుభవిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజనం పంట కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు పదివేల రూపాయలు వేతనం పెంచాలని గ్యాసు కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మురహరి రఘు, సత్యవతి,శ్రీదేవి, ఈశ్వరమ్మ, జయ, రాములమ్మ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని కృపతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి

**మధిర, సెప్టెంబర్ 22, వుదయం, ప్రతినిధి:**



మధిర పట్టణంలోని 22వ వార్డులో నిర్వహిస్తున్న శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకుని దివ్య కృపతో మధిర ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండేలా వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సురం శెట్టి కిషోర్, దుంప వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ సంపసాల రామకృష్ణ,కౌన్సిలర్లు బాణావత్ వెంకటరమణ నాయక్,ధారా నాగార్జున, పట్టణ నాయకులు సువర్ణకంటి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు సాలిక సురేష్, మోదుగు బాబు తదితరులు పాల్గొన్నారు.



## వేద వాస్య గణేష్ ఉత్సవ కమిటీ వేడుకలు

**అన్నదాతలు మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ 47 వార్డ్ కార్పొరేటర్ కవిత**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 22**

నల్గొండ పట్టణ వార్డు ప్రజలు గత తొమ్మిది సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో గణేష్ ని నియమించి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం తో ప్రతిరోజు ఘనంగా పూజలు చేస్తూ సాయంత్రం వేళలో ఆటపాటలతో కోలాటాలతో సంగీత గానంతో వినాయకుని మండపం వద్ద పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ భగవంతున్ని వేడుకుంటారని కమిటీ మాట్లాడుతూ.. ఈరోజు దాదాపుగా వెయ్యి మందికి పైగా అన్నదాన కార్యక్రమం చేపట్టి ప్రతి ఒక్కరు వచ్చి అన్నదానాన్ని స్వీకరించి గణేశుని ఆశీర్వాదాలు ఆశీర్వాదాలతో సంతోషంగా ఇక్కడ గడిపారని కమిటి నిర్వాహకులు తెలిపారు . కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మున్నాసు వెంకన్న మున్నాస్ ప్రసన్నకుమార్ మున్నాస్ నాగరాజు చినుగురి భరత్ ద్వాజ మున్నాస్ విజయ్ వినయ్ కుమార్ సాత్విక్ కాలనీ ప్రజలు పట్టణ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రాళ్లాపురం లో వైద్య శిబిరం

**34 మందికి ఆరోగ్య పరీక్షలు**

**చర్ల, సెప్టెంబర్ 22: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండలంలోని మారుమూల ప్రాంతమైన రాళ్ళాపురం గ్రామంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చర్ల (కొయ్యూరు) ఆధ్వర్యంలో వైద్యాధికారి డా. హారిక నేతృత్వంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 34 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. జ్వరంతో బాధపడుతున్న ఒక వ్యక్తి నుంచి రక్త నమూనాలు (బ్లడ్ స్మియర్స్) సేకరించి అవసరమైన వైద్యం అందించారు. ఈ సందర్భంగా డా. హారిక మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని పాటించాలని తెలిపారు. జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆశా కార్యకర్తలకు సమాచారం అందించి, సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అనంతరం రాళ్ళాపురం గ్రామంలోని పాఠశాలను సందర్శించిన వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు.

డా. హారిక ఆదేశాల మేరకు ఉప్పరిగూడెం, పాత చర్ల, రామానుజపురం, లింగాపురంపాడు గ్రామాల్లో కూడా హెల్త్ క్యాంపులు, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు ధర్మారావు, స్వరూప, ఆశా కార్యకర్తలు భద్రమ్మ, రంగమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థుల సంరక్షణను తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలి

**జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి, 22.9.2026**



దివ్యాంగ విద్యార్థుల సంరక్షణను తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, అలింకో (ALIMCO) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యాశాఖ నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఇంచార్జ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు విద్యే అత్యంత ముఖ్యమైన సాధనమని, చదువు వారిని జీవితంలో స్థిరపడేలా చేసి సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుందని అన్నారు.యు.డి.ఐ.డి. లేదా సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి అర్హుడికి దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల విద్యను వయస్సుతో ముడిపెట్టవద్దని తల్లిదండ్రులకు సూచించారు. సాధారణ పాఠశాలలో చదువుకునే వయస్సు దాటిన వారు తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేయవచ్చని తెలిపారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు రెగ్యులర్ పాఠశాల సర్టిఫికెట్‌తో సమానమైన విలువ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి మాట్లాడుతూ, అలింకో సంస్థ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను పరీక్షించి, వారి అవసరాలకు అనుగుణంగా ఉచితంగా ఉపకరణాలను అందజేస్తుందని తెలిపారు. సంస్థ అందించే ఉపకరణాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సక్రమంగా వినియోగిస్తూ విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ గుర్తింపు శిబిరంలో జిల్లాలోని 12 మండలాల నుంచి హాజరైన 122 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల ఉపకరణాలను అందించేందుకు అలింకో ప్రతినిధులు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ కర్త పెసరు లింగారెడ్డి, భువనగిరి మండల విద్యాధికారి రంగరాజన్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అండాలు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు శివరాజు, షాజహాన్, నరేష్, జ్యోతి, ఐఈఆర్పీలు సంధ్యారాణి, బాలరాజు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సత్యం, సుజాత, షబానా, రాణి, సరళ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు



**యాదాద్రి భువనగిరి, 22.09.2026**

మంగళవారం భువనగిరి పట్టణంలోని భువనగిరి పెద్ద చెరువును ఇంచార్జీ కలెక్టర్ సందర్శించి, వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర సౌకర్యాలను పర్యవేక్షించాలని తెలిపారు. భక్తులు జాగ్రత్తగా ఉంటూ క్రేన్ల ద్వారా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలన్నారు. గజ ఈతగాళ్లు చెరువు వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు కలగకుండా భార్గెటింగ్ చేయాలన్నారు. అలాగే నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కమిషనర్ ప్రకాష్ రెడ్డి,డి.ఈ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**ట్రైని తాసిల్దార్ మద్దినేని మురళి**

**దమ్మపేట సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి ):**




దమ్మపేట మండలంలో రెవెన్యూ కార్యాలయంలో దళారీ వ్యవస్థకు స్వస్తి పలికినప్పటికీ, తిరిగి దళారులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనే వదంతులు మా దృష్టికి వచ్చాయి. అని తాసిల్దార్ మద్దినేని మురళి తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు, భూ హక్కుదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నాము. ముఖ్యంగా కొందరు దళారులు ప్రస్తుత తహసీల్దార్ పదవి కొంతకాలమే ఉంటుందని, తిరిగి తమకు అనుకూలమైన వారే తహసీల్దార్‌గా వస్తారని రైతులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి ప్రచారాలను రైతులు, భూ హక్కుదారులు నమ్మవద్దు. భూ బదిలీలు, పట్టా పుస్తకాలు, పాస్‌బుక్కులు తదితర భూ వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలైనా పూర్తిగా చట్టబద్ధంగా, రెవెన్యూ చట్టాలు, నిబంధనలకు లోబడి మాత్రమే నిర్వహించుకోవాలి. ఇటీవల ఎవరైనా దళారులు మీ భూ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని "పట్టా పుస్తకాలు ఇప్పిస్తాం.. పాస్‌బుక్కులు ఇప్పిస్తాం.. మీ భూ సమస్య పరిష్కరిస్తాం" అంటూ మిమ్మల్ని ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తే, వారి మాటలు నమ్మకుండా ముందుగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయండి .దళారీ వ్యవస్థ పట్ల తస్మాత్ జాగ్రత్త..భూ వ్యవహారాల్లో చట్టబద్ధమైన విధానాలనే అనుసరించండని డిప్యూటీ కలెక్టర్ ట్రైనింగ్ తాసిల్దార్ మద్దినేని మురళి తెలియజేశారు

## వెంకటాపురంలో పేకాట స్థావరం పై మెరుపు దాడి

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ( వుదయం ప్రతినిధి)**



వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామం ఊరు చివర ఒక ఇంట్లి 1.రేగళ్ల కరుణాకర్ రెడ్డి 2. నరగాని సర్వేశ్వరరావు 3. గాదె రమేష్ 4. ధీరిశాల వెంకటేశ్వరరావు 5. రేగళ్ల వెంకట రెడ్డి 6. మిద్దె సత్యనారాయణ 7. కేశవ రెడ్డి డబ్బులు పందెంగా పెట్టి లోన, బయట పేకాట ఆడుచున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ ఐ పల్లెల ప్రదీప్ వేంసూరు, సిబ్బంది వెళ్ళి రైడ్ చేయగా పేకాట ఆడుచు పట్టుబడినారు. పట్టుబడిన వారి వద్ద నుండి 52 పేక ముక్కలను,7,600 రూపాయల నగదును,4 మోటారు సైకిలను,7 సెల్ ఫోన్ లను స్వాదీన పర్చుకొని 7 మంది మీద కేసు నమోదు చేయనైనది. పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# చక్కని ఆరోగ్యం

## పిల్లలకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలను ఎక్కువగా తాగిస్తే ప్రమాదం..



చిన్నప్పటి నుంచి పిల్లలు తాగే పానీయాలు వారి భవిష్యత్తు ఆరోగ్యంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని తాజా పరిశోధన వెల్లడించింది. ముఖ్యంగా చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, స్పోర్ట్స్ డ్రింక్స్, ప్యాకెట్ ఫ్రూట్ జ్యూస్‌లను తరచూ తాగే పిల్లల్లో పెద్దయ్యాక అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన పానీయాల అలవాట్లు పెంపొందించడం గుండె ఆరోగ్యానికి ఎంతో కీలకమని వారు సూచిస్తున్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ సర్క్యులేషన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో 25 వేల మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య సమాచారాన్ని సుమారు 25 సంవత్సరాల పాటు పరిశీలించారు. చిన్ననాటి నుంచి యుక్తవయస్సు వరకు వారు తీసుకున్న చక్కెర పానీయాలు, ఫ్రూట్ జ్యూస్, తాజా పండ్ల వినియోగాన్ని విశ్లేషించి, పెద్దయ్యాక వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు చక్కెర కలిగిన పానీయాలు తాగిన పిల్లకు, వారానికి మూడు సార్ల కంటే తక్కువగా తాగిన వారితో పోలిస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 52 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. రోజుకు ఒక్కసారి శీతల పానీయం తాగిన వారిలో కూడా ఈ ప్రమాదం 23 శాతం పెరిగింది. అలాగే స్పోర్ట్స్ డ్రింక్స్‌ను తరచూ తీసుకున్న వారిలో ఈ ప్రమాదం 36 శాతం అధికంగా నమోదైంది. చాలా మంది తల్లిదండ్రులు ఫ్రూట్ జ్యూస్‌లను శీతల పానీయాలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు. అయితే రోజుకు ఒకటిన్నర సర్వింగ్ లేదా అంతకంటే ఎక్కువ ఫ్రూట్ జ్యూస్ తాగిన పిల్లల్లో కూడా భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 35 శాతం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వంద శాతం పండ్ల రసంలో విటమిన్లు, ఖనిజాలు ఉన్నప్పటికీ, అందులో పీచు పదార్థం ఉండదు. పీచు లేకపోవడంతో చక్కెర వేగంగా రక్తంలో కలసి రక్తనాళాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వారు వివరించారు. చక్కెర పానీయాల్లో ముఖ్యంగా ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల బరువు పెరగడం, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, శరీరంలో వాపు వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ గుండె, రక్తనాళాలపై అదనపు ఒత్తిడిని పెంచి అధిక రక్తపోటుకు దారితీసే అవకాశాన్ని పెంచుతాయి. అయితే మొత్తం ఫ్రక్టోజ్ పరిమాణం కంటే అది ఏ ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తుందనేదే ముఖ్యమని అధ్యయనం సూచించింది. పండ్లలో ఉండే ఫ్రక్టోజ్ మాత్రం అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు గుర్తించారు. దీనికి కారణం పండ్లలో ఉండే పీచు, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు రక్షణాత్మక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పిల్లలు ప్రతిరోజూ తాగే ఒక చక్కెర పానీయాన్ని తాజా పండ్లతో భర్తీ చేస్తే భవిష్యత్తులో రక్తపోటు వచ్చే ప్రమాదం 22 శాతం వరకు తగ్గే అవకాశం ఉంటుందని అధ్యయనం తెలిపింది. అలాగే చక్కెర పానీయాల స్థానంలో నీరు లేదా పాలు తీసుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పరిశోధకులు పేర్కొన్నారు. రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఇది ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే అభివృద్ధి చెందుతుంది. నియంత్రించకపోతే గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

## పని చేస్తూ... వ్యాయామం చేద్దామా!




ఆఫీసులో ఒత్తిడి ఎక్కువైతే ఏం చేస్తాం? వెంటనే ఒక కప్పు టీ తాగడమో లేదా కాఫీ బ్రేక్ తీసుకోవడమో చేస్తాం. కానీ ఇప్పుడు మెట్రో నగరాల్లో పనిచేస్తున్న జెన్‌జీ ఉద్యోగులు కొత్త బాట పట్టారు. టీ, కాఫీ బ్రేక్‌లకు బదులు 'ఎక్సర్‌సైజ్ స్నాకింగ్' వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇంతకీ ఏంటిది అనుకుంటున్నారా! ఆకలేసినప్పుడు పని మధ్యలో కొద్దికొద్దిగా చిరుతిండి తింటుంటాం కదా! అలాగే రోజంతా ఒకేచోట కూర్చోకుండా... మధ్యమధ్యలో చిన్నగా వ్యాయామం చేయడాన్నే ఎక్సర్‌సైజ్ స్నాకింగ్ అంటారు. దీనికోసం జిమ్‌కు వెళ్లి గంటల కొద్దీ కష్టపడి చెమట చిందించాల్సిన అవసరం లేదు. ఆఫీస్ పని వేళల్లో ఓ ఐదు నిమిషాలు చిన్నచిన్న ఎక్సర్‌సైజ్‌లు చేస్తే చాలు. ఆఫీస్‌లో ఉండి ఎలా చేస్తాం? అనేగా సందేహం. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కడం. సీట్‌లో కూర్చుని చేతులు, కాళ్లు, మెడను కాసేపు స్ట్రెచ్ చేయడం. ఫోన్ మాట్లాడేటప్పుడు ఒకేచోట నిలబడి కాకుండా అటూ ఇటూ నడవడం. కుదిరితే సీటు పక్కనే నిలబడి ఐదారుసార్లు కూర్చుని లేవడం చేయొచ్చు. దీనివల్ల రక్తప్రసరణ బాగా జరిగి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అదే పనిగా పనిచేయడం వల్ల వచ్చే శారీరక, మానసిక అలసట తగ్గి మెదడు చురుగ్గా ఉంటుంది. ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల వచ్చే వెన్ను, మెడ నొప్పుల నుంచి ఉపశమనం దొరుకుతుంది. మీకూ అవసరం అనుకుంటే ప్రయత్నించి చూడండి.

## పురుషుల్లో అధిక ఒత్తిడి కారణంగా ఏర్పడే అనారోగ్య సమస్యలు ఇవే..



పురుషుల్లో సంతానలేమి సమస్య గురించి ఇప్పటికీ చాలా తక్కువగా చర్చ జరుగుతోంది. అయితే జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్క కారణం వల్లే ఈ సమస్య రాదని, శరీర పరిస్థితులు, పర్యావరణం, రోజువారీ అలవాట్లు కలిసి దీనిపై ప్రభావం చూపుతాయని అంటున్నారు. సంతానోత్పత్తి గురించి మాట్లాడేటప్పుడు సాధారణంగా ఆహారం, వయస్సు లేదా ఇతర ఆరోగ్య సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడతారు. కానీ దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, సరిపడా నిద్ర లేకపోవడం, గంటల తరబడి ఒకేచోట కూర్చునే అలవాటు కూడా వీర్యకణాల నాణ్యత, హార్మోన్ల సమతుల్యత, సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. నేటి ఉద్యోగ జీవనశైలిలో ఒత్తిడి దాదాపు రోజువారీ జీవితంలో భాగంగా మారిపోయింది. అప్పుడప్పుడు వచ్చే ఒత్తిడి పెద్దగా సమస్య కాకపోయినా, ఎక్కువ కాలం కొనసాగే మానసిక ఒత్తిడి వీర్యకణాల సంఖ్య తగ్గడం, వాటి కదలిక మందగించడం, ఆకృతిలో మార్పులు రావడం వంటి సమస్యలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ పెరగడం వల్ల వీర్యకణాల ఉత్పత్తి, టెస్టోస్టెరాన్ స్థాయిలను నియంత్రించే హార్మోన్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఒత్తిడి పెరిగే కొద్దీ నిద్ర, ఆహారపు అలవాట్లు కూడా దెబ్బతిని సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. నిద్ర కేవలం శరీరానికి విశ్రాంతి ఇచ్చే సమయం మాత్రమే కాదు. ఈ సమయంలోనే శరీరంలో అనేక హార్మోన్ల నియంత్రణ ప్రక్రియలు జరుగుతాయి. నిరంతరం నిద్రలేమితో బాధపడేవారిలో వీర్యకణాల నాణ్యత తగ్గడం, వాటి చురుకుదనం తగ్గిపోవడం, సంతానోత్పత్తి సామర్థ్యం బలహీనపడటం వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రాత్రి 7 నుంచి 8 గంటల నాణ్యమైన నిద్ర అవసరమని, అయితే అవసరానికి మించి ఎక్కువసేపు నిద్రపోవడం కూడా కొన్ని పరిశోధనల్లో ప్రతికూల ప్రభావాలతో సంబంధం ఉన్నట్లు గుర్తించారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగరీత్యా గంటల తరబడి కంప్యూటర్ ముందు లేదా వాహనం నడుపుతూ కూర్చోవాల్సి వస్తోంది. అయితే ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల శరీరంలో వాపు సంబంధిత మార్పులు, జీవక్రియలో లోపాలు ఏర్పడి అవి పరోక్షంగా వీర్యకణాల నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. దీనికి భిన్నంగా ప్రతిరోజూ మితమైన శారీరక వ్యాయామం చేసే వారిలో వీర్యకణాల నాణ్యత, సంతానోత్పత్తి ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పురుషుల్లో సంతానలేమి సమస్యకు ఒక్కటే కారణం ఉండదు. జీవశాస్త్ర సంబంధిత అంశాలు, పర్యావరణ పరిస్థితులు, రోజువారీ జీవనశైలి అన్నీ కలిసి దీనిపై ప్రభావం చూపుతాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, సరిపడా నిద్రపోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, ప్రతిరోజూ శారీరకంగా చురుకుగా ఉండడం వంటి అలవాట్లు శరీరం తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి సహాయపడతాయి.

## మైగ్రేన్ తగ్గాలంటే..



రకరకాల కారణాల వల్ల పీడించే మైగ్రేన్ తలనొప్పి తలెత్తితే నిమిషం ఒక యుగంగా భారంగా గడిచిపోతుంది. భరించలేని నొప్పికి సత్వర ఉపశమనం కావాలని కోరుకుంటారు. ఈ చిట్కాలు పాటిస్తే కాస్తయినా ఉపశమనం పొందవచ్చు. పుదీనా: పుదీనా ఆకుల్లో ఉండే మెంథాల్, మెంథోన్ మైగ్రేన్ తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది. కొన్ని పుదీనా ఆకులను రుబ్బి, దాని నుంచి రసం తీసి నుదురుపై పూయాలి. అలాగే ఒక కప్పు వేడి వేడి బ్లాక్ టీ లో కొన్ని పుదీనా ఆకులు వేసి 10నిమిషాలు నానిన తర్వాత తీసుకుంటే మైగ్రేన్ నుంచి విముక్తి లభిస్తుంది. అల్లం: అల్లంలో ఉండే జింజెరోల్స్ అని పిలిచే రసాయనం మైగ్రేన్‌ను తగ్గించేందుకు బాగా ఉపయోగపడుతుంది.

అల్లం, నిమ్మ రసాలను సమాన మోతాదుల్లో కలుపుకొని, రోజుకు 2 నుంచి 3 సార్లు తాగాలి. తాజా నీటిలో అల్లం ముక్కలు లేదా అల్లం ముక్కల పొడి వేసి ఆవిరి పీలిస్తే తక్షణ ఉపశమనం లభిస్తుంది.

నిద్ర: నిద్ర లేమి వల్ల మైగ్రేన్ వస్తూ ఉంటుంది. అందువల్ల నిద్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి రోజూ 8 గంటల సమయం నిద్రకు కేటాయించాలి. ఇలా చేయడం వల్ల మైగ్రేన్‌ను కొంత మేరకు ఎదుర్కోవచ్చు.

## నిద్రకోసం లవంగం

లవంగాన్ని నోటిలో ఉంచుకుని నిద్రపోవడం వల్ల.. అది శ్వాసనాళంలోకి వెళ్లే ప్రమాదం ఉన్నది. దాంతో ఊపిరి ఆడకపోవడం, ఉక్కిరిబిక్కిరి అవుతారు. ఇక చాలా ఘాటుగా ఉండే లవంగాన్ని నోటిలోనే ఎక్కువసేపు ఉంచుకోవడం మంచిదికాదు. అలాచేస్తే.. బుగ్గ లోపలి భాగం, నాలుక కాలినట్లు అవ్వడం, నోటి పూత వచ్చే అవకాశం ఉంటుంది. లవంగం తక్కువ మోతాదులో తీసుకుంటేనే సురక్షితం. అధికంగా వాడటం వల్ల నోటిలో మంట, కడుపులో అసౌకర్యం, అలెర్జీలు కలగవచ్చు. అయితే, లవంగాలలో ఉండే కొన్ని గుణాలు పరోక్షంగా మంచి నిద్రకు సహాయపడవచ్చని చెబుతున్నారు. లవంగాలలో యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి, లవంగం నమలడం, దాని సువాసనను పీల్చడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి తగ్గి మంచినిద్ర రావడానికి సహాయపడవచ్చు. లవంగంలో 'యూజినాల్' అనే సహజ సిద్ధమైన యాంటి సెప్టిక్ లక్షణం ఉంటుంది. ఇది రాత్రి వేళల్లో నోటిలోని బ్యాక్టీరియాను నివారించి, పంటి నొప్పి, చిగుళ్ల వాపు వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. నొప్పి లేకపోవడం వల్ల ప్రశాంతంగా నిద్ర పట్టే అవకాశం ఉంది. కొందరికి రాత్రిపూట గ్యాస్, అజీర్తి వల్ల నిద్ర సరిగ్గా పట్టదు. లవంగం లాలాజలాన్ని పెంచి జీర్ణక్రియకు సహాయపడుతుంది. తద్వారా కడుపు అసౌకర్యం తగ్గి నిద్ర బాగుంటుంది. కాబట్టి, లవంగం ప్రయోజనాలను పొందాలనుకుంటే.. పడుకోవడానికి ఒక అరగంట ముందు ఒక లవంగాన్ని నమిలి, ఆ రసాన్ని మింగేయాలి. ఆ తర్వాత నోటిని శుభ్రంగా కడుక్కుని పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



## గంటల తరబడి కూర్చుని పనిచేసేవారికి..

నేటి జీవనశైలిలో ఎక్కువసేపు కుర్చీలో కూర్చునే అలవాటు దాదాపు ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. అయితే ఎలా కూర్చుంటున్నామనే విషయాన్ని చాలామంది పట్టించుకోరు. కానీ తప్పు భంగిమలో గంటల తరబడి కూర్చోవడం వల్ల మోకాళ్లు, నడుం, తుంటి కీళ్లు, వెన్నెముకపై అదనపు ఒత్తిడి పడుతుంది. ఇది కాలక్రమేణా కీళ్ల అరుగుదల, నొప్పులు, కదలికల్లో ఇబ్బందులకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన భంగిమతో కూర్చోవడం, అవసరమైన సహాయక పరికరాలను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యలను చాలావరకు నివారించవచ్చని సూచిస్తున్నారు. చాలామంది కాళ్లు మడిచి కూర్చోవడం లేదా నేలపై ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని భావిస్తారు. అయితే ఇది అపోహ మాత్రమే. ఇలాంటి భంగిమలు మోకాళ్లు, తుంటి కీళ్లపై అధిక ఒత్తిడి కలిగించి, కాలక్రమేణా కీళ్ల అరుగుదలకు కారణమవుతాయి. ముఖ్యంగా గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల కీళ్ల కదలిక తగ్గి, నొప్పులు పెరిగే అవకాశం ఉంటుంది. కూర్చునే సమయంలో ఉపయోగించే కుర్చీ కూడా ఎంతో కీలకమని నిపుణులు చెబుతున్నారు. నడుముకు సరైన మద్దతు ఇచ్చే ఎర్గోనామిక్ కుర్చీలు వెన్నెముక సహజ వంపును కాపాడటంలో సహాయపడతాయి. ఎత్తు సర్దుబాటు, చేతులకు మద్దతు, మెత్తని సీటు వంటి సౌకర్యాలు ఉన్న కుర్చీలు శరీరాన్ని సరైన స్థితిలో ఉంచి కీళ్లపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ఎక్కువ సేపు కూర్చోవాల్సిన పరిస్థితుల్లో మెమరీ ఫోమ్ లేదా జెల్ సీట్ కుషన్లు ఉపయోగించడం మంచిది. ఇవి శరీర బరువును సమానంగా పంచి మోకాళ్లు, నడుం, తుంటి భాగాలపై పడే ఒత్తిడిని తగ్గించడంతోపాటు కూర్చోవడాన్ని మరింత సౌకర్యవంతంగా మారుస్తాయి. ఇప్పటికే ఉపయోగిస్తున్న కుర్చీలో లంబార్ సపోర్ట్ పిల్లోలను అమర్చినా మంచి ప్రయోజనం ఉంటుంది. ఇవి వెన్నెముక సహజ వంపుకు మద్దతు ఇచ్చి నడుం, తుంటి భాగాలపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల ఎక్కువసేపు కూర్చున్నా వెన్నునొప్పి వచ్చే అవకాశాలు తగ్గుతాయి. పాదాలు నేలపై సరిగ్గా ఆనించకుండా ఉంటే ఫుట్‌రెస్ట్ ఉపయోగించడం మంచిది. దీని వల్ల పాదాలు స్థిరంగా ఉండి మోకాళ్లు, తుంటి సరైన కోణంలో ఉంటాయి. దీంతో కీళ్లపై అనవసర ఒత్తిడి తగ్గి రక్తప్రసరణ కూడా మెరుగుపడుతుంది. రోజంతా కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి సిట్-స్టాండ్ డెస్క్‌లు ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి అవసరానికి అనుగుణంగా కూర్చోవడం, నిలబడడం మధ్య మారేందుకు అవకాశం కల్పిస్తాయి. తరచూ భంగిమ మార్చడం వల్ల కీళ్లపై ఒత్తిడి తగ్గడంతోపాటు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. మోకాళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కుర్చీ ఎత్తు కూడా సరైనదిగా ఉండాలి. కుర్చీలో కూర్చున్నప్పుడు మోకాళ్లు సుమారు 90 డిగ్రీల కోణంలో ఉండేలా చూసుకోవాలి. అలాగే రెండు పాదాలు పూర్తిగా నేలపై ఆనివుండాలి. ఈ భంగిమ మోకాళ్లపై ఒత్తిడిని తగ్గించి దీర్ఘకాలం వాటి ఆరోగ్యాన్ని కాపాడటానికి దోహదపడుతుంది. భంగిమను సరిచేసేందుకు ప్రస్తుతం మార్కెట్లో లభించే పోస్టర్ కరెక్టర్లు కూడా ఉపయోగపడతాయి. ఇవి కూర్చునేటప్పుడు లేదా నిలబడినప్పుడు శరీరాన్ని సరైన స్థితిలో ఉంచి కీళ్లపై అనవసర ఒత్తిడిని తగ్గిస్తాయి. బ్యాలెన్స్ బాల్ కుర్చీలు కూడా మరో మంచి ప్రత్యామ్నాయం. వీటిపై కూర్చోవడం వల్ల శరీరం సమతుల్యతను కాపాడేందుకు కోర్ కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. దీంతో శరీర భంగిమ మెరుగుపడటంతోపాటు కీళ్లపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఇప్పటికే మోకాళ్ల సమస్యలు ఉన్నవారు తేలికపాటి నీ బ్రేస్‌లు లేదా మోకాళ్లకు మద్దతు ఇచ్చే సపోర్ట్‌లను ఉపయోగించవచ్చు. ఇవి కదలికలకు ఆటంకం కలిగించకుండా మోకాళ్లకు స్థిరత్వాన్ని అందిస్తాయి.



## నెలసరిలోనూ ఉల్లాసంగా..!

నెలసరి సమయంలో పలు ఆరోగ్య సమస్యలు ఎదురవడం సహజం. కడుపునొప్పి, నడుంనొప్పి, చిరాకు, ఒత్తిడి, ఆందోళన.. వంటివి అందులో కొన్ని. అయితే ఈ సమస్యల నుంచి ఉపశమనం పొంది సౌకర్యంగా, ఉల్లాసంగా ఉండాలంటే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. నెలసరి సమయంలో కొంతమంది పొత్తి కడుపు నొప్పితో బాధపడుతుంటారు. ఈ నొప్పిని భరించలేక కొంతమంది పెయిన్ కిల్లర్స్ వేసుకుంటారు. కానీ వీటిని తరచూ వాడడం మంచిది కాదంటున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి మాత్రలకు బదులు హీట్ ప్యాక్ లేదా వేడి నీళ్ల బాటిల్‌తో కాపడం పెడితే.. నొప్పిని దూరం చేసుకోవచ్చు. ఆ తర్వాత కాస్త గోరువెచ్చటి నీటితో స్నానం చేసినా మనసుకు ప్రశాంతంగా అనిపించి హాయిగా నిద్రపడుతుందంటున్నారు. నెలసరి సమయంలో వచ్చే కడుపు నొప్పి, నడుం నొప్పి, కాళ్లు లాగడం, ఇతర ఒంటి నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి అత్యవసర నూనెలు ఎంతగానో తోడ్పడతాయట. ఇందుకోసం నొప్పి వచ్చే చోట పెప్పర్‌మెంట్, రోజ్‌మేరీ, లావెండర్.. ఇలా ఏదో ఒక ఎసెన్షియల్ ఆయిల్‌తో కాస్త మర్దనా చేస్తే ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు నిపుణులు. నెలసరి సమయంలో మనం తీసుకునే ఆహారంలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలి. ఇందుకోసం క్యాల్షియం విరివిగా లభించే పాలు, పాల పదార్థాలు, పాలకూర.. వంటివి మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి నొప్పిని తగ్గించడంతో పాటు మూడ్ స్వింగ్స్, ఆహారం ఎక్కువగా తినాలన్న కోరికను అదుపు చేయడంలో తోడ్పడతాయట. అలాగే సాయంత్రం స్నాక్స్ సమయంలో నూనె పదార్థాలు కాకుండా.. విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా లభించే నట్స్, పండ్లు, కాయగూరలు తీసుకోవడం వల్ల జీవక్రియల పనితీరు మెరుగుపడుతుందంటున్నారు. అలాగే మెగ్నీషియం ఎక్కువగా ఉండే డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలై మనసును ఉత్తేజపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలి. గోరువెచ్చటి నీళ్లు తాగితే మరింత ఉపశమనం కలుగుతుందట. దీనివల్ల శరీరంలో నొప్పి ఉన్న కండరాలకు రక్తప్రసరణ సరిగ్గా జరిగి నొప్పి నుంచి ఉపశమనం పొందే వీలుంటుందంటున్నారు నిపుణులు. ఇక నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కీరా దోస.. వంటి పండ్లు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

నెలసరి సమయంలో ఏ పని చేయాలన్నా శరీరం సహకరించదు. అలసట, చిరాగ్గా అనిపిస్తుంటుంది. ఈ క్రమంలో చిన్న చిన్న వ్యాయామాలు, యోగా, ధ్యానం.. వంటివి చేయడం చాలా మంచిదంటున్నారు నిపుణులు. వీటివల్ల శరీరానికి శక్తి అందడంతో పాటు పీరియడ్స్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, మూడ్ స్వింగ్స్.. తదితర సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చట. అయితే మీరు ఎంచుకునే వ్యాయామాలు పొత్తి కడుపు, నడుముపై ఒత్తిడి పడకుండా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



## ఘనంగా గణనాథుని నిమజ్జన శోభాయాత్ర



**నిజాంపేట మండలం,సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):** నిజాంపేటమండలకేంద్రంలోకొండిస్య బాలల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి తొమ్మిది రోజులపాటు ఘనపదివ వైభవంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం గణనాథుని నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, చిన్నారులు, యువతీ యువకులు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఆటపాటలతో సందడి చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు.అనంతరం 'గణపతి బప్పా మోరియా...గణేష్ మహా రాజ్‌కీ జై' అంటూ నినాదాలు చేస్తూ గణనాథుని విగ్రహాన్ని స్థానిక మల్లా చెరువు వద్దకు తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కొండిస్య బాలల సంఘం సభ్యులు నవదీప్ గౌడ్, నిహాల్ గౌడ్, వినేత్, గణేష్, జీడి రాములు గౌడ్, జీడి వర్ధ చంద్రకాంత్ గౌడ్, పున్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

**కుంకుమార్చనకు పోటెత్తిన భక్తులు**



**దుబ్బాక, సెప్టెంబర్ 22, వుదయం:** భక్తిశ్రద్ధల నడుమ దుబ్బాకలో కత్తి కార్తీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు 9వ రోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి పారవశ్యాన్ని చాటారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మహిళలతో పాటు కత్తి కార్తీక్ కుంకుమార్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సీతారాంపల్లి గ్రామానికి చెందిన భజన సంఘం సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వాహకులు కొనసాగించారు. నవరాత్రి ఉత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

## రైతులు అధైర్యపడొద్దు.. నీటి విడుదలకు చర్యలు



**మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్**

**అయిజ సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

రైతులు అధైర్యపడవద్దని, సాగునీటి కోసం ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులు, డ్యాముల్లోకి నీటి చేరిక ఆశించిన స్థాయిలో లేదన్నారు.కృష్ణా, తుంగభద్ర నదుల పరివాహక ప్రాంతాల్లో నీటి లభ్యతపై ఆందోళనతో కొందరు రైతులు పంట విరామం ప్రకటించారని, అయినప్పటికీ ఆశతో మరికొందరు రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అదనంగా అందుబాటులో ఉన్న నీటిని ఒకటి, రెండు తడుల కోసం రైతులకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

తుంగభద్ర నుంచి 3 టీఎంసీల విడుదలకు చర్యలు ఈ ఏడాది నీటి కేటాయింపులకు అనుగుణంగా తుంగభద్ర జలాల్లో నుంచి 3 టీఎంసీల నీటిని విడతల వారీగా విడుదల చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంపత్‌కుమార్ తెలిపారు. అలాగే జూరాల ఆయకట్టుకు అదనంగా మరో 5 టీఎంసీల నీటిని విడుదల చేయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన వెల్లడించారు. రైతుల పంటలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సంపత్‌కుమార్ తెలిపారు.

## ప్రజల భాగస్వామ్యంతో రాంపూర్ గ్రామాభివృద్ధికి ప్రణాళిక



**నిజాంపేట మండలం,సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి):** నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ తయారీ ప్రక్రియను జిల్లా ప్రత్యేక అధికారి, పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ విజయరావు, డీఆర్డీఏ అధికారి శ్రీనివాసరావు మంగళవారం పర్యవేక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన పీఆర్ఏ ప్రక్రియ ద్వారా గ్రామ అవసరాలను గుర్తించారు. నాలుగు ప్రధాన కేటగిరీలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు రాబోయే సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గ్రామంలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, జీవనోపాధి, ఇతర అభివృద్ధి అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో శ్రీకాంత్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్, వార్డు సభ్యులు శిరీష, రూపేశ్, మహాదాన్, నరేష్, సయ్యద్, రాములు, పంచాయతీ కార్యదర్శి చంద్రహాస్, టీఏలు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో గణనాథుడి సందడి

**వినాయక మండపాలను సందర్శించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**సమృద్ధిగా వర్షా లు కురవాలి.. పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలం కావాలి**

**ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత పెరగాలని ప్రార్థన**

**వికారాబాద్ 23 (వుదయం బ్యూరో)**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వికారాబాద్ పట్టణంతో పాటు వికారాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉత్సవ నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయా మండపాలకు వెళ్లి గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**

వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు.

**సమృద్ధిగా వర్షా లు.. రైతులకు మేలు**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని గణనాథుడిని ప్రార్థించినట్లు స్పీకర్ తెలిపారు. పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలం కావాలని, రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ప్రజా పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నట్లు చెప్పారు.

**ఐక్యతకు ప్రతీక వినాయక చవితి**

వినాయక చవితి ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే పండుగ అని ప్రసాద్ కుమార్ అన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులంతా కలిసి గణనాథుడిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు.

**సేవా కార్యక్రమాలు అభినందనీయం**

వినాయక మండపాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులను స్పీకర్ అభినందించారు. మండపాల వద్ద అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతలో సామాజిక సేవా స్ఫూర్తి, ఐక్యత పెంపొందేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



**నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి**

వినాయక ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అంతే అప్రమత్తంగా నిర్వహించాలని స్పీకర్ సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు, నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని, శాంతియుత వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మండపాల వద్ద ఆప్యాయ పలకరింపు**

వినాయక మండపాల సందర్శన సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మండపాల వద్ద భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు**

వికారాబాద్ ప్రజలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజల మధ్య ఐక్యత మరింత పెంపొందాలని ప్రార్థించినట్లు తెలిపారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెంట వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీకాంత్ రెడ్డి, హిరేకర్ రాకేష్, వినోద్ కుమార్, మురళి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యం సేటు, వికారాబాద్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



**మహిళా సమైక్య 9వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం.**

**నిజాంపేట మండలం,సెప్టెంబర్ 22 (వుదయం ప్రతినిధి)**

నిజాంపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) గ్రామ మహిళా సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం 9వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం అశోక్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మహిళల అభ్యున్నతి, ఆర్థిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం పోషక ఆహారాలపై ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి మహిళలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీసీలు వెంకట్రాజ్యం రవీందర్,అమృత తదితరులు పాల్గొన్నారు.

## జూరాల నీరు విడుదల చేయాలి



**వర్షా భావంతో పంటలు ఎండిపోతున్నాయి.. కలెక్టర్‌కు సరితా తిరుపతయ్య వినతి**

**గద్వాల సెప్టెంబర్ 22 (వుదయం కరస్పాండెంట్)**

వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలని గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ చైర్మన్ సరితా తిరుపతయ్య కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో గద్వాల ప్రాంతంలో సాగునీటి సమస్య తీవ్రంగా మారిందని ఆమె తెలిపారు. భూగర్భ జలాలు సైతం అడుగంటుతున్నాయని, ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నందున సకాలంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటి అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. నీటి విడుదల, పంపిణీలో రైతుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.జూరాల నీరు అందితే వేలాది ఎకరాల్లో పంటలను కాపాడటంతో పాటు రైతు కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించవచ్చని సరితా తిరుపతయ్య పేర్కొన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా నాయకులు, సర్పంచ్‌లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన పైర్లపై రాజకీయ 'శవ రాజకీయాలు'!

**కళ్లముందే ఎండిపోతున్న చేన్లు.. నిలువునా మునుగుతున్న అన్నదాత**

**చుక్క నీటికి దిక్కులేదు.. పాలకులకు పట్టింపు లేదు!**

**"పంట ఎండిపోయాక పరామర్శలా?.. శవం అయ్యాక శోకాలు పెడితే ఏం లాభం?" – మాజీ సర్పంచ్ శేషన్ గౌడ్ ఆక్రోశం**

**దొంగలు పడ్డాక కుక్కలు మొరిగినట్లు.. నేతల నాటకాలపై రైతాంగం తీవ్ర ఆగ్రహం**

**అలంపూర్ సీమలో ఉరిమి చూస్తున్న 'జల గ్రహణం'.. కాలువల వద్దే రణభేరి మొగించేందుకు సిద్ధమైన రైతులు**

**అలంపూర్ సెప్టెంబర్ 22 (వుదయం కరస్పాండెంట్)**

పచ్చని పొలాలు కంటిముందే అగ్గిపాలవుతుంటే.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాత గుండె పగిలి ఆక్రోశిస్తోంది! జూరాల, ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) కాలువల కింద చివరి ఆయకట్టు భూములకు సాగునీరందక ఎండిపోతుంటే.. యంత్రాంగం కంటికి నిద్రనటిస్తోంది. ఆరుగాలం చెమటోడ్చి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు రైతులు రెండు నెలలుగా ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకోని పాలకులు.. ఇప్పుడు పంటంతా కాలి బూడిదయ్యాక శవాలపై పేలాలు ఏరుకునే రీతిలో కాలువల గట్లపై 'రాజకీయ నాటకాలకు' తెరతీశారని రైతాంగం మండిపడుతోంది.

**నిలువునా ముంచేశారు.. బతుకులను ఎండగట్టారు!**

ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్ మండలాల పరిధిలో వేలాది ఎకరాల్లో వేసిన వరి, మొక్కజొన్న, పత్తి, మిరప, కంది, ఉల్లి పంటలు నీళ్లు లేక నిలువునా మాడిపోతున్నాయి. చివరి తడి అందితేనే పంట చేతికి వచ్చి అప్పులు తీరుతాయను కున్న దశలో, చుక్క నీరు వదలకుండా అధికారులు రైతుల పొట్ట కొట్టారు. "కలెక్టరేట్ మెట్లు ఎక్కాం.. నీటిపారుదల శాఖ అధికారుల కాళ్లు పట్టుకోని లోటు మాత్రమే ఉంచాం. వినతిపత్రాలు ఇచ్చి వేడుకున్నా ఏ ఒక్క అధికారి గుండె కరగలేదు" అని రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. దొంగలు పడ్డాక కుక్కలు మొరిగినట్లుంది!' పంట ఊపిరిపోసుకునే సమయంలో ముఖం చాటేసిన నాయకులు.. ఇప్పుడు చేతికొచ్చిన పంటంతా నాశనమయ్యాక



ధర్నాలు, పరామర్శల పేరుతో కాలువల వద్దకు వస్తుండటంపై రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. "దొంగలు పడ్డాక ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుంది వీళ్ల వ్యవహారం" అని రైతులు నిలదీస్తున్నారు. మైకుల ముందు ఉపన్యాసాలు దంచితే పొలానికి తేమరాదని, కెమెరాల ముందుకు వచ్చి ఫోటోలకు ఫోజులిస్తే ఆకలి తీరదని తెగేసి చెబుతున్నారు. తమ శ్రమను, ఆవేదనను రాజకీయ ప్రదర్శనగా మార్చ వద్దని పాలకులకు, ప్రతిపక్షాలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రైతు బతికున్నప్పుడే కాపాడాలి.. చచ్చాక శోకాలు పెడితే ఏం లాభం?" – శేషన్ గౌడ్ నేతల హడావుడిపై మాజీ సర్పంచ్ శేషన్ గౌడ్ తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. పాలకుల, అధికా రుల ఉదాసీనతను ఎండగడుతూ ఆయన స్పందిస్తూ — రైతును బతికున్నప్పుడే కాపాడుకోవాలి తప్ప.. పంటంతా ఎండిపోయాక, రైతు నిలువునా మునిగిపోయాక వచ్చి పరామర్శిస్తే ఏం లాభం? జూరాల కాలువకు నీళ్లు వదలాలని రెండు నెలల క్రితమే అధికారులకు, పాలకులకు వినతిపత్రాలు ఇచ్చాం. సమస్య తీవ్రతను ముందే వివరించాం. అప్పుడే అధికారులు స్పందించి కాలువల్లో నీరు వదిలి ఉంటే ఈ రోజు వేలాది ఎకరాలు ఎండిపోయేవి కావు. పంటంతా కాలి బూడిదయ్యాక ఇప్పుడు నాయకులు వచ్చి కాలువల దగ్గర చేస్తున్న హడావుడి చూస్తుంటే అసహ్యమేస్తోంది. రైతులకు కావాల్సింది మైకుల ముందు ప్రసంగాలు, నకిలీ పరామర్శలు కాదు.. పంటకు ప్రాణం పోసే చుక్క నీరు!" అని ధ్వజమెత్తారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వకపోతే.. కాలువలే పోరాట క్షేత్రాలు! ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి జూరాల, ఆర్డీఎస్ ప్రధాన కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని తక్షణమే విడుదల చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. నిర్లక్ష్యం కొనసాగితే కాలువలనే పోరాట క్షేత్రాలుగా మార్చి, రణభేరి మోగిస్తామని స్పష్టం చేశారు. కాలువల్లో ప్రవాహం పారే వరకు వెనక్కి తగ్గేదే లేదని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**మహబూబ్ నగర్ జిల్లా 22సెప్టెంబర్ (వుదయం బ్యూరో)**

ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల అటానమస్ మహబూబ్ నగర్ 2026 2027 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సులలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయుటకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ తెలియజేశారు కళాశాలలో బిఏ లో 01 బీకాంలో 40 బీఎస్సీ లైఫ్ సైన్సెస్ లో 24 బిఎస్సి ఫిజికల్ సైన్స్ లో 33 సీట్లు కలవు స్పాట్ అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 24 మరియు 25 తేదీలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని మరియు స్పాట్ అడ్మిషన్స్ పొందే విద్యార్థులకు ఎలాంటి స్కాలర్షిప్ సౌకర్యం ఉండదని తెలియజేశారు మహబూబ్నగర్ పట్టణ మరియు పరిసర ప్రాంత విద్యార్థినిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఇంటి నిర్మాణానికి ఉప్పల చేయూత



**వెల్దండ సెప్టెంబర్ 22 (వుదయం )**

మండల కేంద్రానికి చెందిన కాటమోని సైదులు , మొహమ్మద్ జాఫర్ , కాటమోని యాదయ్య ల ఇంటి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా నిర్మాణం ఫినిషింగ్ కొరకు సిమెంట్ బస్తాలు నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్థానిక మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ట్రస్టు ద్వారా ఫినిషింగ్ కొరకు సిమెంట్ అందజేశారు ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు కానుల జోగయ్య ఎంపీటీసీ చలిచీమల జ్యోతి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: పీయూ ప్రిన్సిపాల్



**మహబూబ్‌నగర్ జిల్లా 22 సెప్టెంబర్ (వుదయం బ్యూరో)**

విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పీయూ ప్రిన్సిపాల్ డా. డి. మధుసూదన్ రెడ్డి సూచించారు. పాలమూరు యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విర్చో పెట్రోకెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మంగళవారం అకడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని, ఎంపిక కాకపోయినా నిరాశ చెందకుండా మరిన్ని అవకాశాల కోసం ప్రయత్నించాలని సూచించారు. ఉద్యోగంలో పొందే అనుభవం భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలకు, అధిక వేతనాలకు దోహదపడుతుందని తెలిపారు. ఎం.ఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ అభ్యర్థులకు ట్రైనీ కెమిస్ట్, M.Tech, B.Tech, B.Sc, B.A, B.Com అభ్యర్థులకు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, ITI, డిప్లొమా అభ్యర్థులకు ప్రొడక్షన్ ట్రైనీ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. పోస్టులను బట్టి వార్షిక రూ.2.16 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు CTC అందుబాటులో ఉందని తెలిపారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య,ప్లేస్‌మెంట్ అధికారి డా. ఎస్.ఎన్. అర్జున్ కుమార్, విర్చో పెట్రోకెమికల్ హెడ్-ప్రొడక్షన్ పురుషోత్తం రెడ్డి, హెడ్-బయోటెక్ శ్యామ్ సుందర్, హెడ్-హెచ్ఆర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

**-జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్...**

**నారాయణఖేడ్: సెప్టెంబర్ 22 (వుదయం)**

వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ **అన్నారు.నారాయణఖేడ్ నియోజకవర్గంపరిధిలోని మానూర్** మండలం కమలాపూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభాయాత్ర మార్గాల్లో రోడ్ల పరిస్థితి, మరమ్మతులు, నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్, లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నారాయణఖేడ్, మానూర్, నాగల్ గిద్ద మండలాలకు సంబంధించిన వినాయకులు అధిక సంఖ్యలో రానున్న సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 9, 11 రోజులలో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ వెనూక నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీ ఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు, ఫైర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖఅధికారులు పాల్గొన్నారు.



## ముందస్తు గుర్తింపుతో గుండె వ్యాధులను నియంత్రించవచ్చు



**యశోద ఆసుపత్రి వైద్యులు గురురాజ్ ప్రమోద్**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి:**

గుండె సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించి, సకాలంలో తగిన చికిత్స అందించడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు గురురాజ్ ప్రమోద్ తెలిపారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలు రకాల గుండె జబ్బులకు శస్త్ర చికిత్స అవసరం లేకుండానే ట్యావి (TAVI) విధానం ద్వారా చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. యశోద ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంజియోగ్రామ్, స్టెంటింగ్, వాల్వ్ రీప్లేస్‌మెంట్, బైపాస్ సర్జరీ వంటి చికిత్సల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో ప్రతి మంగళవారం వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గురురాజ్ ప్రమోద్ కోరారు. సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీధర్ రావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

## విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి'



**సంగారెడ్డి వుదయం**

ప్రభుత్వ పాఠశాలల్లో కృత్యాధార విధానం ద్వారా ఉపాధ్యా యులంతా తరగతి బోధన చేసి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో విద్యా సాగర్ సూచించారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న సమావేశ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ఆత్మసాక్షిగా, పట్టుదలతో పనిచేస్తే పాఠశాలస్థాయి మరింత ఉన్నతంగా మారుతుందని, తద్వారా రాబోయేతరం నాణ్యమైన సమాజాన్ని నిర్మిస్తుందన్నారు.



# భారీ అంచనాల నడుమ
# 'ఆదర్శ కుటుంబం – AK47'
## అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్

**వుదయం సినిమా :**
విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల ఎంటర్‌టైనర్ మరో వారం ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకు విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న భారీ వినోదాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం - AK47' విడుదల తేదీ మారింది. తొలుత ప్రకటించిన తేదీ కంటే వారం ఆలస్యంగా, ఈ చిత్రాన్ని అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ప్రేక్షకులకు సంపూర్ణ వినోదానుభూతిని అందించాలనే ఉద్దేశంతో చిత్ర విడుదలను వారం రోజుల పాటు వాయిదా వేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. మధ్యతరగతి కుటుంబ నేపథ్యంలో వెంకటేష్ పాత్రను పరిచయం చేస్తూ.. హాస్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలతో టీజర్ ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు.
వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం - AK47' అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వరుస విజయాల దిశగా 'ప్యారడైజ్'



**వుదయం సినిమా :**
నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' విడుదల ముంగిట ఉంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో ముందస్తు విడుదల వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, నిర్మాతలు మరియు సాంకేతిక నిపుణులు హాజరై చిత్ర విజయాన్ని కాంక్షిస్తూ ప్రసంగించారు. కథానాయకుడు నాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారని, ఈ నెల 23వ తేదీ రాత్రి నుంచే థియేటర్లలో పండగ వాతావరణం నెలకొంటుందని ధీమా వ్యక్తం చేశారు. చిత్రంలో పనిచేసిన ప్రతి ఒక్కరి శ్రమకు తగ్గ గుర్తింపు లభిస్తుందని, విశేషంగా నటీనటులు మోహన్ బాబు, సోనాలి, సంపూర్ణేష్ బాబు, రాఘవ్ తదితరుల పాత్రలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటాయని తెలిపారు.
ఈ వేడుకలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు పాల్గొని ప్రసంగిస్తూ, దర్శకుడు శ్రీకాంత్‌కు తెలంగాణ సంస్కృతి, జీవనంపై ఉన్న పట్టును కొనియాడారు. ఈ చిత్రం విజయవంతమై రూ. 50 కోట్ల క్లబ్‌లో చేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కథానాయిక కయాదు లాహోర్ ఈ చిత్రంలో భాగమైనందుకు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ అవకాశం ఇచ్చిన నిర్మాణ సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ, సినిమాను ఇప్పటికే చూశానని, ప్రేక్షకుల ఆదరణతో చిత్రం విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. అలాగే ఇతర నిర్మాతలు సాహు గారపాటి, రవిశంకర్, నవీన్ యెర్నేని తదితరులు మాట్లాడుతూ ఇది నాని కెరీర్‌లోనే అత్యంత అద్భుతమైన చిత్రంగా నిలుస్తుందని, నైజాం ప్రాంతంలో సరికొత్త రికార్డులను నమోదు చేస్తుందని పేర్కొన్నారు.
చిత్రానికి పనిచేసిన సాంకేతిక బృందం తమ అనుభవాలను పంచుకున్నారు. గేయ రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో జానపద సోయగాలు మరియు తల్లికొడుకుల అనుబంధానికి సంబంధించిన శ్రావ్యమైన పాటలను రాసే అవకాశం లభించిందని తెలిపారు. పోరాట ఘట్టాల నిర్దేశకులు రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ మాట్లాడుతూ, నాని బేర్ బాడీతో శ్రమించి చేసిన సాహసోపేత ఘట్టాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయని, హాలీవుడ్ స్థాయి అనుభూతిని అందిస్తుందని చెప్పారు. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా ఈ సినిమా కోసం గ్రాండ్ అండ్ రస్టిక్ ప్రపంచాన్ని సృష్టించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, నటీనటులు మరియు ఇతర ప్రముఖులు విశేష సంఖ్యలో పాల్గొని చిత్రాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా 'తక్దీర్' మూవీ సాంగ్ షూటింగ్ ప్రారంభం



**వుదయం సినిమా :**
ఎస్‌వీఎన్ రావు సమర్పణలో, ఫ్లిమీ క్రియేషన్స్, ఆరెంజ్ మీడియా ఆర్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై తెరకెక్కుతున్న 'తక్దీర్' చిత్రానికి సంబంధించిన సాంగ్ షూటింగ్ పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో Dr చల్లగాలి వెంకటరాజు గారు ఫస్ట్ క్లాప్ కొట్టడం జరిగింది. మొదటగా సింగర్స్ శారదా సాయి, రామ్ దుర్వాసులతో పాడించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొని సినిమా విశేషాలను వెల్లడించారు. ఈ చిత్రానికి దీక్షిత్ జూకంటి దర్శకత్వం వహిస్తుండగా, కె. పరంధాములు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంగీతాన్ని కె. లక్ష్మణ్ సాయి అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీని భాస్కర్ నిర్వహిస్తున్నారు. చంద్ర ఆదిత్య సాహిత్యం అందిస్తున్నారు. సౌండ్ ఇంజనీర్ కేకే, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎం. మురళి రెడ్డి, ఫోటోగ్రఫీ బాధ్యతలను స్వామి, కోఆర్డినేషన్ బాధ్యతలను ఎన్. సహదేవ్ ముదిరాజ్ నిర్వహిస్తున్నారు. 'తక్దీర్' చిత్రంలోని సాంగ్ షూటింగ్ ప్రారంభం కావడంతో చిత్రంపై ఆసక్తి నెలకొంది. కుటుంబం, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

## ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్న
# 'వేదవ్యాస్' చిత్ర బృందం



**వుదయం సినిమా**
ప్రముఖ దర్శకుడు యస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో, పూర్వ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న 'వేదవ్యాస్' చలనచిత్ర బృందం ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. సాయిప్రగతి ఆర్ట్స్ పతాకంపై కె. అచ్చిరెడ్డి సమర్పణలో తెరకెక్కే ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా నిర్మాత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, దర్శకుడు యస్వీ కృష్ణారెడ్డి, సమర్పకులు కె. అచ్చిరెడ్డి మరియు కథానాయకుడు పిడుగు విశ్వనాథ్ స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులకు నిర్మాత ఆర్థిక సాయంతో కూడిన చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ చిత్రాన్ని దర్శకుడు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని, అతి త్వరలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని వెల్లడించారు. దర్శకుడు యస్వీ కృష్ణారెడ్డి మరియు సమర్పకులు అచ్చిరెడ్డి మాట్లాడుతూ సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా, ప్రతి ఒక్కరినీ అలరించే రీతిలో ఈ చిత్రాన్ని రూపొందించామని, ప్రజలందరికీ ఆ విఘ్నేశ్వరుని దివ్యాశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. కథానాయకుడిగా పరిచయమవుతున్న పిడుగు విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగానికి మరియు మన ప్రాచీన వేదాలు, సంస్కృతులకు మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారని తెలిపారు. తొలిచిత్రంలోనే ఇటువంటి గొప్ప అవకాశాన్ని ప్రసాదించిన వినాయకుడికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులలో మంచి గుర్తింపు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర సహ నిర్మాత మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ పత్రికేయులు ప్రభు తదితరులు పాల్గొన్నారు.


# 'తెల్లకాగితం' హృదయాలకు తాకే కథనం



**వుదయం సినిమా** శ్రీమతి కె. శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ పతాకంపై కృష్ణ కొమ్మాలపాటి నిర్మాణంలో, రమేష్ బండ్రెడ్డి దర్శకత్వంలో రూపొందిన నూతన చిత్రం 'తెల్లకాగితం' సంప్రదాయ ప్రకటనల ప్రదర్శన వేడుక మంగళవారం నగరంలో అత్యంత వైభవంగా జరిగింది. హర్ష్ రోషన్, నక్షత్ర ప్రధాన పాత్రలలో నటించిన ఈ చిత్రానికి నందు సవిరిగాన కథ, కథనం మరియు సంభాషణలు సమకూర్చారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఈ వేడుకకు సినీ ప్రముఖులు సాయి దుర్గ తేజ్, హరీష్ శంకర్, కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ, చిత్ర నిర్మాతతో ఉన్న పూర్వ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ 'తెల్లకాగితం' అనే పేరు మన ప్రశాంతమైన మనస్సుకు ప్రతీక అని, ఆ కాగితంపై ఏది రాస్తే అదే ప్రతిఫలిస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రం నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులందరికీ గొప్ప విజయాన్ని అందించాలని ఆకాంక్షించారు. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో పనిచేసిన ప్రతి ఒక్కరూ తమ నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారని, ముఖ్యంగా కథలో ఉన్న విశేషమైన భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. రచయిత, నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ సమాజంలోని యథార్థ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా ఈ కథనం సాగుతుందని, ఇది ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వుదయం సినిమా

## 19వ శతాబ్దపు సంప్రదాయ
# వేడుకలా 'ఏందయ్య సామీ..'



**వుదయం సినిమా :**
విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ.. ఐదు భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. "రణబాలి"లో విజయ్, రశ్మిక పెళ్లి వేడుక సందర్భంగా 'ఏందయ్య సామీ..' పాట చిత్రీకరించారు. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. ఈ పాటను అజయ్ అతుల్ మెలొడియస్ గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన లిరిక్స్ అందించగా, శ్వేతా మోహన్, అజయ్ గోగవలే మధురంగా పాడారు. 'ఏందయ్య సామీ..' పాట ఎలా ఉందో చూస్తే 'ఏందయ్యా సామీ ఇట్టగాస్తాందీ వెన్నెల, ఊపేస్తా ఉంది సిత్తరాలా ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వ[illegible] మారే ఝూముకి మందుపెట్టిందెవ్వ[illegible] మాయదారి మనస్సాగక జాగరమ[illegible] రా...' అంటూ మళ్లీ మళ్లీ వినాలనిపించే సాగుతుందీ పాట.
19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుం[illegible] 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలం[illegible] జరిగిన యదార్థ చారిత్రక సంఘటన[illegible] ఆధారంగా "రణబాలి" సినిమా రూపొ[illegible]దుతోంది. ఈ సినిమా పాన్ ఇండి[illegible] స్థాయిలో మూవీ లవర్స్ లో ఆసక్తి క[illegible]స్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ [illegible] టీజర్ మూవీపై అంచనాలు మరింత పెంచేసింది.

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'
# ఫ్యామిలీతో కలిసి చూడండి



**వుదయం సినిమా :**
ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఈ మూవీలో ఫహాద్ ఫాజిల్ హీరోగా నటించారు. ఈ సినిమాతో శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీని అక్టోబర్ 2న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో..
ఫహాద్ ఫాజిల్ మాట్లాడుతూ .. ''తెలుగు నుంచి నాకు ఇంత ప్రేమ వస్తుందని, హైదరాబాద్‌లో ఇంత లవ్ దొరకుతుందని అనుకోలేదు. గత కొన్ని నెలల నుంచి ఇక్కడే ఉంటున్నాను. హైదరాబాద్ బిర్యానీ తిని కాస్త లావెక్కాను (నవ్వుతూ). ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఫ్యామిలీతో కలిసి చూడండి. అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. కార్తికేయ, శోభు గారు గొప్ప నిర్మాతలు. సారా వల్ల ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకంగా మారింది. ఈ చిత్రం నాకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయింది. ఈ సినిమా ఆడియెన్స్‌కి కచ్చితంగా కనెక్ట్ అవుతుంది. మాకు ఈ సినిమా విషయంలో సపోర్ట్ చేసిన బాలయ్య గారికి, కమల్ గారికి, మోహన్ లాల్ గారికి థాంక్స్.' అని అన్నారు.
ఎస్ఎస్ కార్తికేయ మాట్లాడుతూ .. ''డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చాలా కొత్తగా ఉంటుంది. శశాంక్ కథను, స్క్రీన్ ప్లేని చాలా కొత్తగా రాసుకున్నాడు. టీజర్‌తో కొంత కథను రివీల్ చేశారు. ట్రైలర్‌తో మరి కొంత కథను చెప్పే ప్రయత్నం చేశాను. ఫహాద్‌ని తెలుగులో ఇంట్రడ్యూస్ చేస్తుండటం ఆనందంగా ఉంది. సారా అద్భుతంగా నటించింది. ఈ పాపతో చాలా సర్ ప్రైజ్‌లు ఉంటాయి. శోభు గారితో ప్రయాణం ఎప్పుడూ గొప్పగానే ఉంటుంది. సినిమాని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.
శోభు యార్లగడ్డ మాట్లాడుతూ .. 'ఫహాద్‌ని తెలుగులో లీడ్‌గా ఇంట్రడ్యూస్ చేస్తుండటం ఆనందంగా ఉంది. శశాంక్‌ని ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. సారాని చూసి అందరూ సర్ ప్రైజ్ అవుతారు. కార్తికేయతో పది, పదిహేనేళ్ల జర్నీ ఉంది. ఈ సినిమాకి మేం కలిసి పని చేయ[illegible] ఆనందంగా ఉంది' అని అన్నారు.
దర్శకుడు శశాంక్ యేలేటి మాట్లాడు[illegible] .. ''డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'కి వాయి[illegible] ఓవర్ ఇచ్చిన బాలయ్య గారికి థాంక్స్. చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. ట్రై[illegible] అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నా[illegible] మున్ముందు మరిన్ని విషయాల్ని పంచుక[illegible]టాను' అని అన్నారు.
చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ .. 'డోం[illegible] ట్రబుల్ ది ట్రబుల్' సినిమాకు [illegible] చేయడం ఆనందంగా ఉంది. మా ట్రై[illegible] అందరికీ నచ్చిందని అనుకుంటున్నా[illegible] దివ్య, సూరి ప్రపంచాన్ని ఈ ట్రైలర్ కాస్త పరిచయం చేశాం. నాకు నటన ఎన్నో విషయాల్ని నేర్పించిన శశా[illegible] గారికి థాంక్స్. దివ్య పాత్రను నా[illegible] ఇచ్చిన కార్తికేయ గారికి, శోభు గా[illegible] థాంక్స్. ఫహాద్ గారితో పని చేయడం అదృష్టం. సెట్ లో నన్ను ఎంతో ప్రేమ[illegible] చూసుకున్నారు. అక్టోబర్ 2న మా చిత్ర[illegible] రాబోతోంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో వ[illegible] అందరూ కలిసి మా సినిమాని చు[illegible] ఎంజాయ్ చేయండి' అని అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.